VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : ఆదివారం 26.07.2026

సంపుటి : 09 సంచిక : 47 , పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com



## మోదీకి మరో ప్రపంచ రికార్డు

- 24 గంటల్లో 10 లక్షల కొత్త ఇన్‌స్టా ఫాలోవర్లు
- 30.3 కోట్ల వ్యూస్‌తో ప్రపంచ రికార్డు

# చట్ట సభల్లోకి జెన్ జీ....





- 21 ఏళ్లకే శాసనసభ, లోక్‌సభ, 25 ఏళ్లకే మండలి, రాజ్యసభకు పోటీ
- జెన్ జీకి అవకాశం కల్పించాలంటూ శాసనసభలో ప్రత్యేక తీర్మానం
- లోక్‌సభలో 1 శాతం కంటే తక్కువగా జెన్ జీ ప్రాతినిధ్యం
- రాహుల్ మంత్రివర్గంలో జెన్ జీకే విద్యా శాఖ
- జెన్ జీ నిరసన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి
- జంతర్‌మంతర్‌లో విద్యార్థులపై దాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

**హైదరాబాద్ వెలుతురు జూలై 25:**

అత్యున్నత చట్ట సభలైన శాసనసభ, శాసనమండలి, లోక్‌సభ, రాజ్యసభల్లో జెన్ జీ తరం ప్రాతినిధ్యం వహించాలని, అందుకు అవసరమైన తీర్మానాన్ని శాసనసభలో ఆమెదించి కేంద్రానికి పంపుతామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రపంచంలో అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో 21 ఏళ్లకే ప్రధానమంత్రులు అవుతున్నప్పుడు మన దేశ యువతకు ఎందుకు ఆ అవకాశం ఉండకూడదని ఆయన ప్రశ్నించారు. నీట్ ప్రశ్నా పత్రాల లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లింపు డిమాండ్, జంతర్‌మంతర్‌లో విద్యార్థులపై లాఠీఛార్జీకి నిరసనగా పీపుల్స్ ప్లాజా నుంచి నెక్లెస్ రోడ్డు వరకు పీసీసీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించిన కొవ్వొత్తు ర్యాలీలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పాల్గొన్నారు.

▶ మిగతా 2లో

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా!

- ప్రధాని నరేంద్ర మోదీకి పంపిన రాజీనామా లేఖ
- సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా వెల్లడించిన మంత్రి
- కేంద్రంతో 'కాక్రోచ్ జనతా పార్టీ' మూడో విడత చర్చల వేళ కీలక పరిణామం
- గత నెల రోజులుగా జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల నిరసనలు
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామానే ప్రధాన డిమాండ్‌గా ఉద్యమం
- మంత్రి తొలగింపుపై మొండికేసిన సీజేపీ



- ఆందోళనకారుల ప్రధాన డిమాండ్లకు ఒకే చెప్పిన కేంద్రం
- కేసుల ఉపసంహరణ, ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం

## ఇది విద్యార్థుల విజయం

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై సీజేపీ స్పందన
- 'నీట్' వివాదం నేపథ్యంలో తలొగ్గిన ధర్మేంద్ర ప్రధాన్
- విద్యార్థుల విజయంగా అభివర్ణించిన 'కాక్రోచ్ జనతా పార్టీ'
- మిగతా డిమాండ్లు నెరవేరేవరకు ఉద్యమం ఆగేది లేదని హెచ్చరిక

**న్యూఢిల్లీ, వెలుతురు జూలై 25:**

దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపిన 'నీట్' పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. విద్యార్థి సంఘాల ఆందోళనలు, ప్రజాస్వామ్యవాదుల తీవ్ర నిరసనల మధ్య కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. నీట్ పరీక్ష నిర్వహణలో తలెత్తిన తీవ్ర లోపాలు, తదనంతర పరిణామాలకు బాధ్యత వహిస్తూ ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు.



జంతర్ మంతర్ వద్ద సంబరాలు

కేంద్ర మంత్రి రాజీనామా వార్త వెలువడటంతో దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన బాట పట్టిన విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కాక్రోచ్ జనతా పార్టీ (CJP) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మాట్లాడుతూ, ఇది ముమ్మాటికీ విద్యార్థుల ఐక్యత, శాంతియుత పోరాటానికి దక్కిన విజయమని కొనియాడారు. "గాంధేయ మార్గంలో చేసే ఏ పోరాటమైనా ఆశించిన ఫలితాన్ని ఇస్తుందని మరోసారి నిరూపితమైంది. దేశ యువత సత్తా ఏంటో ఈ విజయం చాటిచెప్పింది" అని ఆయన వ్యాఖ్యానించారు.

▶ మిగతా 2లో

## విద్యార్థులకు క్షమాపణ చెప్పండి



- ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ డిమాండ్
- విద్యార్థుల పోరాటానికి రాహుల్ గాంధీ మద్దతు
- విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాల్సిందేనని డిమాండ్
- సీజేపీ మూడు డిమాండ్లు నెరవేర్చాలని విజ్ఞప్తి
- పోరాటం ఆగదని ప్రతిపక్ష నేత హెచ్చరిక
- స్వగృహంలో విద్యార్థులతో సమావేశం

▶ మిగతా 12లో

## ప్రజా పరీక్షల చట్టంలో కఠిన మార్పులు



- ప్రశ్నాపత్రాల లీకేజీకి 10 ఏళ్ల జైలు శిక్ష
- రూ. 5 కోట్ల వరకు భారీ జరిమానాలు
- పార్లమెంటు ముందుకు సవరణ బిల్లు
- కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం
- ప్రశ్నాపత్రాల లీకేజీలు, మోసాలకు చెక్
- అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించేలా నిబంధనలు

**న్యూఢిల్లీ, వెలుతురు, జూలై 25:**

దేశవ్యాప్తంగా పోటీ పరీక్షలు, ప్రభుత్వ ఉద్యోగాల నియామక పరీక్షల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం మరో కీలకమైన అడుగు వేసింది.

▶ మిగతా 2లో

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థి యువత విజయం:మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ వెలుతురు జూలై 25:**



కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశవ్యాప్తంగా విద్యార్థుల ఐక్య పోరాటానికి దక్కిన విజయం.ఇది ఒక్క వ్యక్తి రాజీనామా కాదు, విద్యార్థి శక్తి ముందు అహంకార రాజకీయాలు తలవంచిన సందర్భం.ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కేంద్ర బీజేపీ ప్రభుత్వం గద్దె దిగడానికి తొలి మెట్టువిద్యార్థుల ఉద్యమం, ప్రతిపక్షాల పోరాటం, ముఖ్యంగా రాహుల్ గాంధీ గారి నిరంతర ఒత్తిడి కారణంగానే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది.

## ఎల్‌నినో సవాళ్లకు మైక్రో ఇరిగేషనే పరిష్కారం



- మైక్రో ఇరిగేషన్ కంపెనీలతో మంత్రి తుమ్మల భేటీ
- రైతులకు అండగా నిలవాలని మంత్రి పిలుపు
- డ్రిప్, తుంపర సేద్యంతోనే నీటి ఎద్దడికి చెక్

## రియల్ ఎస్టేట్‌లో రికార్డు స్థాయి వృద్ధి



- హైదరాబాద్ రియల్ ఎస్టేట్ పడిపోయిందనేది గోబెల్స్ ప్రచారం
- వివరాలతో సహా కొట్టిపారేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందనే ప్రచారంలో నిజం లేదు
- నగరంలో ప్లాట్ల విక్రయాలు 40 శాతం పెరిగాయని వెల్లడి

## రాజీనామా తప్ప ఇంకో చర్చే లేదు



- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై సీజేపీ పట్టు
- మూడో విడత చర్చలకు ముందు వైఖరి కఠినతరం
- మంత్రి రాజీనామా తప్ప మరో అంశంపై చర్చ లేదన్న సీజేపీ

## త్యాగం కాదు.. విద్యార్థుల రక్షణే ముఖ్యం

సామాజిక కార్యకర్త సోనం వాంగ్ చుక్



- మంత్రి రాజీనామా కంటే విద్యార్థులపై కేసులు పడకూడదనేదే ప్రాధాన్యం
- అందుకే నిరాహార దీక్ష విరమించానన్న వాంగ్ చుక్
- రాజీనామా కోసం కేంద్రంపై ఒత్తిడి కొనసాగుతుందని స్పష్టం
- "డీల్ చేసుకుని దీక్ష విరమించలేదు" అంటూ విమర్శలకు కౌంటర్
- శాంతియుత నిరసనకారులపై కేసులు పెట్టబోమని కేంద్రం లిఖితపూర్వక హామీ

## తాగునీటి ఎద్దడి రానీయొద్దు: మంత్రి సీతక్క

- 100 రోజుల ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం
- సింగూరు, పాలేరు నీటి నిల్వలపై నిరంతర పర్యవేక్షణకు ఆదేశం
- ఊరూరా వాట్సాప్ గ్రూపుల ద్వారా సమాచారం

**హైదరాబాద్, వెలుతురు, జూలై 25**



రాష్ట్రంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో మిషన్ భగీరథ అధికారులతో ఆమె ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

## చట్ట సభల్లోకి జెన్ జీ....

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం వేలాదిగా తరలివచ్చిన జెన్ జీని ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. సింగపూర్, బ్రిటన్, జర్మనీ వంటి దేశాల్లో 21 ఏళ్లకే ప్రధానమంత్రులు అయ్యే అవకాశం ఉందని, మన దేశంలోనూ ఆ అవకాశం జెన్ జీకి ఇవ్వాల్సి ఉందన్నారు. రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు 61వ రాజ్యాంగ సవరణ చేసి ఓటు హక్కును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించారని సీఎం తెలిపారు. నాడు రాజీవ్ గాంధీ తీసుకున్న నిర్ణయంతోనే నూనుగు మీసాల యువకులు, సోదరీమణులు ఓటు హక్కు పొందగలిగారని చెప్పారు. అలాగే పి.వి.నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల్లో మేయర్లు, జడ్పీ ఛైర్మన్లు వంటి పోస్టులకు ఎన్నికయ్యే వయస్సును 25 నుంచి 21 ఏళ్లకే తగ్గించారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. నాడు కాంగ్రెస్ ప్రధానమంత్రులు తీసుకున్న నిర్ణయంతోనే యువత 18 ఏళ్లకే ఓటు వేయగలుగుతున్నారని, 21 ఏళ్లకే స్థానిక సంస్థల్లో పదవులు సాధించగలుగుతున్నారని తెలిపారు. 21 ఏళ్లకే ఒక సోదరీమణి తిరువనంతపురం మేయర్‌గా ఎంపిక కావడానికి నాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అవకాశమే కారణమన్నారు. లోక్‌సభలో 543 మంది ఎంపీలు ఉంటే 1 శాతానికి లోపే జెన్ జీ ప్రాతినిధ్యం ఉందన్నారు. 30 శాతంగా ఉన్న జెన్ జీకి లోక్‌సభలో 1 శాతం కన్నా తక్కువ ప్రాతినిధ్యం ఉండడం సరికాదన్నారు. 21 ఏళ్లకే లోక్‌సభకు, శాసనసభకు పంపించే బాధ్యత తాము తీసుకుంటామని... అందుకు మీరు సిద్ధంగా ఉన్నారా అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించగా.. తాము సిద్ధమని జెన్ జీ స్పందించింది. జెన్ జీ సమస్యలు పరిష్కారం కావాలంటే చట్ట సభల్లోనూ వాళ్ల ప్రాతినిధ్యం ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఇందుకోసం శాసనసభ, లోక్‌సభలకు 21 ఏళ్లకు, శాసనమండలి, రాజ్యసభకు 25 ఏళ్లకే పోటీ చేసే అవకాశం కల్పించాలని తాము డిమాండ్ చేస్తున్నామని సీఎం అన్నారు. ఈ అంశంపై ఆగస్టు మొదటి వారంలో శాసనసభ, శాసనమండలిని ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి చట్టసభల్లో పోటీ చేసే వయస్సు తగ్గింపు తీర్మానం పెట్టి ఆమోదిస్తామని సీఎం తెలిపారు. ఆ తీర్మానాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని సీఎం వెల్లడించారు. దేశంలో అత్యున్నతమైన సివిల్ సర్వీసుకు 21 ఏళ్లకే ఎంపికయ్యే అవకాశం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా 21 ఏళ్ల వయస్సుకే శ్రీలక్ష్మి , 22 ఏళ్లకే మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన అనన్య, 22 ఏళ్లకే ప్రస్తుత డీజీపీ సి.వి.ఆనంద్ ఐపీఎస్‌లుగా ఎంపికైన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ కు ప్రదర్శనగా కాదని, రోడ్లపై నుంచి నేరుగా పార్లమెంట్‌లోకి (సడక్ సే సంసద్) వెళ్లేలా యువత ఉండాలన్నారు. 21 ఏళ్లకే లోక్‌సభకు పోటీ చేసే అవకాశం ఉంటే సభలోనే జెన్ జీ గళాన్ని వినిపించే అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. లోక్‌సభ, రాజ్యసభల్లో జెన్ జీ గళం వినిపించడం ద్వారా యువతకు దేశాన్నిపాలించే అవకాశం ఇవ్వాలని శాసనసభలో తీర్మానం చేస్తామని సీఎం పునరుద్ఘాటించారు. కేంద్రంలో రాహుల్ గాంధీ నేతృత్వంలో ఏర్పాటయ్యే ప్రభుత్వం విద్యా శాఖ జెన్ జీ నేతకు వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ అంశంలో రాహుల్ గాంధీని, ఇండియా కూటమి నేతలను ఒప్పిస్తానని సీఎం తెలిపారు. విద్యా శాఖ, ఐటీ శాఖ వంటి కీలకమైన శాఖలు.. 60, 70, 90 ఏళ్ల వాళ్లకు కాదు 21 వాళ్లకే ఇవ్వాలని, వాళ్లకేం కావాలో వాళ్లకే తెలుసని సీఎం అన్నారు. జెన్ జీ పోరాట పటిమను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశంసించారు. జెన్ జీ సాధించిన విజయాలను కాంగ్రెస్ పార్టీ ఖాతాలో రాసుకునే ఉద్దేశం తమకు లేదని సీఎం స్పష్టం చేశారు. లాఠీలు, తూటాలకు తలవంచకుండా పోరాడి 56 అడుగుల ఛాతీ అని చెప్పుకునే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మెడలు వంచి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించాగలిగారని ప్రశంసించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో పోరాటం ముగిసిపోలేదని సీఎం అన్నారు. పరీక్ష పేపర్ల లీక్‌తో చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లింపు, ఉద్యమం సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులపై కేసులు సోమవారం లోపు ఎత్తివేయకపోతే పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ, ఖర్గేల నాయకత్వంలో కాంగ్రెస్ పోరాడుతుందని సీఎం తెలిపారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, అరికెపూడి గాంధీ, వల్లాల నవీన్ యాదవ్, శ్రీగణేష్, మల్ రెడ్డి రంగారెడ్డి, టి.రామ్మోహన్ రెడ్డి, సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీపీఐ నేత పల్లా వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇది విద్యార్థుల విజయం

### అక్కడక్కడే ఆగబోం: విద్యార్థి నేతలు

కేంద్ర మంత్రి రాజీనామాతో తమ ప్రాథమిక డిమాండ్ నెరవేరినప్పటికీ, పోరాటం ఇంకా ముగిసిపోలేదని సీజేపీ నాయకులు స్పష్టం చేశారు. తమ ఇతర కీలక డిమాండ్లయిన——శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై దాడి చేసిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవడం మరియు నమోదు చేసిన కేసులన్నింటినీ బేషరతుగా ఎత్తివేయడం——నెరవేరే వరకు విశ్రమించేది లేదని తేల్చిచెప్పారు. విద్యావ్యవస్థను సమగ్రంగా ప్రక్షాళన చేసేందుకు సాయంత్రం 6.30 గంటలకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థి యువత...

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాస్వామ్యంలో విద్యార్థుల గొంతును అణచివేయాలని చేసిన ప్రతి ప్రయత్నానికి ఈ పరిణామం గట్టి సమాధానం.విశ్వవిద్యాలయాలపై ఆంక్షలు, విద్యార్థుల నిరసనలను అడ్డుకోవడం, ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడం చివరకు ప్రభుత్వానికే నష్టాన్ని మిగిల్చింది.విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడితే దేశ యువత తగిన సమాధానం చెబుతుందని ఈ ఉద్యమం నిరూపించింది.రాజ్యాంగం కల్పించిన నిరసన తెలిపే హక్కును హరిస్తే ప్రజలు మరింత ఐక్యంగా పోరాడతారని కేంద్ర ప్రభుత్వం గ్రహించాలి.ఈ రాజీనామా దేశ ప్రజల్లో కేంద్ర ప్రభుత్వంపై పెరుగుతున్న అసంతృప్తికి నిదర్శనం.విద్య, ఉపాధి, యువత భవిష్యత్తు అంశాల్లో కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని పూర్తిగా మార్చుకోవాలి.ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు, విద్యార్థుల హక్కులను రక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజలతో కలిసి నిరంతరం పోరాడుతూనే ఉంటుంది.ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులకు, యువజన సంఘాలకు, ప్రజాస్వామ్య శక్తులందరికీ అభినందనలు తెలియజేస్తున్నాం.ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలతో కలిసి మరింత బలంగా పోరాటాన్ని కొనసాగిస్తాం.

## తాగునీటి ఎద్దడి రానీయొద్దు...

(మొదటి పేజీ తరువాయి)

వేసవిని దృష్టిలో ఉంచుకొని ముందస్తు జాగ్రత్తగా 100 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను (యాక్షన్ ప్లాన్) సిద్ధం చేసినట్లు మంత్రి వెల్లడించారు.

### రోజువారీ నీటిమట్టాలపై సమీక్ష

సింగూరు, పాలేరు వంటి ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు స్పష్టం చేశారు. రోజువారీగా రిజర్వాయర్ల నీటిమట్టాలను సమీక్షిస్తూ పరిస్థితికి తగినట్లు సరఫరా ప్రణాళికలు రూపొందించాలన్నారు. కేవలం ప్రధాన మూలాలపైనే ఆధారపడకుండా స్థానిక నీటి వనరులను కూడా పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు.

### భూగర్భ జలాల పెంపే లక్ష్యం

భూగర్భ జలమట్టాలను పెంచేందుకు వీలుగా బోర్‌వెల్స్ వద్ద రీఛార్జింగ్ పిట్స్ నిర్మాణం, వర్షపు నీటి నిల్వ (రైన్‌వాటర్ హార్వెస్టింగ్) పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

### గ్రామాల్లో వాట్సాప్ గ్రూపులు

నీటి సరఫరా ప్రక్రియలో పారదర్శకత, వేగం పెంచేందుకు ప్రతి గ్రామంలోనూ ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. తాగునీటి సరఫరా సమయాలు, సమస్యలపై స్థానికులకు ఎప్పటికప్పుడు సమాచారం చేరవేసేలా ఈ గ్రూపులు పనిచేస్తాయన్నారు. క్షేత్రస్థాయిలో సర్పంచ్‌లు, వార్డు సభ్యులు మరియు మహిళా సంఘాల భాగస్వామ్యంతో సమన్వయంగా నీటి నిర్వహణ చేపట్టి ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

# మోదీకి మరో ప్రపంచ రికార్డు

- ఫిఫా ఫైనల్‌పై ఐషో స్పీడ్ వీడియో రికార్డు బద్దలు
- జెన్-జీ స్టైల్ వీడియోకు యువత నుంచి భారీ స్పందన
- స్పందించిన విద్యార్థులకు మరో వీడియోతో ధన్యవాదాలు
- సోషల్ మీడియాలో చురుకుగా ఉండాలని మంత్రులకు మోదీ సూచన

**న్యూఢిల్లీ వెలుతురు జూలై 25:**

ప్రధాని నరేంద్ర మోదీ సోషల్ మీడియాలో మరో అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నారు. నీట్–2026 ప్రశ్నపత్రాల లీకేజీ నేపథ్యంలో విద్యార్థులను ఉద్దేశించి జెన్–జీ శైలిలో అర్ధరాత్రి విడుదల చేసిన సెల్ఫీ వీడియో ప్రపంచ వ్యాప్తంగా భారీ స్పందన దక్కించుకుంది. ఈ వీడియోతో కేవలం 24 గంటల్లోనే మోదీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు దాదాపు 10 లక్షల మంది కొత్త ఫాలోవర్లు చేరగా, అదే సమయంలో వీడియోకు 303 మిలియన్ల (30.3 కోట్ల) వీక్షణలు నమోదయ్యాయి. దీంతో 2026 ఫిఫా ప్రపంచకప్ ఫైనల్ సందర్భంగా ఐషో స్పీడ్ విడుదల చేసిన వీడియో పేరిట ఉన్న 300 మిలియన్ల వ్యూస్ రికార్డును అధిగమించినట్లు తెలుస్తోంది.ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్‌లో 100 మిలియన్లకు పైగా (10.2 కోట్లకు పైగా) ఫాలోవర్లతో ప్రపంచంలోనే అత్యధిక మంది అనుసరించే గ్లోబల్ రాజకీయ నాయకుడిగా మోదీ కొనసాగుతున్నారు. "ఫ్రెండ్స్..." అంటూ ప్రారంభమైన ఆయన జెన్–జీ శైలి ప్రసంగం యువతను విశేషంగా ఆకట్టుకోవడంతో, అదే శైలిని అనుకరిస్తూ వేలాది రీల్స్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా జెన్–జీ తరాన్ని దృష్టిలో పెట్టుకుని మోదీ అనుసరించిన ఈ కొత్త కమ్యూనికేషన్ విధానం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది.ప్రశ్నపత్రాల లీక్‌లను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరిస్తూ విడుదల చేసిన వీడియోకు విద్యార్థుల నుంచి విశేష స్పందన రావడంపై ప్రధాని సంతోషం వ్యక్తం చేశారు. వారికి ధన్యవాదాలు తెలుపుతూ మరో వీడియోను కూడా విడుదల చేశారు.ఇదిలా ఉండగా, కేంద్ర మంత్రులు అందరూ సోషల్ మీడియాలో మరింత చురుకుగా ఉండాలని, యువతతో నేరుగా మమేకమవుతూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఇటీవల జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ప్రధాని మోదీ సూచించినట్లు సమాచారం.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా!

- యవత కలలను నెరవేర్చడమే తమ లక్ష్యమన్న ధర్మేంద్ర ప్రధాన్

**న్యూఢిల్లీ వెలుతురు జూలై 25:**

దేశ రాజధానిలో విద్యార్థుల ఆందోళనల నడుమ ఒక ఊహించని కేంద్ర రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. దేశ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా లేఖను ప్రధాని నరేంద్ర మోదీకి పంపించారు.కేంద్ర ప్రభుత్వానికి, 'కాక్రోచ్ జనతా పార్టీ' (CJP)కి మధ్య మూడో విడత చర్చలు జరగడానికి కొన్ని గంటల ముందే ధర్మేంద్ర ప్రధాన్ తన రాజీనామా విషయాన్ని సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) ద్వారా అధికారికంగా ప్రకటించారు.గత నెల రోజులకు పైగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు చేపట్టిన భారీ నిరసనలకు ప్రధాన కారణం విద్యాశాఖ మంత్రి రాజీనామా డిమాండే కావడం గమనార్హం. ఈ రాజీనామా అంశంపైనే ప్రభుత్వం, సీజేపీ నాయకుల మధ్య చర్చలు నిలిచిపోయాయి. శనివారం ఉదయం కూడా "ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రివర్గం నుండి తొలగిస్తేనే తదుపరి చర్చలు ఉంటాయి, లేకపోతే లేవు" అని సీజేపీ స్పష్టం చేసింది. దాంతో ఏర్పడిన రాజ్యాంగ, రాజకీయ సంక్షోభాన్ని నివారించేందుకు మంత్రి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో, ఆందోళనకారులు ప్రతిపాదించిన అన్ని ప్రధాన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చినట్లయింది. విద్యార్థులు ప్రధానంగా మూడు డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారు:

1. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం,
2. ఆందోళనలు చేస్తున్న విద్యార్థులపై ఎలాంటి చట్టపరమైన కేసులు నమోదు చేయకపోవడం,
3. నీట్ (NEET) పేపర్ లీకేజీ కారణంగా మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు తగిన పరిహారం అందించడం.

శుక్రవారం నాటి చర్చల్లో చివరి రెండు డిమాండ్లకు అంగీకరించిన కేంద్ర ప్రభుత్వం, మంత్రి రాజీనామాపై మాత్రం అప్పట్లో ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. అయితే శనివారం నాటి పరిణామంతో ఆ డిమాండ్‌ను కూడా నెరవేర్చింది.

తన రాజీనామా ప్రకటనలో ధర్మేంద్ర ప్రధాన్ స్పందిస్తూ —— "ఈ దేశ యువత ఆశయాలు, సెంటిమెంట్లు మరియు వారి న్యాయమైన నిరీక్షణలను నేను ఎంతగానో గౌరవిస్తాను. భారతదేశపు యవత కలలను నెరవేర్చడమే నా రాజకీయ, సామాజిక జీవితానికి ఉన్న నైతిక బలం. ప్రధాని నరేంద్ర మోదీ దూరదృష్టి కలిగిన నాయకత్వంలో దేశానికి సేవ చేసే అవకాశం ఇచ్చినందుకు వారికి నా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను" అని పేర్కొన్నారు.

## ప్రజా పరీక్షల చట్టంలో కఠిన...

(మొదటి పేజీ తరువాయి)

దీనికోసం 'ప్రజా పరీక్షల (సవరణ) బిల్లు–2026'ను సిద్ధం చేసింది. రాబోయే సోమవారం రోజే ఈ సవరణ బిల్లును పార్లమెంటు సభల ముందుకు తీసుకువచ్చే అవకాశం ఉందని ఉన్నత వర్గాల సమాచారం. విద్యార్థులు, నిరుద్యోగ యువత భవిష్యత్తుతో ఆడుకునే అక్రమార్కులకు గుణపాఠం చెప్పేలా ఈ బిల్లులో అత్యంత కఠినమైన నిబంధనలను పొందుపరిచారు.ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా వివిధ పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలు, పరీక్షా కేంద్రాల్లో హైటెక్ మోసాలు, ఇతర అక్రమ పద్ధతులు విస్తృతంగా వెలుగులోకి వచ్చాయి. దీనివల్ల రాత్రింబవళ్లు కష్టపడి చదివే అర్హులైన విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. ఈ పరిస్థితిని సమూలంగా మార్చేందుకు, పరీక్షల వ్యవస్థలో పారదర్శకతను పునరుద్ధరించేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త సవరణలను రూపకల్పన చేసింది. ఈ చట్టం అందుబాటులోకి వస్తే అక్రమాలకు పాల్పడాలనే ఆలోచన చేయడానికే భయపడే పరిస్థితి వస్తుంది.కొత్తగా ప్రతిపాదించిన సవరణల ప్రకారం, ప్రశ్నాపత్రాల లీకేజీకి పాల్పడినా లేదా పరీక్షల్లో అక్రమ పద్ధతులు, మోసాలను ప్రోత్సహించినా సదరు వ్యక్తులకు విధించే శిక్షల కాలాన్ని భారీగా పెంచారు. ఇదివరకు ఉన్న నిబంధనలను సవరిస్తూ కనీసం ఐదేళ్ల నుంచి గరిష్ఠంగా 10 ఏళ్ల వరకు కఠిన జైలు శిక్ష విధించేలా చట్టంలో స్పష్టమైన మార్పులను ప్రభుత్వం తీసుకువచ్చింది. దీనివల్ల లీకేజీ ముఠాలకు సరైన హెచ్చరిక పంపినట్లవుతుందని భావిస్తున్నారు.శిక్షల కాలంతో పాటు విధించే ఆర్థిక జరిమానాల (పెనాల్టీల) పరిమాణాన్ని కూడా ప్రభుత్వం ఐదు రెట్లు పెంచింది. పరీక్షల మోసాల్లో భాగస్వాములైన వ్యక్తులకు ప్రస్తుతం ఉన్న చట్టం ప్రకారం రూ. 10 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉండగా, సవరించిన బిల్లులో ఈ మొత్తాన్ని ఏకంగా రూ. 50 లక్షలకు పెంచాలని నిర్ణయించారు. ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ తీయడం ద్వారా ఇటువంటి నేరాలను అరికట్టవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.వ్యక్తులతో పాటు పరీక్షలను నిర్వహించే బాధ్యతను తీసుకునే ప్రైవేట్ సర్వీస్ ప్రొవైడర్లు, కంపెనీలు, ఏజెన్సీలు అక్రమాలకు పాల్పడితే వారిపై మరింత కఠినంగా వ్యవహరించనున్నారు. ఏజెన్సీలకు విధించే జరిమానాను ప్రస్తుతం ఉన్న రూ. కోటి నుంచి రూ. 5 కోట్లకు పెంచాలని బిల్లులో ప్రతిపాదించారు. సాంకేతిక లోపాలు లేదా అంతర్గత అవినీతి వల్ల పేపర్లు లీక్ అయితే సదరు కంపెనీల నుంచి భారీ మొత్తంలో కోలుకునేలా ఈ సవరణ చేసింది.కేవలం జరిమానాలతో సరిపెట్టకుండా, అక్రమాలకు లేదా నిర్లక్ష్యానికి ఒడిగట్టిన ప్రైవేట్ సర్వీస్ ప్రొవైడర్లను, ఏజెన్సీలను ప్రభుత్వ పరీక్షల నిర్వహణ ప్రక్రియ నుంచి దీర్ఘకాలం పాటు పక్కన పెట్టాలని నిర్ణయించారు. ప్రస్తుతం అక్రమాలకు పాల్పడిన కంపెనీలపై నాలుగేళ్ల నిషేధం విధిస్తుండగా, కొత్త నిబంధనల ప్రకారం ఆ కాలాన్ని రెట్టింపు చేస్తూ ఎనిమిదేళ్ల పాటు ఏ రకమైన ప్రజా పరీక్షలను నిర్వహించకుండా నిషేధించే కఠినమైన షరతును చేర్చారు.ఈ చట్ట సవరణల వల్ల దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులకు, నిరుద్యోగులకు పెద్ద ఊరట లభించనుంది. కష్టపడి చదివే విద్యార్థుల శ్రమ వృథా కాకుండా, కేవలం ప్రతిభ ఉన్నవారికే ఉద్యోగాలు, ఉన్నత విద్యలో సీట్లు దక్కేలా ఈ కొత్త చట్టం రక్షణ కవచంలా పనిచేస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు. అక్రమార్కుల వ్యవస్థీకృత నేరాలను తుదముట్టించేందుకు ఈ మార్పులు ఎంతగానో తోడ్పడనున్నాయి.కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా సిద్ధం చేసిన ఈ ప్రజా పరీక్షల (సవరణ) బిల్లు–2026 సోమవారం నాటి పార్లమెంటు సమావేశాల్లో చర్చకు రానుంది. ఉభయ సభల ఆమోదం పొంది, రాష్ట్రపతి సంతకం పూర్తయిన తర్వాత ఇది అధికారికంగా చట్టరూపం దాలుస్తుంది. విద్యా, ఉద్యోగ రంగాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టే ఈ బిల్లు ఆమోదం పొందడంపై దేశమంతటా తీవ్ర ఆసక్తి నెలకొంది.

# ఎల్-నినో సవాళ్లకు మైక్రో ఇరిగేషనే పరిష్కారం

- వేగవంతంగా పనులు పూర్తి చేయాలని ఆదేశం
- కార్యాచరణ ప్రణాళికల రూపకల్పనపై దృష్టి
- అనుమతుల మంజూరులో జాప్యం ఉండొద్దని స్పష్టం

**హైదరాబాద్, వెలుతురు, జూలై 25,:**



తెలంగాణ సచివాలయంలో మైక్రో ఇరిగేషన్ (సూక్ష్మ సాగునీటి) కంపెనీల ప్రతినిధులతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వర్షాభావ పరిస్థితులు, ఎల్–నినో ప్రభావం వల్ల ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కంపెనీలు రైతులకు పూర్తిస్థాయిలో అండగా నిలవాలని మంత్రి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చి, నీటి కొరత ప్రభావం పంటలపై పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.ఈ సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. ఎల్–నినో సవాళ్లను దాటుకుని రైతులకు మేలు చేయాలంటే డ్రిప్ (బిందు) మరియు తుంపర (స్ప్రింక్లర్) సేద్య విధానాలే ఏకైక పరిష్కార మార్గాలని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న డ్రిప్ సిస్టమ్ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని కంపెనీల ప్రతినిధులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో మైక్రో ఇరిగేషన్ పరికరాల అమరికలో ఎలాంటి ఆలస్యం జరగకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని స్పష్టం చేశారు.రాష్ట్రంలో ఇంకా పూర్తి కాకుండా పెండింగ్‌లో ఉన్న డ్రిప్ ప్రాజెక్టులకు సంబంధించి తక్షణమే ఒక స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను (యాక్షన్ ప్లాన్) సిద్ధం చేయాలని మంత్రి కంపెనీలకు నిర్దేశించారు. బీఎంఎస్ , బీఓక్యూ ప్రక్రియలను వెంటనే పూర్తి చేసి, పరిపాలనాపరమైన అనుమతుల కోసం అధికారులకు పంపాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిశీలనలు మరియు ప్రభుత్వ అనుమతుల ప్రక్రియలో ఎక్కడా అనవసరమైన జాప్యానికి తావివ్వకూడదని హెచ్చరించారు.డ్రిప్ వ్యవసాయ పద్ధతి ద్వారా తక్కువ నీరు మరియు పరిమిత విద్యుత్‌ను వినియోగించి గరిష్ఠ స్థాయిలో పంట దిగుబడిని సాధించవచ్చని మంత్రి వివరించారు. రాబోయే రోజుల్లో సాంప్రదాయ పంటల నుంచి లాభదాయకమైన ఆల్టర్నేటివ్ (ప్రత్యామ్నాయ) పంటల వైపు రైతులను మళ్లించే పంటల వైవిధ్యీకరణ (క్రాప్ డైవర్సిఫికేషన్) ప్రక్రియలో మైక్రో ఇరిగేషన్ అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుందని వ్యాఖ్యానించారు.రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రోత్సహిస్తున్న ఆయిల్ పామ్ పంట సాగుకు అవసరమైన డ్రిప్ సదుపాయాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే కల్పించాలని మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు మంత్రి తుమ్మల ఆదేశాలు జారీ చేశారు. ఆయిల్ పామ్ రైతులు ఇబ్బంది పడకుండా డ్రిప్ పరికరాల సరఫరా మరియు అమరిక ప్రక్రియలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు.రైతులకు డ్రిప్ సేద్యం వల్ల కలిగే ప్రయోజనాలపై గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే అవగాహన కార్యక్రమాలు, రైతు సదస్సులలో మైక్రో ఇరిగేషన్ కంపెనీలు తప్పనిసరిగా భాగస్వామ్యం కావాలని మంత్రి సూచించారు. డ్రిప్ సిస్టమ్ల నిర్వహణ, వాడకంపై రైతులకు అవగాహన కల్పించే బాధ్యతను కంపెనీలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అదే సమయంలో, కంపెనీలకు రావలసిన పెండింగ్ బిల్లుల చెల్లింపులకు సంబంధించి ప్రభుత్వం సానుకూలంగా ఉంటూ తగిన కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.గత రెండు సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు సంబంధించి బకాయి ఉన్న సుమారు రూ. 400 కోట్లను ఇప్పటికే విడుదల చేసిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ సందర్భంగా వెల్లడించారు. మైక్రో ఇరిగేషన్ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి ఈ చెల్లింపులే నిదర్శనమని, ఆర్థిక ఇబ్బందులు లేకుండా కంపెనీలు సేవలను విస్తరించాలని ఆయన కోరారు.సూక్ష్మ సాగునీటి రంగ విస్తరణలో మరియు నీటి యాజమాన్య పద్ధతుల్లో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా, ఆదర్శవంతంగా నిలవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధన కోసం జిల్లాల వారీగా ప్రతి మైక్రో ఇరిగేషన్ కంపెనీ పనితీరుపై నిరంతర సమీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. లక్ష్యాలను సాధించడంలో విఫలమయ్యే లేదా మందకొడిగా పనిచేసే కంపెనీలపై చర్యలు ఉంటాయని సూచనలు చేశారు.

# చట్టసభల్లోనే పరిష్కారాలు వేతకాలి చెట్ల కింద కాదు..!!

- **పెద్దిరెడ్డి రవికిరణ్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, ఆంధ్రప్రదేశ్**

**ఆంధ్రప్రదేశ్ వెలుతురు జూలై 25:**

ఓ పక్కన విద్యార్థులు మంచి మార్కుల కోసం మంచి ర్యాంకు కోసం రాత్రింపగళ్లు కష్టపడి చదువుతుంటే మరోపక్క వారి కష్టాన్ని దోచుకోవటానికి కొందరు దుర్మార్గులు అవి కోచింగ్ సెంటర్ల మాఫియాలు కావచ్చు, విద్య సంస్థల అధిపతులు కావచ్చు, దురాశతో కొంతమంది తల్లిదండ్రులు కావచ్చు ప్రశ్న పత్రాలని లీక్ చేయించి సొమ్ము చేసుకుంటున్న రాబందులు. ఈ తంతు ఈ దేశంలో దశాబ్దాలుగా జరుగుతున్న విషయం అందరికీ అన్ని రాజకీయ పక్షాలకి తెలిసినవే. దీనికి ఏ పార్టీ అతీతం కాదు. ఏ పార్టీ పాలిత రాష్ట్రాలు ఉన్న, కేంద్రంలో ఏ పార్టీ పాలనలో ఉన్న ఆయా సందర్భాల్లో పేపర్ లీక్ జరిగాయి అన్నది పచ్చనిజం.

ఈ దేశాన్ని దశాబ్దాలు పాటు పరిపాలించిన కాంగ్రెస్ పార్టీ పేపర్ లీక్ విషయంపై కఠినమైన చట్టాలు ఎప్పుడు చేయలేదు సరి కదా లీక్ అయిందని మొత్తుకున్నా మళ్లీ పరీక్షలు నిర్వహించిన సందర్భాలు కూడా అతి తక్కువే. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు మొట్టమొదటిసారిగా ఫిబ్రవరి 2024లో ఈ సమస్యపై పబ్లిక్ ఎగ్జామినేషన్ యాక్ట్ చట్టం చేశారు. పేపర్ లీక్ చేస్తే ఆ నిందితులకి మూడేళ్ల జైలు శిక్ష పడేవిధంగా చట్టం అమలులోకి తెచ్చారు. 2026 నీట్ పరీక్షల ప్రశ్న పత్రాన్ని ఎవరైతే ఉపాధ్యాయులు పేపర్ ని సెట్ చేశారో వారే పేపర్ లీక్ పాపానికి ఒడిగెట్టారు. దీనికి పాల్పడ్డ సుమారు 13 మందిని ఇప్పటివరకు సిబిఐ విచారణలో అరెస్ట్ చేశారు వాళ్లు 2024 మోడీ ప్రభుత్వం తెచ్చిన చట్టం కారణంగానే ఇప్పటికీ జైల్లోనే ఉన్నారు.

విద్యార్థి యొక్క విద్యా సంవత్సరం పాడవకూడదు ప్రతిభ కలిగిన విద్యార్థికి అన్యాయం జరగకూడదు అని మోడీ ప్రభుత్వం నీట్ పరీక్షని రద్దుచేసి మళ్లీ పకడ్బందీగా అన్ని మంత్రిత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ పరీక్ష ఫీజు కూడా తీసుకోకుండా నీట్ పరీక్షని సమర్ధవంతంగా నిర్వహించడం జరిగింది. దీనికి తోడు వచ్చే సంవత్సరం నీట్ పరీక్షని ఆన్ లైన్ విధానంలో నిర్వహిస్తామని ప్రభుత్వం చెప్పటం కూడా జరిగింది. ప్రస్తుతం ఉన్న చట్టాన్ని మరింత కఠిన తరం చేస్తామని కూడా చెప్పటం జరిగింది.

విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ సున్నితమైన అంశాన్ని కూడా ప్రధాన ప్రతిపక్షాలైన కాంగ్రెస్ కమ్యూనిస్టులు సమాజ్వాది పార్టీలు ఆమ్ ఆద్మీ పార్టీ తమ నీచ రాజకీయాల కోసం వాడుకోవాలని చూడటం దురదృష్టకరం. జులై 19 2026న పంజాబ్ రాష్ట్రంలో నిర్వహించిన ఫార్మసీ ప్రవేశ పరీక్ష పత్రం లీక్ అయింది దానికి సమాధానం చెప్పని కేజ్రీవాల్ గారు ఢిల్లీకి వచ్చి శుద్ధపూస కబుర్లు చెప్పటం దీనికి నిదర్శనం. సోనం వాంగ్చుక్ గారు బలమైన చట్టాలు కోసం కొంతమంది విద్యార్థులతో జంతర్ మంతర్ లో నిరాహార దీక్ష చేసినప్పుడు ప్రభుత్వం ఎటువంటి బల ప్రయోగం చేయలేదు అడ్డు చెప్పలేదు. ప్రభుత్వం ఎప్పుడూ యువత విషయంలో సున్నితమైన అంశమని దేశ భవిష్యత్తు వారితోనే ముడిపడి ఉందని భావించి ఇంకా మెరుగ్గా ప్రవేశ పరీక్షలు నిర్వహణ ఏ రకంగా చేయాలో అన్నదానిపై తలమూలకలైంది.

జంతర్ మంతర్ లో సోనం వాంగ్చుక్ గారి నిరాహార దీక్షని అడ్డుపెట్టుకుని చలో పార్లమెంట్ పేరు మీద కొంతమంది అసాంఘిక శక్తులు జొరబడి ఏ రకంగా హింసాత్మకమైన కార్యక్రమాలకి పాల్పడ్డారో పార్లమెంట్ మీద ఏ రకంగా దాడి చేసే ప్రయత్నం చేశారో మనం చూసాం అది అత్యంత దుర్మార్గమైన విషయం. శాంతియుతంగా నిరసనలకు రాజ్యాంగం అవకాశం పౌరుడికి కల్పించింది గానీ హింసాత్మకమైన చర్యలు కి పాల్పడితే చట్టం తన పని తాను చేసుకోపోతుంది.



సోనం గారి కోరిక పైన ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది ఉన్న చట్టాన్ని కఠిన తరం చేసే విధంగా క్యాబినెట్ ఆమోదించటం వచ్చేవారం పార్లమెంట్లో ప్రవేశపెట్టబోవటంతో సంతోషించిన వారు నిరాహారదీక్ష కూడా విరమించి అన్ని పార్టీలని పార్లమెంట్ లో చర్చ సజావుగా జరగాలని కోరటం కూడా జరిగింది.

ప్రధాని మోడీ గారు అర్ధరాత్రి యువతని ఉద్దేశిస్తూ వీడియో విడుదల చేస్తూ చాలా స్పష్టంగా వారి సమస్యలకి పరిష్కార మార్గాలకు చూపటానికి ప్రభుత్వం అన్ని విధాలుగా పనిచేస్తుందని చట్టాన్ని సవరిస్తున్నామని ఫాస్ట్ ట్రాక్ కోర్టు కూడా ఏర్పాటు చేస్తున్నామని భరోసాగూడ కల్పించారు. దానికి యువత చక్కగా స్పందించింది కూడా. అయితే దీన్ని జీర్ణించుకోలేని కాంగ్రెస్ కమ్యూనిస్టు తదిత పార్టీలు రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తూ పార్లమెంట్లో చర్చించమని మొండికేస్తూ విధ్వంసకారులకి మద్దతుగా మాట్లాడటం దురదృష్టకరం. కాంగ్రెస్ పాలిత రాష్ట్రమైన రాజస్థాన్లో 2018 నుండి 2023 మధ్య 24 సార్లు పేపర్ లీక్ అయింది ఒక్క కోట నగరంలోనే 73 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. అప్పుడు స్పందించని రాహుల్ గాంధీ గారు ఈరోజు మొసలి కన్నీరు ఎందుకు కారుస్తున్నారంటే కేవలం రాజకీయ లబ్ధి కోసం ఆరాటం తప్పితే విద్యార్థుల పైన వారి విద్య భవిష్యత్తు పైన చిత్తశుద్ధి ఏ మాత్రం లేదు అని చెప్పకనే చెబుతుంది.

ధర్మేంద్ర ప్రధాన్ గారు కేంద్ర విద్యాశాఖ మంత్రిగా విద్యా వ్యవస్థలో అనేక మార్పులకి శ్రీకారం చుట్టారు, పాఠ్యాంశాలలో భారతీయ చరిత్రని జోడించి అసలు సిసలైన చరిత్రని పరిచయం చేశారు. విద్యార్థుల ఉద్యమ ముసుగులో తనని అడ్డం పెట్టుకొని కొన్ని అసాంఘిక శక్తులు దేశ వ్యతిరేక శక్తులు రెచ్చిపోతూ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటూ వారి భవిష్యత్తుని నాశనం చేసే ప్రయత్నం చేయటాన్ని తట్టుకోలేక వారి బంగారు భవిష్యత్తు కోసం విద్యాశాఖ మాత్యులుగా రాజీనామా చేయటం అభినందించదగ్గ విషయం.

విద్యావ్యవస్థలు సమూల మార్పులు రావాలి పోటీ పరీక్షలు కేంద్రం రాష్ట్రాలు ఎన్ని నిర్వహిస్తున్న అన్ని పారదర్శకంగా అవినీతి రహితంగా నూతన సాంకేతికతని అందిపుచ్చుకుంటూ ఏ విద్యార్థికి అన్యాయం జరగకుండా కోచింగ్ సెంటర్లు, విద్యాసంస్థల మాఫియాలకు తావు లేకుండా అన్ని పార్టీలు అన్ని ప్రభుత్వాలు అటు కేంద్రం ఇటు రాష్ట్రాలు కలిసికట్టుగా పనిచేయాలని కోరుకుందాం... ఇది సాధ్యపడేది చట్టసభల్లోనే గాని చెట్ల కింద ఏ మాత్రం కాదు అని ప్రతి పౌరుడు గ్రహించాలని ఆకాంక్షిస్తున్నాను.

## ప్రజాస్వామ్యం గెలిచింది — నియంతృత్వ ధోరణులు తలవంచాయి

- **విద్యార్థుల ఐక్యతకు దక్కిన విజయం — రాహుల్ గాంధీ నాయకత్వం యువతకు అండగా నిలిచింది: కొప్పుల ప్రవీణ్ కుమార్ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి**

**హైదరాబాద్ వెలుతురు జూలై 25:**

దేశవ్యాప్తంగా విద్యార్థుల హక్కుల కోసం సాగిన పోరాటం ప్రజాస్వామ్య విజయానికి ప్రతీకగా నిలిచిందని, విద్యార్థుల ఐక్యత ముందు కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సి వచ్చిందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొప్పుల ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.విద్యార్థుల ఆందోళనలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనమని ఆయన అన్నారు. ఈ విజయం దేశవ్యాప్తంగా యువత ఐక్యంగా సాగించిన ఉద్యమానికి దక్కిన గౌరవమని పేర్కొన్నారు.

**కొప్పుల ప్రవీణ్ కుమార్ వ్యాఖ్యలు**

"ప్రజాస్వామ్యం గెలిచింది. విద్యార్థుల ఐక్యత ముందు ఎంతటి అధికారమైనా, ఎంతటి నియంతృత్వ ధోరణులైనా చివరకు తలవంచక తప్పదు."

"విద్యార్థుల సమస్యలను పార్లమెంట్‌లో బలంగా ప్రస్తావిస్తూ, దేశ యువత తరపున నిరంతరం గొంతెత్తిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు శ్రీ రాహుల్ గాంధీ గారి కృషి అభినందనీయం. విద్యార్థుల పక్షాన తాను అండగా ఉంటాననే విశ్వాసాన్ని ఆయన ప్రతి దశలో కల్పించారు."

"విద్యార్థుల సమస్యలపై దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన ఉద్యమాలకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలిచింది. యువత ఆవేదనను జాతీయ చర్చగా మార్చడంలో రాహుల్ గాంధీ గారి పాత్ర ఎంతో కీలకమైనది."



"ఈ విజయం ఒక్క వ్యక్తిదీ కాదు, ఒక్క పార్టీదీ కాదు. దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత ప్రదర్శించిన ఐక్యత, పట్టుదల, ప్రజాస్వామ్య విశ్వాసం సాధించిన విజయం. ఈ పోరాటంలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి నా హృదయపూర్వక అభినందనలు, హ్యాట్స్ ఆఫ్."

దేశ యువత ఆకాంక్షలను గౌరవించే పాలన కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ విద్యార్థుల పక్షాన నిలుస్తుందని కొప్పుల ప్రవీణ్ కుమార్ తెలిపారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రజాస్వామ్య విజయం





**రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ**

**రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీమ్ భరత్***

**రంగారెడ్డి జిల్లా వెలుతురు జూలై 25:**

నీట్ పరీక్ష లీకేజీ సంఘటనలో దేశవ్యాప్తంగా యువత, విద్యార్థులు చేపట్టిన అలుపెరగని పోరాటానికి దిగివచ్చి రాజీనామా చేసిన కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఈ దేశ ప్రజాస్వామ్యం సాధించిన విజయమని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి శ్రీజ్యోతి భీమ్ భరత్ పేర్కొన్నారు.బదంగ్‌పేట మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన విజయోత్సవ సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీ చల్లా నరసింహారెడ్డి మాట్లాడుతూ, విద్యాశాఖను అవినీతి కూపంలోకి నెట్టిన కేంద్ర మంత్రి ఎట్టకేలకు ప్రజా పోరాటానికి తలొగ్గి రాజీనామా చేయడం యువత సాధించిన అపురూప విజయమని అన్నారు. ఈ పోరాటంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు.శ్రీమతి శ్రీజ్యోతి భీమ్ భరత్ మాట్లాడుతూ, ఈ పోరాటంలో స్వయంగా పాల్గొని విద్యార్థులకు నైతిక మద్దతు తెలిపిన జాతీయ కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ, శ్రీమతి ప్రియాంక గాంధీ ల పోరాట స్ఫూర్తి తమకు ఆదర్శమని తెలిపారు.వారిచ్చిన స్ఫూర్తితో మరింత బలంగా అవినీతి కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రజాపోరాటాల ద్వారా ఎండగడతామని ఆమె హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ శాయర్ పర్సన్ , మాజీ బదంగ్‌పేట మున్సిపల్ మేయర్, మహిళా కాంగ్రెస్, సమత అమృత యువజన కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మాసబ్ ట్యాంక్ గార్డెన్స్ టవర్స్ అపార్ట్మెంట్ లో వాటర్ హార్వెస్టింగ్ పాయింట్ ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్..






- **ఈ సందర్భంగా గార్డెన్స్ టవర్స్ అపార్ట్మెంట్ వాసులను అభినందించిన మంత్రి..**

**హైదరాబాద్ వెలుతురు జూలై 25:**

ప్రతి వర్షపు చుక్క ఒడిసి పట్టి భవిష్యత్ నీటి వనరులను కాపాడుకోవాలని సూచించిన మంత్రి పొన్నం ప్రభాకర్.

కార్యక్రమంలో పాల్గొన్న మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, వాటర్ వర్క్ ఎండీ అశోక్ రెడ్డి, గార్డెన్ టవర్స్ అపార్ట్మెంట్ ప్రతినిధులు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో ప్రతి ఒక్కరూ తమ ప్రాంతంలో కురిసే వర్షపు నీటిని వృథాగా వెళ్లనివ్వకుండా, భూగర్భ జలాలుగా మారేలా సంరక్షించే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని రాష్ట్ర ప్రభుత్వం పిలుపునిస్తోంది.ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు మారుతున్నాయి. మరోవైపు నీటి అవసరాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. హైదరాబాద్‌కు కృష్ణా, గోదావరి, మంజీరా, హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ వంటి వివిధ జల వనరుల నుంచి తాగునీటిని సరఫరా చేస్తున్నప్పటికీ, నగర జనాభా వేగంగా పెరుగుతోంది.గ్రామాల నుంచి పెద్ద ఎత్తున నగరాలకు వలసలు రావడం వల్ల నీటి అవసరం మరింత అధికమవుతోంది.భవిష్యత్తులో నీటి కొరత రాకుండా ఉండాలంటే మనం ఈరోజే చర్యలు ప్రారంభించాలి. ప్రతి వర్షపు చుక్కను భూగర్భ జలాల్లోకి ఇంకేలా చేయడం అత్యంత అవసరం. ప్రస్తుతం నగరంలో కురిసే వర్షపు నీటిలో ఎక్కువ భాగం డ్రైనేజీల ద్వారా వృథాగా వెళ్లిపోతోంది. ఈ పరిస్థితిని మార్చాల్సిన బాధ్యత మనందరిదీ.గ్రామీణ ప్రాంతాల్లో మట్టి ఎక్కువగా ఉండటం వల్ల వర్షపు నీరు సహజంగానే భూమిలోకి ఇంకుతుంది. కానీ హైదరాబాద్ వంటి నగరాల్లో కాంక్రీట్ భవనాలు, సిమెంట్ రోడ్లు విస్తరించడం వల్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశం చాలా తక్కువగా ఉంది.అందుకే ప్రతి ఇల్లు, ప్రతి అపార్ట్‌మెంట్, ప్రతి సంస్థ తప్పనిసరిగా రైన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలి.వర్షపు నీటిని సంరక్షించడం అంటే కేవలం నీటిని నిల్వ చేయడం మాత్రమే కాదుభవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించడం కూడా.భూగర్భ జలాలను పునరుద్ధరించడానికి, నగరంలో నీటి కొరతను తగ్గించడానికి రైన్‌వాటర్ హార్వెస్టింగ్ అత్యంత ప్రభావవంతమైన మార్గం. హైదరాబాద్ నగరాన్ని నీటి సంరక్షణలో దేశానికే ఆదర్శంగా నిలబెట్టేందుకు అందరూ కలిసి పనిచేయాలని కోరుతున్న.

## వేములవాడ రాజన్న ఆలయానికి మరో 99.40 కోట్లు నిధులు మంజూరు

**నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన అధికారులు**

**గత 2023-24 బడ్జెట్లో 50 కోట్లు,2024-25 బడ్జెట్లో 100 కోట్లు నిధులు విడుదల**

**రాజన్న ఆలయ అభివృద్ధికి 249 కోట్లు నిధులు విడుదల**

**ఇప్పటికే 45 శాతం పనులు పూర్తి**

**హర్షం వ్యక్తం చేస్తున్న రాజన్న భక్తులు**

**వేములవాడ వెలుతురు జూలై 25:**

దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధి విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.. రాజన్న ఆలయ అభివృద్ధిలో భాగంగా ఇప్పటికే 2023 24 బడ్జెట్లో 50 కోట్లు, 2024–25 బడ్జెట్లో 100 కోట్లు విడుదలవగా శనివారం మరో 99.40 కోట్ల నిధులు విడుదల చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో 150 కోట్లతో సుమారు 45 శాతం పనులు పూర్తికాగా మరో 99 కోట్లు నిధులు విడుదల కావడంతో రాజన్న ఆలయ అభివృద్ధి విస్తరణ పనులు శరవేగంగా జరగనున్నాయి.కాగా నిధులు మంజూరు కి కృషిచేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లకు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ధన్యవాదాలు తెలియజేశారు.



## హోండా జడ్ఆర్వి వాహనం ఆవిష్కరణ

**హైదరాబాద్, వెలుతురు జూలై 25:**

జపాన్ నుంచి నేరుగా దిగుమతి చేసుకున్న పూర్తిగా తయారైన హోండా జడ్ఆర్–వి విలాసవంతమైన బహుళ ప్రయోజన వాహనాన్ని ప్రైడ్ హోండా మాదాపూర్‌లో శనివారం ఘనంగా ఆవిష్కరించింది. ప్రపంచ స్థాయి జపాన్ ఇంజినీరింగ్ నైపుణ్యం, అత్యున్నత తయారీ ప్రమాణాలు, ఆధునిక భద్రతా సౌకర్యాలు, అత్యుత్తమ ప్రయాణ అనుభూతిని భారతీయ వినియోగదారులకు అందించాలనే లక్ష్యంతో ఈ వాహనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమానికి ప్రముఖ తెలుగు సినీ నటుడు రాజా రవీంద్ర ముఖ్య అతిథిగా హాజరై వాహనాన్ని ఆవిష్కరించారు. ప్రత్యేక అతిథిగా జాతీయ బీసీ దళ్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అధ్యక్షుడు డి.వి.వి.




సత్యనారాయణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వాహనంలోని మిశ్రిత ఇంధన వ్యవస్థ, ఆధునిక సాంకేతికత, భద్రతా సౌకర్యాలు, ప్రత్యేకతలను వివరించారు. కార్యక్రమంలో ప్రైడ్ హోండా వ్యవస్థాపక నిర్వహణాధికారి సురేష్ రెడ్డి, ప్రధాన



కార్యనిర్వహణాధికారి రాకేష్ కుమార్, ప్రధాన నిర్వాహకుడు కిరిట్, శాఖాధిపతి కాశీ విశ్వనాథ్‌తో పాటు సంస్థ ప్రతినిధులు, వినియోగదారులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# మారుతున్న కాలం... మారే ధర్మం



వర్తమాన సమాజంలో అసలు ధర్మం అంటే ఏమిటి? అది ఎల్లప్పుడూ ఒకేలా ఉంటుందా, లేక కాల సందర్భాలను బట్టి రూపాంతరం చెందుతుందా? ఈ ప్రశ్న కేవలం ప్రాచీన పండితులకు, తాత్వికులకు పరిమితమైనది కానే కాదు. ఆధునిక సమాజంలో సగటు మానవుడు అనునిత్యం అనుభవించే నైతిక ఘర్షణ ఇది. అనుదినం నేను చేస్తున్న పని సరైనదేనా? అనే సందేహం ప్రతి ఒక్కరినీ వేధిస్తూనే ఉంటుంది. కష్టాల్లో ఉన్న తల్లికి నిజం చెప్పాలా లేక మనసు నొప్పించకుండా మౌనం వహించాలా? చట్టం ప్రకారం సరైనదే అయినా, అంతరాత్మ ఒప్పుకోని పనిని చేయవచ్చా? ఇటువంటి అనేక నైతిక సందిగ్ధాలకు మూలాధారం ఒక్కటే ధర్మం స్థిరమైనదా లేక చలనశీలమైనదా? ఈ ప్రశ్నకు ప్రపంచ సాహిత్య చరిత్రలోనే అత్యంత విపులమైన, లోతైన సమగ్ర సమాధానాన్ని అందించిన మహోన్నత గ్రంథం మహాభారతం.

పత్రికా విశ్లేషణల దృష్ట్యా మహాభారతాన్ని పరిశీలిస్తే ఒక స్పష్టమైన సత్యం బోధపడుతుంది. వ్యాస మహర్షి ధర్మాన్ని ఒకే ఒక్క నియమావళిగా వర్ణించలేదు. సనాతన ధర్మశాస్త్రాల ప్రకారం ధర్మం ప్రధానంగా మూడు స్థాయిల్లో వర్గీకరించబడి కనిపిస్తుంది.సాధారణ ధర్మం, ఎల్లవేళలా ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా పాటించవలసిన విశ్వజనీన విలువలు.విశేష ధర్మం ,వ్యక్తి యొక్క హోదా, ఆశ్రమం మరియు స్థానాన్ని బట్టి మారే బాధ్యతలు.ఆపద్ధర్మం, అత్యవసర పరిస్థితుల్లో లేదా ఆపత్కాలంలో ప్రాణరక్షణ కోసం పాటించాల్సిన మినహాయింపులు.సత్యం మాట్లాడటం, అహింస పాటించడం, పెద్దలను గౌరవించడం వంటివి సాధారణ ధర్మాలు. ఇవి కాలదేశాలకు అతీతంగా అందరికీ వర్తిస్తాయి. అయితే సరిహద్దు రణరంగంలో యోధుడు పాటించే క్షాత్రధర్మం, ఆశ్రమంలో సన్యాసి పాటించే ధర్మం ఒకేలా ఉండవు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు అర్జునుడికి "స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః" అని స్పష్టంగా బోధిస్తాడు. అంటే తనకు నిర్దేశించిన సహజ కర్తవ్యాన్ని నిర్వర్తించడమే శ్రేయస్కరమని దీని భావం.మహాభారతంలో ధర్మరాజు అనబడే యుధిష్ఠిరుడు స్వయంగా అనేక ధర్మసంకటాల నడుమ నలిగిపోయాడు. కురుసభలో ద్రౌపది అవమానం పొందినప్పుడు, నన్ను పణంగా పెట్టే ముందు నీకు నీపైనే హక్కు ఉందా? అని ఆమె అడిగిన ప్రశ్నకు సభలోని పెద్దలు స్పష్టమైన సమాధానం చెప్పలేకపోయారు. భీష్ముడు వంటి ధర్మనిష్ఠుడు సైతం మౌనం వహించాడు. ఆ క్షణాన రాజధర్మం, పతిధర్మం, సభాధర్మం పరస్పరం ప్రచండంగా ఢీకొన్నాయి. ఇక్కడే వ్యాసుడు చెప్పిన సత్యం బయటపడుతుంది ధర్మం నిశ్చల సూత్రం కాదు, అది సందర్భాల సంఘర్షణలో నిరంతరం పరీక్షకు గురయ్యే జీవన సూత్రం.

యుద్ధభూమిలో ధర్మరాజు "అశ్వత్థామ హతః... నరో వా కుంజరో వా" అని అర్ధసత్యం పలికిన సందర్భం ప్రసిద్ధం. సత్యం చెప్పడం ధర్మమే అయినా, ధర్మయుద్ధంలో గెలవడం కోసం ఆ సత్యాన్ని కొంత మలచవలసి వచ్చింది. ఇలా చేసినందుకు అతని దివ్య రథం నేలను తాకిందని కథ చెప్తుంది. ధర్మం మారినా, దాని పర్యవసానాల నుంచి ఎవరూ తప్పించుకోలేరని వ్యాసుడు స్పష్టంగా హెచ్చరిస్తాడు.శాంతిపర్వంలో అంపశయ్య మీద ఉన్న భీష్ముడు యుధిష్ఠిరుడికి ధర్మసూక్ష్మాలను బోధిస్తాడు. ధర్మం అత్యంత సూక్ష్మమైనది, దాన్ని అర్థం చేసుకోవడం సులభం కాదు అని భీష్ముడు వివరిస్తాడు. ఆకలితో అలమటిస్తున్న వ్యక్తి ప్రాణరక్షణకు ఆహారం దొంగిలిస్తే అది అధర్మం కాదని, ప్రాణాపాయంలో అబద్ధం చెప్పడం తప్పు కాదని ఉదాహరణలతో చెప్తాడు. ఇది ఆపద్ధర్మం అనే భావనకు మూలం. సాధారణ పరిస్థితుల్లో నిషిద్ధమైనవి ప్రాణాపాయ సమయాల్లో అనుమతించబడతాయి. ధర్మం యొక్క మౌలిక లక్ష్యాలైన ప్రాణరక్షణ, సమాజ శ్రేయస్సు, న్యాయం మారవు; కానీ ఆ లక్ష్యాన్ని చేరుకునే మార్గం పరిస్థితులను బట్టి మారుతుంది.

మహాభారతం మరో ముఖ్యమైన భావనను పరిచయం చేస్తుంది అదే యుగధర్మం. కృతయుగంలో, త్రేతాయుగంలో, ద్వాపర యుగంలో, కలియుగంలో ధర్మాచరణ తీరు వేరు వేరుగా ఉంటుందని పురాణాలు చెబుతాయి. ధర్మం సమాజ పరిణతిని బట్టి, కాలగమనాన్ని బట్టి తన స్వరూపాన్ని మార్చుకుంటుందని ఇది సూచిస్తుంది. నేటి కాలానికి వర్తింపజేసుకుంటే, వందేళ్ల క్రితం సమాజం ఆమోదించిన కొన్ని ఆచారాలు నేడు అధర్మంగా పరిగణించబడుతున్నాయి. ఇది ధర్మం యొక్క బాహ్య రూపం కాలక్రమేణా మారుతుందనే సత్యాన్ని ధృవీకరిస్తుంది.సాధారణ ధర్మం,నిత్యమైనది, సార్వజనీనం. ఉదాహరణకు సత్యం, కరుణ, అహింస, మరియు శాంతిని పాటించడం.విశేష ధర్మం,హోదా, వృత్తి ఆధారితం. ఉదాహరణకు న్యాయమూర్తి నిష్పక్షపాత తీర్పు, సైనికుడి యుద్ధం.ఆపద్ధర్మం, ప్రాణరక్షణార్థం లభించే మినహాయింపు. ఉదాహరణకు ఆపత్కాలంలో ప్రాణాపాయం తప్పించేందుకు అసత్యం పలకడం.ఇక్కడ ఒక సూక్ష్మమైన విషయాన్ని విశ్లేషించాలి. మహాభారతం ధర్మం పూర్తిగా మారిపోతుందని చెప్పదు, మారదని కూడా చెప్పదు. దీని సమాధానం మధ్యేమార్గంలో ఉంది ధర్మం యొక్క సారాంశమైన సత్యం, న్యాయం, కరుణ, పరోపకారం శాశ్వతమైనవి. కానీ దాన్ని ఆచరణలో పెట్టే విధానం, రూపం, ప్రాధాన్యతలు కాలానికి, సందర్భానికి, వ్యక్తి స్థానానికి అనుగుణంగా మారుతుంటాయి. తండ్రి బిడ్డను కాపాడేందుకు అబద్ధం చెప్పడం, న్యాయమూర్తి నిష్పక్షపాతంగా తీర్పు ఇవ్వడం, సైనికుడు యుద్ధంలో శత్రువును ఎదుర్కోవడం ఇవన్నీ పైకి భిన్నంగా కనిపించినా, అంతర్లీనంగా న్యాయాన్ని, రక్షణను, సమాజ శ్రేయస్సును కోరుకునే ఒకే మూలసూత్రం నుంచి ఉద్భవిస్తాయి.నేటి వేగవంతమైన, సంక్లిష్టమైన ప్రపంచంలో మనం ఎదుర్కొనే నైతిక సందిగ్ధాలు మహాభారత కాలం నాటి ఘట్టాలకు భిన్నంగా అనిపించినా, వాటి మూలంలో అదే అంతర్గత సంఘర్షణ ఉంది మారుతున్న పరిస్థితులకు శాశ్వత నైతిక విలువలను ఎలా అన్వయించుకోవాలి అనేది. వ్యాపారంలో పోటీ, కుటుంబ బాధ్యతలు, నూతన సాంకేతిక పరిణామాలు తెచ్చే కొత్త సవాళ్లు వీటన్నింటినీ ఎదుర్కోవడంలో మహాభారతం నేటి సమాజానికి ఒక మహోన్నత దిక్సూచిని అందిస్తుంది. పత్రికా విశ్లేషణల పరంగా సమగ్రంగా పరిశీలిస్తే, ప్రతి రంగంలో మానవుడు ఎదుర్కొనే సవాళ్లకు ఇందులో అమూల్యమైన సమాధానాలు లభిస్తాయి.శాసనాలను లేదా నియమాలను గుడ్డిగా అనుసరించడం ధర్మాచరణ కాదని, ప్రతి సందర్భంలోనూ వివేకంతో, జీవకరుణతో, సామాజిక పర్యవసానాలను లోతుగా బేరీజు వేసుకుని నిర్ణయం తీసుకోవడమే నిజమైన ధర్మాచరణ అని వ్యాస మహర్షి స్పష్టం చేశారు. అందుకే విశ్వసాహిత్యంలో మహాభారతాన్ని పంచమ వేదం అని, నైతిక ధర్మశాస్త్రాల సారమని నిత్యం కీర్తిస్తారు. చివరిగా పత్రికాత్మక విశ్లేషణగా చెప్పాలంటే, ధర్మం మారుతుందా అనే నిత్య ప్రశ్నకు మహాభారతం ఇచ్చే అమూల్యమైన సమాధానం ఇది ధర్మం యొక్క బాహ్య రూపం కాలానికి, సందర్భానికి అనుగుణంగా మారుతుంది, కానీ దాని పవిత్రమైన అంతర్గత ఆత్మ ఎన్నటికీ మారుతుందా? ఎప్పటికీ మారదు! ఈ సూక్ష్మ భేదాన్ని నిత్య జీవితంలో సమగ్రంగా అర్థం చేసుకుని ఆచరించడమే మానవాళికి నిజమైన ధర్మజ్ఞానం. అది వ్యాస మహర్షి వేల సంవత్సరాల క్రితం మనకు అందించిన మహోన్నతమైన, శాశ్వత సామాజిక వారసత్వం. ఈ సందేశం తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తుంది.



డా. సూర్యదేవర రామకృష్ణ ,
Moral Philosopher, 9490754169

## నల్లగొండను సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం : మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి





- రూ.65 కోట్లతో మర్రిగూడ మోడల్ ఫ్లైఓవర్ ప్రారంభం
- రూ.750 కోట్లతో చేపట్టిన ఔటర్ రింగ్ రోడ్డు పనులు 50 శాతం పూర్తి
- రూ.300 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రూ.290 కోట్లతో 24/7 తాగునీటి సరఫరా ప్రాజెక్టుల అమలు
- దేశ యువతే తన కుటుంబమని భావించి విద్యార్థుల పక్షాన నిలిచిన రాహుల్ గాంధీపై దాడి హేయమైన చర్య
- పేపర్ లీకేజీలపై కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలి.. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి

**నల్లగొండ వెలుతురు జూలై 25:**

నల్లగొండ పట్టణాన్ని తెలంగాణలోనే ఆదర్శవంతమైన మోడల్ కార్పొరేషన్‌గా, సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సహకారంతో నల్లగొండ అభివృద్ధికి వేల కోట్ల రూపాయల నిధులను మంజూరు చేస్తూ మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.నల్లగొండ పట్టణంలోని మర్రిగూడ చౌరస్తా వద్ద రూ.65 కోట్ల వ్యయంతో నిర్మించిన మోడల్ ఫ్లైఓవర్‌ను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాతీయ రహదారి నుంచి నార్కట్‌పల్లి–అద్దంకి రహదారికి నేరుగా వాహనాలు ప్రయాణించేలా ఈ ఫ్లైఓవర్‌ను నిర్మించామని తెలిపారు. దీంతో పట్టణంలో ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు ఎంతో దోహదపడుతుందన్నారు.మర్రిగూడ ఫ్లైఓవర్‌ను తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి ప్రతీకగా తీర్చిదిద్దామని మంత్రి తెలిపారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్, తెలంగాణ కోసం మంత్రి పదవిని సైతం త్యాగం చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ, ఛాయా సోమేశ్వర స్వామి తదితర మహనీయుల చిత్రాలతో ఫ్లైఓవర్‌ను సుందరీకరించినట్లు పేర్కొన్నారు. అభివృద్ధితో పాటు తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించేలా ఈ నిర్మాణాన్ని తీర్చిదిద్దామని తెలిపారు.రూ.750 కోట్లతో చేపట్టిన ఔటర్ రింగ్ రోడ్డు పనులు ఇప్పటికే 50 శాతం పూర్తయ్యాయని మంత్రి వెల్లడించారు. రైల్వే ట్రాక్‌పై ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తికాగానే మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేసి వచ్చే మార్చి నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. మర్రిగూడ నుంచి తిప్పర్తి రోడ్డు వరకు ఆరు లైన్లతో అత్యాధునిక రహదారి నిర్మాణం చేపడుతున్నామని వివరించారు.అమృత్ పథకం కింద రూ.300 కోట్లతో వాటర్ ట్యాంకులు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, అదనంగా ★ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి★ మరో రూ.300 కోట్ల నిధులను మంజూరు చేశారని తెలిపారు. అలాగే నల్లగొండను రాష్ట్రంలోనే తొలి 24/7 తాగునీటి సరఫరా పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి రూ.290 కోట్లతో ప్రతి ఇంటికి కృష్ణా జలాలను అందించే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.నల్లగొండ పట్టణంలో ఎక్కడా మట్టి రోడ్లు లేకుండా ప్రతి గల్లీలో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతి వార్డులో సుందరీకరణ పనులు, వాకింగ్ ట్రాక్‌లు, నర్సరీలు ఏర్పాటు చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

### పేపర్ లీకేజీలపై కేంద్రం సమాధానం చెప్పాలి

దేశంలో నీట్ సహా పలు పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాలు పదేపదే లీక్ కావడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మండిపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న కేంద్ర ప్రభుత్వం దీనిపై నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.పేపర్ లీకేజీలకు వ్యతిరేకంగా ఉద్యమం చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం అమానుషమని, విద్యార్థులకు అండగా నిలిచిన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై దాడికి పాల్పడడం, వారిని అరెస్టు చేయడం అప్రజాస్వామిక చర్య అని తీవ్రంగా ఖండించారు. దేశ యువతే తన కుటుంబమని భావించి విద్యార్థుల భవిష్యత్తు కోసం పోరాడుతున్న రాహుల్ గాంధీని గాయపరచడం అత్యంత హేయమైన చర్య అని అన్నారు.నీట్ సహా పలు పరీక్షల్లో చోటుచేసుకున్న అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాల కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు తగిన న్యాయం చేయాలని, బాధితులకు కేంద్ర ప్రభుత్వం పరిహారం ప్రకటించాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య రెడ్డి, డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ ఆమెర్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, రోడ్లు భవనాల శాఖ అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నాగోల్‌లో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ధర్నా – విద్యార్థులపై లాఠీచార్జ్‌ను ఖండించిన విద్యార్థి సంఘాలు

**నాగోల్ వెలుతురు జూలై 25:**




రంగారెడ్డి జిల్లా నాగోల్‌లో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఎన్ఎస్‌యూఐ నాయకుడు జయరాం యాదవ్ మాట్లాడుతూ, ఢిల్లీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌ను తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై ఎలాంటి కనికరం లేకుండా లాఠీచార్జ్ చేయడం, వారిపై కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు.పేపర్ లీకేజ్ వ్యవహారంలో అసలు బాధ్యులపై చర్యలు తీసుకోకుండా విద్యార్థులపైనే కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. పేపర్ లీకేజ్ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల హక్కులు, స్వేచ్ఛలను పరిరక్షించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆందోళనకారులు ధర్మేంద్ర ప్రధాన్ కేంద్ర మంత్రి రాజీనామా చేయాలని నినాదాలు చేశారు.ఈ ధర్నా కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఎన్ఎస్‌యూఐ నాయకుడు జయరాం యాదవ్‌తో పాటు హేమంత్, భవాని, సిద్ధు, మధు, మల్లేష్, రాఖీ, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

## పాటల వెంకన్నను పరామర్శించిన సిపిఐ నాయకులు

**చండూరు వెలుతురు జూలై 25:**

చండూరు మండలం కస్తాల గ్రామానికి చెందిన బొమ్మరబోయిన వెంకన్న (పాటల) మాతృమూర్తి ఇటీవల మృతిచెందగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పి స్తున్న AIYF జిల్లా కార్యదర్శి తీర్పార్ వెంకటేశ్వర్లు సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బి .లాలయ్య మండల కార్యవర్గ సభ్యులు ఈదుల కంటి కైలాసం తిరందాసు శ్రీనివాసులు.



## జేవీఆర్ఓసీ సీహెచ్‌పీని సందర్శించిన రైల్వే బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

**సత్తుపల్లి, వెలుతురు జులై 25**

సత్తుపల్లిలోని జేవీఆర్ ఉపరితల బొగ్గు గనిలోని (ఓపెన్ కాస్ట్ బొగ్గు గని) బొగ్గు నిర్వహణ ప్లాంట్ (సీహెచ్‌పీ)ని రైల్వే బోర్డు కార్యనిర్వాహక సంచాలకులు, రవాణా విభాగం (బొగ్గు) సయ్యద్ అబ్దుల్ రెహమాన్ శనివారం సందర్శించారు. భారతీయ రైల్వే వే ట్రాఫిక్ రవాణా సేవల కార్యనిర్వాహక సంచాలకులు (బొగ్గు రవాణా) బి. వెంకన్న, సికింద్రాబాద్ విభాగపు సీనియర్ నిర్వహణ అధికారి డి. నరేంద్ర వర్మ, సత్తుపల్లి ప్రాంత ముఖ్యాధికారి (జీఎం) చింతల శ్రీనివాస్‌లతో కలిసి ఆయన ఈ సందర్శన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్లాంట్ ఆవరణలో అధికారులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. అనంతరం జేవీఆర్ ప్లాంట్ లోని బొగ్గు నిల్వ స్థలం, రైల్వే బొగ్గు నింపే ప్రాంతాలు, సంకేత వ్యవస్థను వారు క్షుణ్ణంగా నిశిత పరిశీలన చేశారు.సత్తుపల్లి ప్రాంతంలో రైలు మార్గం ద్వారా జరుగుతున్న బొగ్గు రవాణా వివరాలను బి. వెంకన్న, జీఎం చింతల శ్రీనివాస్ ఈడీ సయ్యద్ అబ్దుల్ రెహమాన్‌కు వివరించారు. రాబోయే రోజుల్లో సత్తుపల్లి రైలు మార్గం ద్వారా బొగ్గు రవాణాను మరింత



పెంచే అవకాశాలపై ఈ భేటీలో వారు ప్రధానంగా చర్చించారు. రైల్వే రవాణా సామర్థ్యాన్ని పెంచి, బొగ్గు పంపే ప్రక్రియను వేగవంతం చేయడంపై అధికారులకు ఈడీ సయ్యద్ అబ్దుల్ రెహమాన్ పలు సూచనలు చేశారు. ఈ పర్యటనలో సీనియర్ నిర్వహణ అధికారి డి. నరేంద్ర వర్మ, కార్యనిర్వాహక సంచాలకులు (బొగ్గు రవాణా) బి. వెంకన్న, సత్తుపల్లి ఏరియా జీఎం చింతల శ్రీనివాస్ ప్రాంతీయ ఇంజనీర్ కె. సోమశేఖరరావు ఎస్ ఓ టు బొల్లం శ్రీనివాస్, ప్లాంట్ పరికరాల సహాయక ఇంజనీర్ ఈ&ఎం) సాయినాథ్, ఎస్ఈ (సివిల్) ఎ. రవికుమార్, ఇతర రైల్వే, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో మైభారత్ నమోదు కార్యక్రమాన్ని మిషన్ మోడ్‌లో విజయవంతం చేయాలి

- అదనపు జిల్లా కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి ఐఏఎస్

**ఇబ్రహీంపట్నం వెలుతురు జులై 25:**





ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కొంగరకలాన్ రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో జరిగిన.జిల్లా అ డ్వైజరీ కమిటీ జిల్లాస మన్వయ కమిటీసమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పి శెట్టి ఐఏఎస్ మాట్లాడుతూ భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడలమంత్రి త్వశాఖ ఆధ్వర్యంలోని స్వయం ప్రతిపత్తి సంస్థ మైభారత్ మేరా యువభారత్ చేపట్టిన ఇంటె న్సివ్ మైభారత్ రిజిస్ట్రేషన్ అవగాహన కార్యక్ర మాన్ని జిల్లాలో మిషన్ మోడ్‌లో అమలు చేసి లక్ష్యాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికా రులను ఆదేశించారు జిల్లాకలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు డా.,కిరణ్మయి కొప్పిశెట్టి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా అడ్వై జరీ కమిటీ జిల్లా సమన్వయకమిటీ సమావేశాల్లో జిల్లాకు నిర్దేశించిన80,251మంది యువత మైభారత్ పోర్టల్‌లో నమోదు లక్ష్యసాధనపై సమగ్రంగా సమీక్షించి శాఖలవారీ కార్యాచరణ ప్ర ణాళికను రూపొందిం చారుఈ సందర్భంగా మైభారత్ రంగారెడ్డి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ జిల్లా అ డ్వైజరీ కమిటీ సభ్యకార్యదర్శి శ్రీమతి బి.స్నేహల్ జ్ఞానేశ్వర్ బసుత్కర్ మాట్లాడుతూ యువత లో స్వచ్ఛంద సేవాభావం నాయకత్వ నైపుణ్యాలు సామాజిక బాధ్యత పౌరచైతన్యాన్ని పెంపొం దిం చేందుకు మైభారత్ వేదికగా పనిచేస్తోందని తెలిపారు జిల్లాకు కేటాయించిన 80,251 మం ది యువత నమోదులక్ష్యాన్ని నిర్ణీత సమయంలో పూర్తి చేయడానికి అన్నిప్రభుత్వ శాఖలు స మన్వయంతో పనిచేయాలని కోరారు అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు విద్యాసంస్థలు పట్టణ స్థానిక సంస్థలు గ్రామపంచాయతీలు ఎన్ఎస్ఎస్ ఎన్‌సీసీ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యువజన సంఘాలు స్వయం సహాయక సంఘాలు తదితర సంస్థల సహ కారంతో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు కళాశాలలు విశ్వవి ద్యాలయాలు ఐటీఐలు పాలిటెక్నిక్ కళాశాలలు పాఠశాలలు గ్రామాలు పట్టణాల్లో ప్రత్యేక న మోదు శిబిరాలు ఏర్పాటు చేసి ప్రతి అర్హత కలిగిన యువత మైభారత్ పోర్టల్‌లో నమోదు అ య్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు అన్ని శాఖలు వెంటనే నోడల్ అధి కారులను నియ మించినమోదు పురోగతిని ప్రతిరోజూ సమీ క్షించాలనిజిల్లా మైభారత్ కార్యాలయంతో నిరంతర సమ న్వయం కొనసాగించాలని ఆమెసూచించారు జిల్లా లక్ష్యాన్ని సాధించడంలో అన్నిశాఖల సమిష్టి కృషి కీలకమని పేర్కొన్నారు సమావేశం ముగింపులో జిల్లాలో మైభారత్ నమోదు కార్య క్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తామని అధికారులు హామీ ఇచ్చారు ఈసందర్భంగా జిల్లా పరిపాలన మరియు మైభారత్ సంస్థ జిల్లాలోని అర్హత క లిగిన యు వత అందరూ మైభారత్ పోర్టల్‌లో నమోదు చేసుకుని స్వచ్ఛంద సేవసామాజికసేవ నాయకత్వ వికాసం జాతి నిర్మాణ కార్యక్రమాల్లో చురుకుగా భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చే శాయిఈసమావేశంలో జిల్లాపరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి కృష్ణారెడ్డి జిల్లావైద్య ఆరో గ్యశాఖ అధికారి డా.డి.స్వర్ణకుమారి జిల్లా పరిశ్రమల కేంద్రంసహాయసంచాలకురాలుఎస్.రాధా లలిత జిల్లాపౌర సంబంధాల అధికారి బి.బాలేశ్వరి జిల్లాసాంఘిక సంక్షేమ అధికారి జె రామారా వుఎన్ఎస్ఎస్ ప్రతినిధులు డా.ఎస్ రమేష్ డా.ఎ రచన డా.చింతలరాకేష్ భవాని జిల్లా రెడ్‌క్రా స్ సొసైటీ ఉపాధ్యక్షుడువి పాండు ఖజాంచీ రాఘవరెడ్డి జిల్లా పర్యాటక అధికారి ఎస్ ప్రభాకర్ జిల్లా ఉపా ధిఅధికారి జి.జయశ్రీ, జిల్లావిద్యాశాఖ అధికారిఎస్ వెంకటేశ్వర్లు జిల్లా ఇంటర్మీడి యట్ విద్యాధికారి వెంక్యనాయక్ జిల్లాపంచాయతీ అధికారి వి సురేష్ మోహన్ మై భారత్ ప్ర తినిధులు శ్రీశైలం యాదవ్, శివకుమార్ శివగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్లందరినీ 'బీఎల్ఓ' యాప్‌లో నమోదు చేయాలి

- శంకర్ పల్లి మండలంలో 100% ప్రక్రియ పూర్తి కావాలి
- మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లారం వెంకటరెడ్డి

**శంకర్ పల్లి, వెలుతురు జులై 25 :**



శంకర్ పల్లి మండల పరిధిలోని పొద్దుటూరు గ్రామంలో శనివారం 'సర్ 2026' కార్యక్రమంలో భాగంగా ఓటర్ల సర్వే, సరిచూసే ప్రక్రియను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లారం వెంకటరెడ్డి, గ్రామ సర్పంచ్ బండ లక్ష్మీ నరసింహ, ఉపసర్పంచ్ గోవర్ధన్ రెడ్డి కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బొల్లారం వెంకటరెడ్డి మాట్లాడుతూ.. పొద్దుటూరు గ్రామ పరిధిలో మొత్తం మూడు పోలింగ్ బూత్‌లు ఉన్నాయని తెలిపారు. గ్రామంలోని అర్హులైన ఓటర్లందరినీ ఖచ్చితంగా గుర్తించి, వారి వివరాలను బూత్ లెవల్ ఆఫీసర్స్ (బీఎల్ఓ) యాప్‌లో తప్పులు లేకుండా ఎంట్రీ చేయాలని అధికారులకు సూచించారు. శంకర్ పల్లి మండలంలోని అన్ని గ్రామాలలో 'సర్' ప్రక్రియను 100 శాతం విజయవంతంగా పూర్తి చేయాలని, ఇందుకోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చురుగ్గా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఉమ్మెత్తల శ్వేత వినోద్ కుమార్, కోటే ప్రశాంత్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కవేలి జంగారెడ్డి, కొలన్ రాజశేఖర్ రెడ్డి గారు పాల్గొన్నారు. వీరితో పాటు బూత్ లెవల్ ఆఫీసర్లు ల్యాగల మల్లేశం ముదిరాజ్, శ్రీనివాస్, జయశ్రీ మరియు తదితరులు పాల్గొన్నారు.

# స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

**శంకర్ పల్లి, వెలుతురు జులై 25 :**



తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శంకర్పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ విఠలేశ్వర స్వామి దేవాలయంలో శనివారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శంకర్పల్లి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శ్వేతా పాండురంగారెడ్డి ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.ఈ సందర్భంగా వైస్ చైర్‌పర్సన్ శ్వేతా పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. తొలి ఏకాదశి నాడు విఠలేశ్వర స్వామిని దర్శించుకోవడం అత్యంత పుణ్యదాయకమని అన్నారు. శంకర్పల్లి మున్సిపల్ ప్రజలందరిపై ఆ జగన్నాథుడైన విఠలేశ్వర స్వామి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ, మున్సిపల్ ప్రజలంతా ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సంతోషంగా వర్ధిల్లాలని ఆమె భగవంతుడిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు వైస్ చైర్‌పర్సన్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు అందించారు. పూజా కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్వగృహాలో ఖాళీగా ఉన్న గదులను ఇందిరమ్మ ఇండ్లకు కేటాయించండి: సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 25:**



రేవంత్ రెడ్డి ప్రభుత్వం క్యూర్ రీజియన్ లో నివసిస్తున్న ప్రజల కొరకు ఇందిరమ్మ ఇండ్ల పేరుతో చేపట్టిన ప్రభుత్వ పథకం మంచిదని కానీ ఆచరణలో ఇలాంటివి పేద ప్రజలకు అంతగా ఉపయోగపడట్లేదు కాబట్టి పేద ప్రజల నుంచి డబ్బులను ఆశించే బదులు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అదేవిధంగా మేడ్చల్ జిల్లా పరిధిలో గతంలో నిర్మించబడి ఎవరికీ కేటాయించని వాంబే గృహాలు మరియు రాజీవ్ గృహాలు లో అనేక వేల ఇండ్లు ఉన్నాయని వాటిని ప్రభుత్వం ఇచ్చే ఐదు లక్షల తోటి మొత్తం నిర్మించవచ్చని కావున అలాంటి ఎవరికి కేటాయించబడనీ గృహాలను గుర్తించి వెంటనే అర్హులకు కేటాయించాలని సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ డిమాండ్ చేశారు.శనివారం సిపిఐ కుత్బుల్లాపూర్ మండల నాయకత్వంలో గాజులరామా రంలోని సర్వేనెంబర్ 79 లో నిర్మించి ఉన్న రాజీవ్ స్వగృహాలను సందర్శించడం జరిగింది. ఈ సందర్శనలో భాగంగా అక్కడ నిర్మాణం పూర్తయి ఎవరికి కేటాయిం చకుండా ఉన్న గృహాలను మరియు నిర్మాణం కాని వాటిని పరిశీలించడం జరిగింది . ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని జిల్లాలో ఇలా నిర్మించబడి ఎవరికీ కేటాయించని గృహాలు సుమారు మూడు నాలుగు వేలు ఉండవచ్చని వాటిని గుర్తించి పేద ప్రజలకు కేటాయించాలని కోరారు. అదేవిధంగా మేడ్చల్ జిల్లాలో ప్రభుత్వ భూమిని హెచ్ఎండిఏకి అప్పగించి ఊరుకుండడం వల్ల వేలాది ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయని అటువంటి భూములను గుర్తించి పేద ప్రజలకు పంచాలని డిమాండ్ చేశారు. ఒకవేళ పంచని పక్షంలో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి మరో భూ పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మహేష్ మండల కార్యదర్శి స్వామి సహాయ కార్యదర్శులు హరినాథ్ రావు రాములు, కోశాధికారి సదానంద్, ప్రజానా ట్యమండలి అధ్యక్షులు బాబు సిపిఐ నాయకులు మల్లేష్ రమేష్ ఇమామ్ సహదేవరెడ్డి యువజన సంఘం నాయకులు ప్రవీణ్ కీర్తి వంశీ తదితరులు పాల్గొన్నారు.

# తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 25:**



శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని శ్రీనివాస నగర్‌లో గల శ్రీశ్రీశ్రీ శ్రీనివాస అభయ ఆంజనేయ స్వామి దేవస్థానం ఆవరణలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో, తొలి ఏకాదశి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన కొలన్ హన్మంత్ రెడ్డి, నియోజకవర్గ ప్రజలందరూ సుఖ: శాంతులతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో ఆనందంగా జీవించాలని స్వామివారిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి ,డివిజన్ అధ్యక్షులు బొమ్మ వెంకటేశ్వర రెడ్డి (తాతి రెడ్డి) , వరగాని వాసు , కొలన్ జీవన్ రెడ్డి , మురళి , డీసీసీ ప్రధాన కార్యదర్శి రావూరి మౌళేశ్వర రావు , స్థానిక నాయకులు, కార్యకర్తలు, భక్తులు మరియు కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నీట్ పరీక్ష వ్యవహారం బీజేపీ ప్రభుత్వానికి చెంపపెట్టు: కాంగ్రెస్ నాయకుడు జిల్లా గణేష్

**కూకట్ పల్లి జూలై 25 వెలుతురు:**



నీట్ పరీక్ష నిర్వహణలో చోటుచేసుకున్న వైఫల్యం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని కాంగ్రెస్ నాయకుడు జిల్లా గణేష్ విమర్శించారు. ఈ పరిణామం నేటి యువత ఐక్యతకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత సంకల్పిస్తే ఏదైనా సాధించగలదని, ప్రజల గొంతును అణిచివే యాలనే ప్రయత్నాలు ఎంతకాలం కొనసా గవని అన్నారు. నిరుద్యోగ యువత పోరాట ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని పేర్కొన్నారు. నీట్ పరీక్ష వ్యవహారానికి సంబంధించి జరిగిన ఉద్యమాల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని జిల్లా గణేష్ కోరారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌ను తక్షణమే విడుదల చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో యువత బీజేపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు. ఈ విజయం భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని, ప్రతి ప్రభుత్వ వ్యవస్థలో తప్పు చేసిన వారికి తప్పనిసరిగా శిక్ష పడుతుందనే భయం ఉండాలని అన్నారు. ప్రభుత్వ అధికారులు, పాలకులు ప్రజలకు జవాబుదా రులుగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నయా భారత్ అంటే యువ భారత్. తప్పు ఎక్కడ జరిగినా ప్రశ్నించే ధైర్యం ప్రతి పౌరుడిలో ఉండాలి" అని అన్నారు.

# జగద్గిరిగుట్ట సిఐ సురేష్ కు చంద్రారెడ్డి శుభాకాంక్షలు ...

**కూకట్ పల్లి జూలై 25 వెలుతురు:**



జగద్గిరిగుట్ట నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన సురేష్ కు వెంకటేశ్వర్ నగర్ డివిజన్ పాపిరెడ్డినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు వెల్ఫేర్ సభ్యులు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ ప్రదన కార్యదర్శి ఆర్. భగవంతరెడ్డి, కోశాధికారి నరసింహులు ముదిరాజ్, నేతలు ఆర్. తిరుపతిరెడ్డి , పి .శంకర్ రెడ్డి, తాటి కిరణ్, సత్యనారాయణ రెడ్డి, కనకయ్య, హెచ్ రాజు రెడ్డి పాల్గొన్నారు.

# తొలి ఏకాదశి... వెంకటేశ్వర స్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు..

- గోవింద నామస్మరణతో మారుమోగిన వివేకానంద నగర్ ఆలయం..

**కూకట్ పల్లి జూలై 25 వెలుతురు:**



తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వివేకానంద నగర్ ఆధ్యాత్మిక శోభతో కళ కళలాడింది. శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో గోవింద నామస్మరణతో భక్తులు భక్తిరసంలో మునిగిపోయారు. స్వామివారి దివ్య మంగళ రూపాన్ని దర్శించుకునేందుకు వేకువజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోగా, "గోవిందా... గోవిందా..." నామస్మరణతో పరిసరాలు మార్మోగాయి. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, విష్ణు సహస్రనామ పారాయణం తదితర ధార్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దీర్ఘ క్యూలైన్లలో నిలబడి భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయడంతో దర్శనం ప్రశాంతంగా కొనసాగింది.

# పెండింగ్ కేసుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- డీసీపీ యోగేష్ గౌతమ్

**శంకర్ పల్లి, వెలుతురు జులై 25:**



పెండింగ్ కేసుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీసీపీ యోగేష్ గౌతమ్ హెచ్చరించారు. శనివారం మోకిల పోలీస్ స్టేషన్ ను ఆకస్మికతనికి నిర్వహించారు. కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి వెంటనే పరిష్కారం చూపే విధంగా సిబ్బంది పని చేయాలని సూచించారు. పనితీరులో ఎటువంటి నిర్లక్ష్యం వహించిన కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. పోలీసులు ప్రజలతో మమేకమవుతూ వారితో ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అమలు చేస్తూ వారి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. కాగా గ్రామాల్లో రాత్రి సమయాలు గస్తీ నిర్వహిస్తూ ఎటువంటి దొంగతనాలు కాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ ట్రాఫిక్ సమస్యల పట్ల కఠినంగా వ్యవహరించి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా బాధ్యతాయుతంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మొకిల సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్సైలు సురేష్ గౌడ్, పద్మ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గుట్ట నూతన ఇన్స్పెక్టర్ సురేష్ కి సన్మానం

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 25:**



జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషనకు నూతనంగా నియమించబడిన ఇన్స్పెక్టర్ సురేష్ ని నేడు సిపిఐ స్థానిక నాయకత్వం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెల్పడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలు శాంతియుతంగా జీవించడానికి పోలీస్ లు పార్టీలు కలిసి పనిచెయ్యాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, మండల కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శులు హరినాథ్,రాములు ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాస్,ప్రజానాట్యమండలి అధ్యక్షులు బాబు,లెనిన్ నగర్ కమిటీ కార్యదర్శి సాయిలు, కోశాధికారి సదానంద్, యువజన సంఘం నాయకులు ప్రవీణ్,వంశీ,కీర్తి,శాఖ కార్యదర్శులు సహదేవ్ రెడ్డి, వెంకటేష్, మల్లేష్, రమేష్ ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నారం, మునిపంపుల పాఠశాలలో ప్రత్యేక న్యాయవిజ్ఞాన అవగాహన సదస్సు

- నిర్వహించిన రామన్నపేట మండల న్యాయ సేవ అధికార సంస్థ
- ముఖ్య అతిథులుగా జూనియర్ సివిల్ జడ్జ్ శిరీష, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ రత్నకుమారి.



**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 25:**

మండల పరిధిలోని పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు కార్యక్రమాన్ని ఉద్దేశించి మెజిస్ట్రేట్ మాట్లాడుతూ విద్యార్థులు ముఖ్యంగా అన్ని రంగాలలో ముందు ఉండాలన్నారు. విద్యా వ్యవస్థ వల్లనే ప్రపంచాన్ని మార్చే అవకాశం ఉంటది. విద్యార్థులకి ఎలాంటి సమస్యలు వచ్చిన వెంటనే పరిష్కారం దిశగా అడుగులు వేయాలని సూచించారు.

అందరికీ పలు రకాల చట్టాలపై అవగాహన పొందాలని, విద్యా హక్కు చట్టం, బాలకార్మిక నిరోధక చట్టం, బాల్యవివాహాలు, ఫోక్సో చట్టం, లేబర్ చట్టాలు, మాదక ద్రవ్యాలు, అన్ని రకాలుగా ఎలాంటి సమస్య వచ్చిన చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు.

విద్యార్థులకి పాఠశాలలో గాని, వచ్చి వెళ్ళే దారిలో ఆకతాయిల వల్ల గాని ఏమైనా సమస్య అనిపించిన వెంటనే పాఠశాలలో ఏర్పాటు చేసిన చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కి గానీ, స్థానిక పోలీస్ స్టేషన్ లలో గానీ, మండల స్థాయిలో ఉన్న న్యాయ సేవ అధికార సంస్థ దృష్టికి గాని తీసుకురావాలని, ఎవరు కూడా అధైర్య పడవద్దని సూచించారు. ప్రతి ఒక్క విద్యార్ధి వేరే బయటి ఆలోచనలు పెట్టుకోకుండా, పుస్తకాలు చదవడం మీదనే దృష్టి పెట్టాలి, చెడు దారి పట్టించే ఆలోచనలు పక్కకి నెట్టేసి, ఏమి ఆలోచనలు చేసిన మంచి నిర్ణయాలు తీసుకునే విధంగా ఉండాలని అన్నారు. సమాజం పట్ల మంచి అవగాహనతో ఉండాలన్నారు. సమాజంలో మన హక్కులు, బాధ్యతలు నిర్వహణలో భాగస్వామ్యులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ఎంఏ మజీద్, యాదాస్ యాదయ్య, ఏజీపి చుక్క శ్రవణ్ కునూరు శ్రీనివాస్, పాల్వంచ జగతయ్య నూతి రమేష్, లీగల్ సర్వీసెస్ టీమ్ సభ్యులు బత్తుల గణేష్, కానుగంటి శ్రీశైలం, పాఠశాలల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు , పోలీసు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# గుండాల మండలంలో అధికారుల సమీక్ష సమావేశం

**ప్రతి ఇంటికి ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలి**

**డీఆర్‌డీఏ అదనపు పీడీ సురేష్**

**గుండాల జులై 25.(వెలుతురు):**



ఉపాధి హామీ పనులు, స్వచ్ఛ భారత్, జలసిరి, వనమహోత్సవం పనుల పురోగతిపై సమీక్ష యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు డీఆర్‌డీఏ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ సురేష్, డీపీవో శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డీఆర్‌డీఏ అదనపు పీడీ సురేష్ మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం తగ్గి ప్రస్తుతం వర్షపాతం అనుకూలంగా ఉన్న నేపథ్యంలో గ్రామాల్లో ప్రతి ఇంటికి ఇంకుడు గుంతల నిర్మాణాన్ని చేపట్టాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కింద కూలీలకు తప్పనిసరిగా పని కల్పించాలని ఆదేశించారు. అలాగే సన్నకారు రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా వ్యక్తిగత బావుల తవ్వకాలకు అవకాశం కల్పించాలని తెలిపారు.సమావేశంలో స్వచ్ఛ భారత్ మిషన్, జలసిరి, వనమహోత్సవం, వీఓ భవనాల నిర్మాణ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. వివిధ గ్రామపంచాయతీల పనితీరును పరిశీలించి, పంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటిస్తూ ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో డీపీవో శ్రీకాంత్ రెడ్డి, ఎంపీడీవో చండీరాణి, పీఆర్ ఏఈ దామోదర్, ఎంపీవో రావూఫ్ అలీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భావన, ఏపీవో ఇమ్మానుయేల్, ఏపీఎం వెంకటేశ్వర్లు, మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# వనమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన నాగార్జున పాఠశాల

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 25:**




పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా నాగార్జున పాఠశాల ఆధ్వర్యంలో లచ్చిరెడ్డిగూడెంలో శనివారం వనమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది కలిసి పాఠశాల ఆవరణలో మరియు పరిసర ప్రాంతాల్లో పలు రకాల మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు మొక్కల ప్రాముఖ్యత, పర్యావరణ సమతుల్యతలో వాటి పాత్ర, భవిష్యత్ తరాలకు పచ్చని ప్రకృతిని అందించాల్సిన బాధ్యతపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించి పెద్ద చెట్టుగా తీర్చిదిద్దాలని ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా నాగార్జున స్కూల్ కరస్పాండెంట్ డా. ఎన్. నాగరాజు మాట్లాడుతూ, "చెట్లు భూమికి ఊపిరితిత్తులు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ప్రతి పౌరుడి బాధ్యత. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయి. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలి" అని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# 50 ఏళ్లు నిండిన గీత పని వారలకు పింఛన్లు వెంటనే మంజూరు చేయాలి..

- గీత పని వారల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎర్ర రమేష్ గౌడ్.

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 25:**



గీత పనివారలు 20 ఏళ్లు నిండిన దగ్గర నుండి తాళ్ళెక్కుతూ తమ వృత్తిలో భాగంగా 50 ఏళ్ళు వచ్చేసరికి శరీరం ప్రటుత్వం కోల్పోతుందని, నరాలు బలహీనపడి ఇతర పనులు చేసుకోవడానికి కూడా సహకరించవని అందు కోసమే 50 ఏళ్లకే పింఛన్ ఇవ్వాలని డిమాండ్ ను గీత పనివారల సంఘం ఆధ్వర్యంలో గతంలోనే సాధించుకోవడం జరిగిందని, ఆ జీవో యొక్క విలువను గుర్తించి ప్రభుత్వం 50 ఏళ్లు నిండిన గీత పనివారలకు పింఛన్లు వెంటనే మంజూరు చేయాలని గీత పని వారల సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా సహాయ కార్యదర్శి ఎర్ర రమేష్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా జీవో నెంబర్ 560 ప్రకారం గీత పని వారలకు తాటి చెట్లు ఈత చెట్ల వనం పెంపకానికి ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా గీత పనివారల సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో గీత పని వారల సంఘం మండల అధ్యక్షులు గంగాపురం వెంకటయ్య, సొసైటీ అధ్యక్షులు ఎర్ర వెంకటేశం, లగ్గోని యాదయ్య, బాలగోని మల్లయ్య, కూనూరు కృష్ణ, బాలగోని నరసింహ, భూపతి నరసింహ, గోపగోని సహదేవ్ బాలగోని శంకర్, కూనూరు నరసింహ, చెరుకు శివరాజ్ గుణగంటి కన్నయ్య, ఆకిటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# రాజగోపాల్ రెడ్డిని విమర్శించే అర్హత సామెల్ కు లేదు: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు

- మాలాంటి దళిత నాయకులకు ఎమ్మెల్యే పెద్దపీట
- రాజగోపాల్ రెడ్డి ఒక ప్రాంతానికి చెందిన వ్యక్తి కాదు..
- యావత్తు తెలంగాణ ప్రజలు ఆయన వైపు చూస్తున్నారు.

**మునుగోడు వెలుతురు జూలై 25:**




కులం, మతం, ప్రాంతం అనే తేడా లేకుండా రాజ్ గోపాల్ రెడ్డి గారు మానవత్వం తో చేస్తున్న సేవలు తెలంగాణకే ఆదర్శం.నువ్వు టికెట్ ఇప్పియ్యమని రాజ్ గోపాల్ రెడ్డి గారి ఇంటి చుట్టూ తిరిగి బతిమాలుకున్న విషయం మర్చిపోయినవేమో కానీ మేం మరచిపోలేదు. నీకోసం మేమంతా వచ్చి అక్కడ ప్రచారం చేసినది మర్చిపోయావా రాజ్ గోపాల్ రెడ్డి గారి సహకారం లేకపోతే నేను గెలిచేవాడినే కాదు అని నువ్వు మీడియాతో మాట్లాడింది నిజం కాదా.

సాయం చేసిన మనిషి పై దుమ్మెత్తిపోస్తూ నీ నీచపు తత్వాన్ని దళితజాతికి పూస్తున్నావ్ .దళిత జాతి బిడ్డలకు పదవులు ఇస్తూ ప్రోత్సహిస్తున్న గొప్ప మనసున్న వ్యక్తి రాజగోపాల్ రెడ్డి గారు.కోమటిరెడ్డి బ్రదర్స్ పై మందుల సామెల్ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని.. బేషరతుగా క్షమాపణ చెప్పాలి.<

లేకుంటే అదే దళితుల బిడ్డల చేతిలో చెప్పుదెబ్బలు తింటావ్ ఖబర్దార్ మందుల సామేల్ శనివారం మండల కేంద్రంలోని స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు జాల వెంకన్న యాదవ్, పందుల భాస్కర్, పందుల నరసింహ, మాధగోని రాజేష్ గౌడ్, పాలకూరి యాదయ్య గౌడ్, కుంభం చెన్నారెడ్డి, మిరియాల వెంకన్న, వివిధ గ్రామాల కాంగ్రెస్ సర్పంచులు ఏర్పుల మోహన్ బాబు, జీడిమెట్ల సైదులు, కంభంపాటి జ్యోతి వెంకటేశ్వర్లు, దాసరి గోవర్ధన్, కదిరి లింగయ్య, చీమల రాజు, నాయకులు పంతంగి స్వామి గౌడ్, నడిపల్లి యాదగిరి, నకరికంటి యాదయ్య గౌడ్, మక్కెన అప్పారావు, పుట్ట శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ నీనో ప్రభావంతో రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలి

- మండల వ్యవసాయ అధికారి సైదా నాయక్

**నూతనకల్ జూలై25( వెలుతురు)**





మండలంలోని బిక్కుమల్ల గ్రామంలో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఎల్ నినో ప్రభావం వల్ల వ్యవసాయంలో కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు శనివారం.ఈ సందర్భంగా ఏవో సైదా నాయక్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం కారణంగా ఇప్పటివరకు వర్షపాతం 30% తగ్గిందని రాబోవు రోజులలో ఇంకా తగ్గే అవకాశం ఉన్నందున అధిక నీటి అవసరం ఉండే వరి, మొక్కజొన్న వంటి పంటల సాగును తగ్గించి, తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలు, వాణిజ్య పంటలు పప్పు ధాన్యాలు మరియు చిరు ధాన్యాలు మిల్లెట్స్ వంటి పంటల సాగు వైపు రైతులు మళ్లాలని సూచించారు.నీటి వనరులను పొదుపుగా వినియోగిస్తూ,వ్యవసాయ శాఖ సూచించిన పంటలను మాత్రమే సాగు చేయడం ద్వారా వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని రైతులకు వారు వివరించారు.ఉపాధి హామీ పథకంలో బోర్ వెల్ రీఛార్జ్ స్కీం కింద రైతులకు నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం ఉందని రైతులు సద్వినియోగించుకోవాలని ప్రతి నీటి బొట్టుని కాపాడుకునే బాధ్యత ప్రతి పౌరుని పై ఉన్నదని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో ఏఈఓలు పి.సంధ్య, జానయ్య, పావని పంచాయతీ సెక్రటరీ ఆకుల ఉమేష్ గ్రామ రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఇట్లు,
మండల వ్యవసాయ అధికారి
నూతన్కల్ మండలం

# గెజిటెడ్ అధ్యాపకుల సంఘం జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన డాక్టర్ డి. కిషన్

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 25:**




తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శిగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ డి. కిషన్ ఈరోజు జరిగిన జిల్లా కమిటీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరు గతంలో కూడా జిల్లా అధ్యక్షుడిగా, జిల్లా కార్యదర్శిగా పనిచేసి మూడవ పర్యాయం మళ్లీ జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం అభినందిస్తూ నిరంతరం సభ్యుల సమస్యల పరిష్కారం చేయడంలో ముందుండాలని, ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధి కోసం పాటుపడాలని కోరారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది కిషన్ ను అభినందించారు.

# ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీని ఆకస్మిక తనిఖీ

**ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి**

**వెలుతురు నారాయణఖేడ్ జూలై 25 :**





సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ నియోజకవర్గం లో కంగ్టి మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ (TWRJC) ను ఈరోజు నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణమంతా కలియతిరిగిన ఎమ్మెల్యే, తరగతి గదులు, వసతులను పరిశీలించారు.అనంతరం విద్యార్థులతో నేరుగా ముచ్చటించి కళాశాలలో అందుతున్న విద్య, భోజన వసతి, మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారుఅలాగే పాఠశాల ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఉపాధ్యాయులతో సమగ్రంగా చర్చించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను గమనించిన ఎమ్మెల్యే స్పందిస్తూ... త్వరలోనే ఈ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ:**

"ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే మా ముఖ్య ఉద్దేశం. విద్యార్థులంతా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి, సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలి."ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండలానికి సంబంధించిన సర్పంచులు ఉపసర్పంచ్లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ రుక్మిణి పాండురంగ స్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో ఆషాఢ తొలి ఏకాదశి వేడుకలు

**జహీరాబాద్ వెలుతురు జూలై 25:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని శ్రీ రుక్మిణి పాండురంగ స్వామి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆషాఢ తొలి ఏకాదశి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శ్రీ రుక్మిణి పాండురంగ స్వామివారికి, కోటి పార్థివ లింగ స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.అనంతరం మహిళలు సామూహికంగా భగవద్గీత పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించి ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో ఉపవాస దీక్షలు చేపట్టి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఆషాఢ ద్వాదశి సందర్భంగా ఆదివారం ఉదయం స్వామివారికి గోపాలకాడ (పల్లకీ సేవ) కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం మహా హారతి, భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందని పేర్కొంటూ, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

# కరీంనగర్ బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా బత్తుల లక్ష్మీనారాయణ నియామకం

**కరీంనగర్ వెలుతురు జూలై 25:**





కరీంనగర్ బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా బత్తుల లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి కిరణ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు.బత్తుల లక్ష్మీనారాయణ గతంలో బీజేపీ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, చొప్పదండి మండలం గుమ్లాపూర్ ఎంపీటీసీగా సేవలందించారు.ఈ సందర్భంగా బత్తుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. జిల్లాలో బిజెపి, ఎస్సీ మోర్చా బలోపేతానికి తనవంతు పూర్తి కృషి చేస్తానని తెలిపారు. కరీంనగర్ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి కిరణ్, అలాగేతన నియమాకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులందరికీ ఆయన పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

# ఖేడ్ నూతన TNGO's యూనియన్ కార్యవర్గం మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కర్ సన్మానం కార్యక్రమం



**వెలుతురు నారాయణఖేడ్ జూలై 25 :**



సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ నూతన TNGO's యూనియన్ కార్యవర్గం నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కర్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కర్ నూతన కార్యవర్గానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం సమష్టిగా కృషి చేసి, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో TNGO's యూనియన్ అధ్యక్షుడు ఎం.డి. మిస్కిన్, ప్రధాన కార్యదర్శి పి. దత్తు, అసోసియేట్ కార్యదర్శి కె. రవీందర్, కోశాధికారి జట్ల భాస్కర్, ఉపాధ్యక్షులు సంతోష్ కుమార్, ఎస్. శ్రీనివాసులు, రజిత, సాయన్న, జాయింట్ సెక్రటరీలు అరుణ్, రాజ్ కుమార్, విట్టవ్వ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ముజమ్మిల్, పబ్లిసిటీ సెక్రటరీ రుక్మారెడ్డి పాల్గొన్నారు.అలాగే ఈసీ సభ్యులు నాగలక్ష్మి , లక్ష్మణ్ కుమార్, పండరీ, సూర్యకాంత్, ప్రవీణ్, రాజు నాయక్, నిర్మల రాథోడ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజలకు అండగా మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి

**వెలుతురు నారాయణఖేడ్ జూలై 25 :**



సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ నియోజకవర్గం లో మనూర్ మండలం బెల్లాపూర్ గ్రామంలో గత ప్రభుత్వంలో చట్ట బద్ధంగా నిరుపేదలకు అందజేసిన ఇంటి స్థలాలు వారు అందులో నివసించడానికి నిర్మించుకున్న నివాస గృహాలను ఈ దౌర్భాగ్యమైన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఎమ్మెల్యే సంజీవరెడ్డి వాటిని నిరంకుశంగా కూలగొట్టడం దౌర్జన్యం అని గౌరవ నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి మండిపడ్డారు..

**మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ..**

గత ప్రభుత్వంలో పేదలు నివసించడానికి వారికి అర్హులని భావించి నిరుపేదలకు ఇంటి స్థలాలను కేటాయించి వాటికి సర్టిఫికెట్లు కేటాయించామని ఇప్పుడు ఈ దౌర్భాగ్యమైన ఎమ్మెల్యే ఈ ప్రభుత్వం.అన్యాయంగా వారి ఇండ్లపై బుల్డోజర్ తీసుకుపోయి వాటిని కులగొట్టి నిరుపేదలకు ఉండడానికి నీడ లేకుండా చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలోని హిట్లర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గంలో నిరంకుశ ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఇద్దరు పేద ప్రజల ఉసురు పోసుకుంటున్నారని తెలిపారు.ఇందిరమ్మ రాజ్యంలో ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం దేవుడు ఎరుగు కానీ నిరుపేదలు నివసిస్తున్న గృహాలను నేలమట్టం చేయడం దురదృష్టకరమని తెలిపారు. ఈ చర్యలు మానుకోకపోతే ఈ ప్రభుత్వం పైన పేద ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని ఈ ముఖ్యమంత్రిని ఈ ఎమ్మెల్యేను గద్దెతించేవరకు ఊరుకోమని తెలిపారు.ఇప్పటికైనా ఈ ప్రభుత్వం మేలుకొని కేటాయించిన వారికి ఇందిరమ్మ పథకం ద్వారా ఇండ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.అనంతరం బాధితుల తరఫున మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి సబ్ కలెక్టర్ ఉమా హారతి గారికి వినతి పత్రాన్ని అందజేసి నిరుపేద ప్రజలకు న్యాయం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బాధితులు మరియు వారికి మద్దతుగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మేయర్ సుడిగాలి పర్యటన, ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు, ఐసీడీఎస్ భవనం నిర్మాణ పనులపై క్షేత్రస్థాయి సమీక్ష

- **నిర్ణీత గడువులోపు నాణ్యతతో పనులు పూర్తి చేయాలి**
- **మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్ వెలుతురు జూలై 25:**





కరీంనగర్ నగర ప్రజలకు అత్యాధునిక మౌలిక వసతులు అందించాలనే లక్ష్యంతో కరీంనగర్ నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శ్రీ ప్రఫుల్ దేశాయ్ గారితో కలిసి శనివారం నగరంలోని పలు అభివృద్ధి పనులను ఆకస్మికంగా పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ వెజ్ & నాన్-వెజ్ మార్కెట్లు, ఐసీడీఎస్ (ICDS) భవనం, పార్కింగ్ మరియు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.ముందుగా పద్మనగర్ ఇంటిగ్రేటెడ్ వెజ్ & నాన్-వెజ్ మార్కెట్ ను సందర్శించిన మేయర్, ఇప్పటికే ప్రజలకు అందుబాటులోకి వచ్చిన ఈ మార్కెట్ నిర్వహణను మరింత మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. పారిశుధ్యం, వినియోగదారుల సౌకర్యాలు, వ్యాపారుల అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.అనంతరం కాశ్మీర్‌గడ్డ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులను పరిశీలించిన మేయర్, మిగిలిన పనులను వేగవంతం చేసి రాబోయే 30 రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.తదుపరి కలెక్టర్ క్యాంప్ కార్యాలయం ఎదురుగా నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను సమీక్షించిన మేయర్, నిర్మాణాన్ని అత్యున్నత ప్రమాణాలతో పూర్తి చేసి మూడు నెలల్లో ప్రారంభానికి సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.అనంతరం నిర్మాణంలో ఉన్న ఐసీడీఎస్ (ICDS) భవనం, పార్కింగ్ మరియు షాపింగ్ కాంప్లెక్స్ పనులను మేయర్, కమిషనర్ క్షుణ్ణంగా పరిశీలించారు. భవన నిర్మాణ నాణ్యత, పార్కింగ్ సౌకర్యాలు, షాపింగ్ కాంప్లెక్స్ రూపకల్పన, విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ, పారిశుధ్యం, భద్రతా ప్రమాణాలు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని ఆధునిక సౌకర్యాలతో భవనాన్ని పూర్తి చేయాలని, షాపింగ్ కాంప్లెక్స్‌లో వ్యాపారులకు మెరుగైన వసతులు, సందర్శకులకు విశాలమైన పార్కింగ్, సులభ రాకపోకలకు అనువైన ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**అధికారులకు మేయర్, కమిషనర్ కీలక ఆదేశాలు**

**నిర్మాణ పనులను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలి.**

**నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదు.**

**ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షణ నిర్వహించాలి.**

**భవనాలు దీర్ఘకాలం ఉపయోగపడేలా ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించాలి.**

**పారిశుధ్యం, పార్కింగ్, ప్రజా సౌకర్యాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలి.**

**అవసరమైన చోట అదనపు సిబ్బంది, యంత్రాలతో పనులను వేగవంతం చేయాలి.**

ఈ సందర్భంగా మేయర్ ★శ్రీ కొలగాని శ్రీనివాస్★ మాట్లాడుతూ, నగరంలో చేపడుతున్న ప్రతి అభివృద్ధి పనిని నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని తెలిపారు. ఆధునిక మార్కెట్లు, సమగ్ర పార్కింగ్ సదుపాయాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు నగరాభివృద్ధికి కొత్త దిశను చూపుతాయని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించే మౌలిక వసతుల కల్పనలో నగర పాలక సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆయన స్పష్టం చేశారు.

ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్ శ్రీ ప్రఫుల్ దేశాయ్ , డిప్యూటీ మేయర్ వై సునీల్ రావు గారు, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీక్‌పై జహీరాబాద్‌లో ఎస్ఐఓ భారీ నిరసన ర్యాలీ

- **పారదర్శక విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి...**
- **కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి...**
- **ఎస్ఐఓ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఫసీయుద్దీన్....**

**జహీరాబాద్ వెలుతురు జూలై 25:**




నీట్ (NEET) పేపర్ లీక్ వ్యవహారంపై పారదర్శక, నిష్పాక్షిక విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఐఓ) ఆధ్వర్యంలో శనివారం జహీరాబాద్‌లో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.పట్టణంలోని బాగా రెడ్డి స్టేడియం నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన రహదారుల మీదుగా జాతీయ రహదారి-65పై ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు సాగింది. అక్కడ విద్యార్థులు, యువత నిరసన కార్యక్రమం నిర్వహించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యా వ్యవస్థలో పారదర్శకతను కాపాడాలని, నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కుట్రకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఎస్ఐఓ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఫసీయుద్దీన్ మాట్లాడుతూ, నీట్ పేపర్ లీక్ దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసిన అత్యంత తీవ్రమైన అంశమని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై స్వతంత్ర, పారదర్శక, వేగవంతమైన విచారణ జరిపి కుట్రలో పాల్గొన్న ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.పరీక్షల నిర్వహణలో జరిగిన వైఫల్యాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై జరిగినట్లు పేర్కొన్న లాఠీచార్జ్‌ను తీవ్రంగా ఖండిస్తూ, ప్రజాస్వామ్యంలో విద్యార్థులకు తమ అభిప్రాయాలను వ్యక్తపరిచే హక్కు ఉందన్నారు.విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేకపోతే ఎస్ఐఓ ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ నిరసన ర్యాలీ, ధర్నా కార్యక్రమంలో ఎస్ఐఓ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విద్యా వ్యవస్థలో పారదర్శకత, న్యాయం, అవినీతి రహిత పరీక్షల నిర్వహణ కోసం నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.

# భక్తిశ్రద్ధలతో శ్రీమన్నారాయణ హోమం

- **బర్దిపూర్ దత్తగిరి ఆశ్రమంలో ప్రారంభమైన గురుపౌర్ణమి ఉత్సవాలు...**
- **గురు చరిత్ర పారాయణంలో పాల్గొంటున్న భక్తులు...**
- **29న వ్యాసపౌర్ణమి మహోత్సవాలు...**

**జహీరాబాద్ వెలుతురు జూలై 25:**



సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బర్దిపూర్‌లోని శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో ఈ నెల 29న నిర్వహించనున్న వ్యాసపౌర్ణమి (గురుపౌర్ణమి) మహోత్సవాల సందర్భంగా ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ గణపతి పూజ, గోపూజ, గురు చరిత్ర పారాయణం, వివిధ ధార్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.తొలి ఏకాదశి సందర్భంగా ఆశ్రమంలో శ్రీమన్నారాయణ హోమాన్ని వేద మంత్రోచ్చారణల మధ్య అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, గోపూజ, పుణ్యాహవాచనం, కలశ స్థాపన, నవగ్రహ పూజ, అగ్ని ప్రతిష్ఠ, సంకల్పం అనంతరం యజ్ఞగుండంలో నెయ్యి, సమిధలు, నవధాన్యాలు, ఔషధ ద్రవ్యాలను సమర్పిస్తూ "ఓం నమో నారాయణాయ" మంత్రోచ్చారణల నడుమ హోమం నిర్వహించారు.అనంతరం ఆశ్రమ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ 1008 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్, మహామండలేశ్వర్ డాక్టర్ సిద్ధేశ్వరానందగిరి మహారాజ్ ఆధ్వర్యంలో వేద పాఠశాల విద్యార్థుల వేదఘోషలు, మంగళ వాయిద్యాల నడుమ పూర్ణాహుతి కార్యక్రమం ఘనంగా జరిగింది. హోమంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో ఆనందగిరి స్వామి, నందినిగిరి స్వామి, అర్చకులు శ్రీపాద్ స్వామి, నాగేంద్రయ్య స్వామి, వేద పాఠశాల విద్యార్థులు, ఆశ్రమ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. 29న జరిగే గురుపౌర్ణమి మహోత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు హాజరుకావాలని ఆశ్రమ నిర్వాహకులు ఆహ్వానించారు.

# ఖేడ్ నియోజకవర్గంలోని ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలి ఎస్ చిరంజీవి

**ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కన్వీనర్**

**వెలుతురు నారాయణఖేడ్ జూలై 25 :**

సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వ భూములను సర్వే చేసి అర్హులైన పేద కుటుంబాలకు ఇంటి స్థలాలు కేటాయించాలని, అలాగే అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ సంగారెడ్డి జిల్లా కన్వీనర్ ఎస్. చిరంజీవి ప్రభుత్వాన్ని కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో పేద కుటుంబాలు సొంత ఇల్లు, ఇంటి స్థలం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. గ్రామాల్లో జనాభా పెరగడం, నివాస స్థలాల కొరత కారణంగా అనేక కుటుంబాలు ఇరుకైన ప్రదేశాల్లో నివసించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.అనేక గ్రామాల్లో ప్రభుత్వ భూములు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని కొందరు అక్రమంగా ఆక్రమించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి కబ్జాలను అరికట్టి, ప్రభుత్వ భూములను పరిరక్షించి, అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఇప్పటికే నారాయణఖేడ్ పట్టణంలో కూడా ప్రభుత్వ భూములపై అక్రమ ఆక్రమణలు జరిగినట్లు పేర్కొంటూ, ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామాలు, పట్టణాల్లోని ప్రభుత్వ భూములను సమగ్రంగా సర్వే చేసి, అర్హులైన పేదలకు పారదర్శకంగా ఇంటి స్థలాలు కేటాయించే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా నాయకులు లక్ష్మణ్ సోయల్ సురేష్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.



# గల్లీ నుండి ఢిల్లీ వరకు బీసీలను ఏకం చేసేందుకే ఆగస్టు 7న బెంగళూరులో జాతీయ ఓబీసీ మహాసభ నిర్వహిస్తున్నాం

- **బీసీ రిజర్వేషన్లు లేని మహిళా బిల్లు, డీ లిమిటేషన్ వద్దు**
- **వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లు పెట్టాల్సిందే**
- **జాతీయ ఓబీసీ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ లో బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ హెచ్చరిక**

**హైదరాబాద్ వెలుతురు జూలై 25:**



దేశంలో సగభాగానికి పైగా ఉన్న బీసీల హక్కుల సాధన కోసం కోట్లాదిమంది బీసీలను కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు ఏకం చేసి గల్లీ నుండి ఢిల్లీ వరకు బీసీ ఉద్యమ జ్వాలను రగిలిస్తామనీ బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అన్నారు.నేడు పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద ఆగస్టు 7న బెంగళూరులో జరిగే జాతీయ ఓబీసీ మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ గోడ పత్రికలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జాజుల లింగంగౌడ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బిసి ఉద్యమాన్ని విస్తరించడానికి ఆగస్టు ఏడో తేదీన ప్రతి సంవత్సరం జాతీయ ఓబీసీ మహాసభలను ప్రతి రాష్ట్రంలో నిర్వహిస్తున్నామని, ఇప్పటికే ఢిల్లీ, ముంబై, నాగపూర్, హైదరాబాద్, తిరుపతి, అమృత్ సర్, గోవా లో నిర్వహించి ఈసారి బెంగుళూరులో నిర్వహిస్తున్నామన్నారు, బెంగళూరులో నిర్వహించే ఈ సభకు దేశం నలుమూలల నుండి వేలాదిమంది ఓబీసీ ప్రతినిధులు హాజరవుతున్నట్లు ఆయన వెల్లడించారు.దేశ వ్యాప్తంగా జాతి జనగణలో బీసీ కులగణన చేపట్టాలని, మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోట కల్పించాలని, జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచాలని, చట్ట సభలలో బీసీలకు 50% రాజకీయ రిజర్వేషన్ కల్పించాలనే ప్రధాన డిమాండ్ లపై జాతీయ సమావేశంలో చర్చించి భవిష్యత్ రాజకీయ కార్యాచరణ ప్రకటిస్తామని ఆయన తెలిపారు.ముఖ్యంగా ప్రస్తుతం నడుస్తున్న వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం డిలిమిటేషన్ మరియు మహిళా బిల్లును పార్లమెంట్ లో ఆమోదించుకోవాలని చూస్తుందని, బీసీల రాజకీయ రిజర్వేషన్లు కల్పించకుండా మహిళా బిల్లు, డిలిమిటేషన్ బిల్లును పెట్టిన, ప్రతిపక్ష పార్టీలు పార్లమెంట్లో వ్యతిరేకించి ఆమోదించకుండా అడ్డుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.మహిళా బిల్లు, డీలిమిటేషన్ వలన బీసీలకు ఎలాంటి రాజకీయ ప్రయోజనం లేదని, కేవలం అగ్రకులాల రాజకీయ ప్రయోజనాల కోసమే మహిళా బిల్లు డీలిమిటేషన్ బిల్లును తీసుకొస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ పట్టణ కన్వీనర్ బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్, బిసి సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి దుర్గయ్య రజక, బీసీ జేఏసీ మిర్యాలగూడ నియోజకవర్గ అధ్యక్షులు గుండెబోయిన నాగేశ్వరావు యాదవ్, బీసీ యువజన సంఘం పట్టణ కార్యదర్శి దోనేటి శేఖర్ ముదిరాజ్ బీసీ మహిళ సంఘం జిల్లా కార్యదర్శి బంటు కవిత, బీసీ మహిళ సంఘం నియోజకవర్గ అధ్యక్షురాలు సందేనాబోయిన జయమ్మ ఎస్సీ మహిళా జిల్లా అధ్యక్షురాలు చిత్ర ఉమా, బీసీ యువజన సంఘం నాయకులు ఎస్ పి నాయుడు, బంటు సైదులు ముదిరాజ్,బీసీ విద్యార్థి సంఘం పట్టణ కార్యదర్శి నక్క నాగరాజ్, రజక సంఘం నాయకులు గుండెపురి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెరిక అంజయ్య, కిషన్,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విశ్వకర్మీయులలో ఐటీ దిగ్గజాలు



- **విశ్వకర్మ కమ్యూనిటీ జేఏసీ సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్ భేటీ**

**హైదరాబాద్, వెలుతురు జూలై 25:**

విశ్వకర్మ కమ్యూనిటీ జేఏసీ ఆధ్వర్యంలో ఐటీ ప్రొఫెషనల్ ఫ్రెండ్లీ మీట్ కార్యక్రమం ఘనంగా జరిగింది. హైదరాబాద్ నగరంలోని వాసవి క్లబ్ లో శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి ఐటీ రంగానికి చెందిన విశ్వకర్మ ప్రముఖులు హాజరయ్యారు. విశ్వకర్మలు ఏకీకృతం కావడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయి అని కొనియాడారు.విశ్వకర్మలు అయిదు వృత్తులలోనే కాకుండా, అన్ని రంగాలలోనూ అద్భుతమైన నైపుణ్యం ప్రదర్శిస్తున్నారని వక్తలు అన్నారు. ప్రపంచంలోని దిగ్గజ ఐటీ కంపెనీలలో విశ్వబ్రాహ్మణులు సత్తా కనబరుస్తున్నారని, డల్లాస్ నుండి వచ్చిన గ్లోబల్ విశ్వకర్మ సంస్థ ప్రతినిధి చైతన్య తెలిపారు. విశ్వకర్మ జాతికి చెందిన వివిధ రంగాల్లో నిష్ణాతులై సమాజానికి ఉపయోగపడే స్థాయిలో ఉన్న వ్యక్తుల్ని గుర్తించి వారి సహాయ సహకారాలు తీసుకుని ముందుకెళ్లాలని ఇతర వక్తలు సూచించారు. విశ్వకర్మ కులానికి చెందినవారందరిని ఒక వేదిక పైకి తీసుకుని వచ్చి జేఏసీ ఏర్పాటు చేయాలని అభిప్రాయపడ్డారు. రానున్న రోజుల్లో ప్రత్యేక వెబ్ సైట్ రూపొందించి జనాభా లెక్కలు తేల్చాలని అందరూ అభిప్రాయపడ్డారు. విశ్వకర్మ ఐదు కులాలకు చెందిన వారిని ప్రభుత్వం గుర్తించి అన్ని కులాలను ఒకే తాటిపైకి తీసుకొచ్చి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు.మున్ముందు అన్ని రంగాల్లో ఉన్న విశ్వకర్మ కమ్యూనిటీకి చెందిన వారందరితో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని కన్వీనర్ దేవరకొండ కాళిదాస్, కోకన్వీనర్ అడ్లూరి రవీంద్ర చారి తెలిపారు. ఈ సమావేశంలో విశ్వకర్మ కమ్యూనిటీ జేఏసీ కన్వీనర్, కో-కన్వీనర్ అడ్లూరి రవీంద్ర చారి, విశ్వవిశ్వాని యూనివర్శిటీ వ్యవస్థాపకులు తాడూరి శ్రీనివాస చారి, హెచ్ఎస్బీసీ డైరెక్టర్ , గ్లోబల్ విశ్వకర్మ ఎన్ఆర్ఐ సంఘం ప్రతినిధి చైతన్య, ప్రవాస భారతీయుడు మారోజు వెంకట్, సాఫ్ట్‌వేర్ రంగం ప్రొఫెషనల్స్ పాల్గొన్నారు.

# యాదవ సోదరులకు అడిగిన వెంటనే 70 టీషర్ట్స్ అందించిన సమ్మి గౌడ్ చిలువేరు

- **బీరప్ప కురుమ యువజన సంఘము యువకులకు సమ్మి గౌడ్ ఫౌండేషన్ చేయూత**

**కేసముద్రం వెలుతురు జూలై 25:**





తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉప్పరపల్లి గ్రామంలోని శ్రీ బీరప్ప స్వామి దేవస్థానంలో బీరప్ప కురుమ సంఘం ఆధ్వర్యంలో బోనాల వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించబడుతున్నాయి.ఈ సందర్భంగా ఉప్పరపల్లి బీరప్ప కురుమ సంఘం అధ్యక్షులు, కమిటీ సభ్యులు సమ్మి గౌడ్ ఫౌండేషన్ అధినేత చిలువేరు సమ్మయ్య గౌడ్ కలిసి సంఘ సభ్యులకు 70 టీ-షర్ట్స్ అందించాలని కోరగా, వెంటనే సానుకూలంగా స్పందించి 70 టీ-షర్ట్స్ అందజేశారు.ఈ సందర్భంగా సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ "గ్రామాల్లో జరిగే ఆధ్యాత్మిక, సాంప్రదాయ కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని, సమాజ సేవే తన లక్ష్యమని" అన్నారు.బీరప్ప కురుమ సంఘం అధ్యక్షులు, సభ్యులు మాట్లాడుతూ తమ విజ్ఞప్తిని ఆలకించి టీ-షర్ట్స్ అందించిన సమ్మయ్య గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధి, ప్రజా సేవ, సామాజిక కార్యక్రమాల్లో ఆయన అందిస్తున్న సహకారం ఆదర్శనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో సమ్మి గౌడ్ ఫౌండేషన్ టీం సభ్యులు మరియు గ్రామ పలుస పద్మ వెంకన్న (8వ వార్డు), తండా సంపత్ (9వ వార్డు), పలుస రాకేష్, ఎసల్ల సత్యనారాయణ, కొమ్మన బోయిన రంజిత్, సీలోజు విజేందర్ అలాగే బీరప్ప కురుమ సంఘం సభ్యులు యారా ముత్తయ్య, కంచ కట్టయ్య, కంకల శ్రీనివాస్, కంకల బీరయ్య, కంకల సుమన్, కంచ కుమారస్వామి, కంకల ఐలయ్య, కుండే రతన్, కుండే మహేందర్, అల్లి అశోక్, కంచ ఐలయ్య, కంకల కుమారస్వామి, కంకల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.ఈ వెర్షన్ పత్రికల్లో ప్రచురించే స్థాయిలో, రాజకీయ నాయకుల ప్రెస్ నోట్ శైలికి దగ్గరగా ఉంటుంది.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుకోవద్దు

- **పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలన్నింటినీ వెంటనే విడుదల చేయాలి**
- **విద్యార్థులు యువత తలుచుకుంటే ఏదైనా సాధ్యమే అని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దీనికి మంచి ఉదాహరణ**
- **జాజుల లింగంగౌడ్, బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్**

**హైదరాబాద్ వెలుతురు జూలై 25:**



ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుకోవద్దని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు.పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలన్నింటినీ ప్రభుత్వం తక్షణమే విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేశారు.యువత తలుచుకుంటే ఏదైనా సాధ్యమేనని గత ఐదు రోజులుగా ఢిల్లీలో జరిగిన పరిణామాలు మరోసారి నిరూపించాయని పేర్కొన్నారు.అందువల్ల విద్యార్థులను,యువతను తక్కువ అంచనా వేయకుండా వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి విజ్ఞప్తి చేశారు.విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఆలస్యం చేయకుండా పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని, విద్యార్థుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామే దీనికి మంచి ఉదాహరణ అన్నారు.

# మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయటం విద్యార్థుల విజయం. బివి రమణ

**బషీర్బాగ్ వెలుతురు జూలై 25:**



కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయటం విద్యార్థుల విజయం ఎందుకంటే నీట్ పరీక్షలలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని దేశాన్ని పక్కదో పట్టిస్తున్న బిజెపి పార్టీ విద్యార్థులను మోసం చేస్తూ నీట్ పరీక్ష లాంటి ఎన్నో లీకేజీ చేస్తూ బడా బాబులకు ఉద్యోగాలు వచ్చే విధంగా సరైన సమయంలో కాక్రోచ్ బొద్దింక జనతా పార్టీ రావటం దేశంలో శుభ పరిణామం ఎందుకంటే ఇష్టం వచ్చినట్లు పరిపాలన చేసి ఈవీఎంలను ఓటర్లు లేకుండా ఇష్టం వచ్చిన రేతిలో పరిపాలన చేస్తూ బతికున్నంత సేపు మాదే రాజ్యం అన్నట్లుగా పరిపాలన కొన సాగిస్తున్నారు ఇలాగే చేస్తే ప్రజాస్వామ్యం ఖూనీ అయిపోతుంది ఇదేవిధంగా శ్రీలంక నేపాల్ లాంటి దేశాలలో విద్యార్థులు ప్రజలు పరిపాలన చేసిన వాళ్లని ఎదురు తిరిగి గద్దె దింపినారు మంచి పరిపాలన చేస్తే ఎవరైనా కూడా క్షమిస్తారు ఇంతకుముందు వ్యవసాయ రైతులు పంజాబ్ నుంచి ఎన్నో డిమాండ్ చేసి కేంద్రము ఇష్టం వచ్చిన రీతిలో డిమాండ్ అంగీకరించకపోతే అప్పుడు అదే విధంగా జరిగినది కాబట్టిఇది విద్యార్థుల విజయమని చెప్పవచ్చు ఇట్లు TUJAC అంబర్పేట్ కాన్స్టెన్సీ ప్రెసిడెంట్ బి వి రమణ , సి ,దేవానంద్ పెంటం , నర్సింహా మంద ,లావణ్య, నికిత విజయలక్ష్మి వెంకట లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం మెడలు వంచిన విద్యార్థులు

- **సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్**

**బషీర్ బాగ్ వెలుతురు 25 జులై:**



నీట్ పేపర్ లికేజికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి దర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనీ విద్యార్థులు చేసిన పోరాటంతో కేంద్రం మెడలు వంచరని ఇది విద్యార్థుల విజయం అని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) అబ్దుల్లాపూర్ మెట్ మండల కార్యదర్శి కామ్రేడ్ అజ్మీరా హరిసింగ్ నాయక్ అన్నారు. నీట్ పేపర్ లీకేజీ కారణంగా అనేకమంది ఆ పరీక్ష రాసిన విద్యార్థులు చనిపోవడం జరిగిందని అనేక మంది విద్యార్థులు నష్టపోయారని లికేజికి కేంద్ర విద్యశాఖ మంత్రి దర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనీ సోనాం వాంగ్ చుంగ్ ఆమరణ నిరాహార దీక్ష మరియు విద్యార్థుల పార్లమెంట్ ర్యాలీ మొత్తం దేశాన్ని కదిలించి.దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు మరియు మంత్రి రాజీనామా చేసే వరకు విద్యార్థులు ఢిల్లీ ని వదలమని చెప్పటంతో ఎట్టకేలకు శనివారం నాడు దర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు.విద్యార్థుల పోరాటం ముందు ఎంతటి నియంతలు అయినా తల వంచల్సిందే అన్నారు.మంత్రి రాజీనామాతో దేశంలో నవశకం మొదలైందని అన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి నూతన విద్య విధానం 2020 ని రద్దు చేసి,విద్యా రంగంలో అనేక సవరణలు చేసి మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు.

# "భద్రత నా బాధ్యత" నినాదంతో 40వ గనుల భద్రతా వారోత్సవాల ముగింపు వేడుకలు

**ఎల్బీనగర్ వెలుతురు జూలై 25:**





గనుల్లో భద్రతకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (డీజీఎంఎస్) ఆధ్వర్యంలో, మైన్స్ సేఫ్టీ అండ్ ప్రొడక్టివిటీ అసోసియేషన్, హైదరాబాద్ రీజియన్ నిర్వహించిన 40వ గనుల భద్రతా వారోత్సవాలు–2025 రాష్ట్ర స్థాయి ముగింపు వేడుకలు శనివారం హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు.

**ముఖ్య అతిథులు:**

ప్రధాన అతిథి: డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ డైరెక్టర్ జనరల్ శ్రీ ఉజ్జ్వల్ తాహా

గౌరవ అతిథులు: డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (దక్షిణ మధ్య మండలం) టి.ఆర్. కన్నన్, అల్ట్రాటెక్ సిమెంట్ లిమిటెడ్ ముఖ్య నిర్వహణ అధికారి (సీఓఓ) అనిల్ బాజాజ్.

1960ల నుంచి నిర్వహిస్తున్న మైన్స్ సేఫ్టీ వీక్ ద్వారా గనుల్లో పనిచేసే కార్మికుల్లో భద్రతపై అవగాహన పెంపొందించడంతో పాటు ప్రమాదాల సంఖ్యను శూన్యానికి చేర్చడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. అలాగే సిలికోసిస్, వినికిడి లోపం వంటి వృత్తిపరమైన వ్యాధులను నివారించేందుకు భద్రతా ప్రమాణాల అమలు అత్యంత కీలకమని పేర్కొన్నారు.

గనుల్లో డస్ట్ క్లీనింగ్, ఇల్యూమినేషన్, హాల్ రోడ్ల నిర్వహణ తదితర విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన గనులు, అధికారులు, కార్మికులకు ఈ సందర్భంగా అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పరిధిలోని సుమారు 68 సున్నపురాయి, మెటల్ గనులు ఈ భద్రతా పోటీలు, అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. గనుల్లో భద్రతా ప్రమాణాల పెంపు, ప్రమాదాల నివారణ, కార్మికుల్లో భద్రతపై అవగాహన పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వారు వివరించారు.ఈ ముగింపు వేడుకల్లో గనుల యాజమాన్య ప్రతినిధులు, డీజీఎంఎస్ అధికారులు, కార్మికులు, వివిధ గనుల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విజయవంతంగా నిర్వహించడంలో అల్ట్రాటెక్ సిమెంట్ బాసంత్‌నగర్ యూనిట్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కీలక పాత్ర పోషించారు.

# OU BRSV ఆధ్వర్యంలో ఘనంగా KTR గారి పుట్టినరోజు వేడుకలు

**హైదరాబాద్ వెలుతురు జూలై 25:**



బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కల్వకుంట్ల తారక రామారావు (KTR) గారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈరోజు ఉస్మానియా యూనివర్సిటీ BRSV బోయపల్లి నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మదిన వేడుకలకు ముఖ్య అతిథిగా ఉస్మానియా ఉద్యమ కెరటం, తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు డా.గాదరి కిశోర్ కుమార్ గారు మరియు విష్ణు ఐఏఎస్ డైరెక్టర్ విష్ణు సారు హాజరై ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో కేక్ కట్ చేసి, విష్ణు ఐఏఎస్ అకాడమీ సహకారంతో విన్నర్స్ పబ్లికేషన్ సహకారంతో విద్యార్థులకు పుస్తకాలు, పంపిణీ చేసి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా LONG LIVE KTR అంటూ నినాదాలు చేస్తూ కేటీఆర్ గారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో BRSV రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, BRSY & BRSV నాయకులు నేవూరి ధర్మేందర్ రెడ్డి, వల్లమల్ల కృష్ణ, తోట్ల స్వామి, పడాల సతీష్, రఘురాం, జంగం అవినాష్, కోతి విజయ్, శిగ వేంకట్,యుగంధర్ రెడ్డి,జిల్లా నాగయ్య,నవీన్ గౌడ్, శశిపాల్, పల్లయ్య, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీక్ పై నిరసన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి: మధుయాష్కి గౌడ్

**ఎల్బీనగర్ వెలుతురు జులై 25:**



నీట్ పరీక్ష పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని టి పి సి సి వర్కింగ్ పి ప్రెసిడెంట్, ఎల్బీనగర్ నియోజకవర్గ ఇన్చార్జి మధుయాష్కి గౌడ్ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆల్ ఇండియా బార్ కౌన్సిల్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు చలకాని వెంకట్ యాదవ్ మాట్లాడుతూ, తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన, నకిలీ ఓట్ల ఏరివేత, ప్రజలకు ఉపయోగపడే అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తుంటే, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మాత్రం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీక్ చేయడం సిగ్గుచేటని, లక్షలాది విద్యార్థుల కలలను కాలరాసిందని విమర్శించారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహించి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఈ ధర్నా కార్యక్రమంలో చెన్నగౌని రవీందర్ గౌడ్, పాశం అశోక్ గౌడ్, సాయికుమార్ గౌడ్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అస్సాంను ముంచెత్తిన వరదలు

- మృతుల సంఖ్య 62కు పెరుగుదల
- 12 జిల్లాల్లో 7 లక్షల మందిపై ప్రభావం
- 856 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కు
- 56 వేల హెక్టార్లకు పైగా పంటలు నీటమునక
- సహాయక శిబిరాల్లో 1.15 లక్షల మంది ఆశ్రయం
- ప్రమాద స్థాయికి మించి నాలుగు నదుల ప్రవాహం
- యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు



**గువాహటి, వెలుతురు జులై 25:**

అస్సాంలో వరదల తీవ్రత మరింత పెరిగింది. తాజాగా మరో 14 మంది ప్రాణాలు కోల్పోవడంతో వరదలకు సంబంధించిన మృతుల సంఖ్య 62కు చేరింది. రాష్ట్రంలోని 12 జిల్లాల్లో 7,05,148 మంది వరదల ప్రభావానికి గురికాగా, 856 గ్రామాలు నీట మునిగిపోయాయి. సహాయక చర్యలు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి.విపత్తు నివేదికల ప్రకారం, తాజా మరణాల్లో చరైదియో జిల్లాలో ఏడుగురు, శివసాగర్‌లో ఆరుగురు, జోర్హాట్‌లో ఒకరు మృతి చెందారు. శివసాగర్ జిల్లా అత్యధికంగా 3,48,555 మంది బాధితులతో అత్యంత తీవ్రంగా ప్రభావితమైంది. ఆ తర్వాత చరైదియోలో 1,88,404 మంది, జోర్హాట్‌లో 1,26,793 మంది వరదలతో ఇబ్బందులు పడుతున్నారు.గోలాఘాట్, చరైదియో, దిబ్రూగఢ్, హోజై, నగావ్, బిశ్వనాథ్, జోర్హాట్, ధేమాజీ, శివసాగర్, సోనిత్‌పూర్, కామ్రూప్ (మెట్రో), కార్బీ ఆంగ్‌లాంగ్ జిల్లాలు ప్రస్తుతం వరదల ప్రభావంలో ఉన్నాయి.రాష్ట్రవ్యాప్తంగా 363 సహాయక శిబిరాలు, సహాయ పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 1,15,205 మంది ఆశ్రయం పొందుతుండగా, మరో రెండు లక్షల మందికి పైగా బాధితులకు సహాయ సామగ్రి అందిస్తున్నారు. డిఖౌ, దిసాంగ్, ధన్‌సిరి (దక్షిణ), కుషియారా నదులు ప్రమాద స్థాయికి మించి ప్రవహిస్తున్నాయి.వ్యవసాయ రంగం కూడా తీవ్రంగా దెబ్బతింది. మొత్తం 56,606 హెక్టార్లకు పైగా పంట భూములు వరద నీటిలో మునిగిపోయాయి. గత 24 గంటల్లో 17,107 పశువులు, కోళ్లు వరదలో కొట్టుకుపోగా, మొత్తం 3.34 లక్షల పశువులు, పక్షులు వరదల ప్రభావానికి గురయ్యాయి.జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్), రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎస్‌డీఆర్ఎఫ్), సైన్యం, వైమానిక దళం, స్థానిక యంత్రాంగం సహాయక చర్యలను ముమ్మరం చేశాయి. శుక్రవారం ఒక్కరోజే దాదాపు వెయ్యి మందిని వరద ముంపు ప్రాంతాల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించారు.ఇదిలా ఉండగా, వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించిన అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉందన్నారు. నాగాలాండ్‌లోని మోన్, మోకోక్‌చుంగ్, వోఖా జిల్లాలతో పాటు అస్సాంలో కురిసిన భారీ వర్షాల కారణంగానే చరైదియో, శివసాగర్ జిల్లాల్లో విస్తృతంగా వరదలు సంభవించాయని, పరిస్థితి ఇంకా తీవ్రంగానే ఉందని ఆయన తెలిపారు.

# బ్రిటన్ కేబినెట్‌లో భారత సంతతి నేతలకు చోటు

- ఆండీ బర్న్‌హామ్ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ
- ముగ్గురు భారత సంతతి లేబర్ ఎంపీలకు కీలక బాధ్యతలు
- ఏఐ మంత్రిగా కనిష్క నారాయణ్‌కు పదవి
- సత్వీర్ కౌర్, హర్ప్రీత్ ఉప్పల్‌కు కీలక పోస్టులు
- లేబర్ ప్రభుత్వంలో భారత సంతతి నేతల ప్రాతినిధ్యం పెంపు




**లండన్, వెలుతురు జులై 25:**

బ్రిటన్ ప్రధాని ఆండీ బర్న్‌హామ్ చేపట్టిన మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో భారత సంతతికి చెందిన ముగ్గురు లేబర్ పార్టీ ఎంపీలు కీలక పదవులు దక్కించుకున్నారు. కనిష్క నారాయణ్‌కు కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు అప్పగించగా, సత్వీర్ కౌర్, హర్ప్రీత్ ఉప్పల్‌లకు కూడా ప్రభుత్వంలో కీలక బాధ్యతలు కల్పించారు. దీంతో లేబర్ ప్రభుత్వంలో భారత సంతతి ప్రజాప్రతినిధుల ప్రాతినిధ్యం మరింత పెరిగింది.బిహార్‌లోని ముజఫర్‌పూర్‌లో జన్మించిన కనిష్క నారాయణ్ 12 ఏళ్ల వయసులో కుటుంబంతో కలిసి వేల్స్‌కు వెళ్లారు. ఈటన్ కాలేజ్, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం, స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయాల్లో విద్యనభ్యసించిన ఆయన 2024లో వేలాఫ్ గ్లామోర్గన్ నియోజకవర్గం నుంచి లేబర్ ఎంపీగా ఎన్నికయ్యారు. ఇప్పటికే సైన్స్, ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ శాఖలో పార్లమెంటరీ అండర్ సెక్రటరీగా పనిచేసిన ఆయనను తాజాగా కొత్తగా ఏర్పాటైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ శాఖ సహాయ మంత్రిగా నియమించారు.సౌతాంప్టన్ టెస్ట్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సత్వీర్ కౌర్‌కు సమానత్వం (ఈక్వాలిటీస్) వ్యవహారాల సహాయ మంత్రిగా, అలాగే హోం ఆఫీస్‌లో పార్లమెంటరీ అండర్ సెక్రటరీగా బాధ్యతలు అప్పగించారు. మహిళలు, బాలికలపై హింస నివారణ, రక్షణ, సమానత్వ అంశాలు ఆమె పరిధిలోకి రానున్నాయి. ఆమె తల్లిదండ్రులు పంజాబ్‌కు చెందినవారు.హడర్స్‌ఫీల్డ్ ఎంపీ హర్ప్రీత్ ఉప్పల్‌ను అసిస్టెంట్ విప్‌గా నియమించారు. పార్లమెంట్‌లో పార్టీ కార్యక్రమాల సమన్వయం, కీలక బిల్లుల సమయంలో ఎంపీల హాజరు, పార్టీ విప్ అమలును పర్యవేక్షించే బాధ్యతలను ఆమె నిర్వహించనున్నారు.ఇదిలా ఉండగా, శ్రీలంక తమిళ మూలాలు కలిగిన హిందూ ఎంపీ ఉమా కుమారన్‌ను విదేశాంగ శాఖ జూనియర్ మంత్రిగా నియమించారు. దీంతో లేబర్ ప్రభుత్వ ఫ్రంట్ బెంచ్‌లో ఇద్దరు హిందూ, ఇద్దరు సిక్కు మంత్రులు చోటు దక్కించుకున్నారు.మరోవైపు, ఇండో-పసిఫిక్ వ్యవహారాల మాజీ మంత్రి సీమా మల్హోత్రా, మాజీ జూనియర్ ఆరోగ్య మంత్రి ప్రీత్ కౌర్ గిల్ ఈ పునర్వ్యవస్థీకరణలో మంత్రివర్గం నుంచి తప్పుకుని సాధారణ ఎంపీలుగా కొనసాగనున్నారు. అలాగే సంస్కృతి శాఖ మంత్రి లీసా నాండీ తన పదవిని కొనసాగించారు. ఆమె తండ్రి కోల్‌కతాకు చెందినవారు.

# అమెరికా సెనేట్‌లో సంచలన బిల్లు

- మూడేళ్ల పాటు హెచ్-1బీ వీసాల జారీ నిలిపివేతకు ప్రతిపాదన!
- అమెరికా సెనేట్‌లో కొత్త బిల్లు ప్రవేశపెట్టిన రిపబ్లికన్ సెనేటర్
- హెచ్-1బీ వ్యవస్థలో భారీ మార్పులకు శ్రీకారం
- మూడేళ్ల పాటు కొత్త వీసాల జారీపై తాత్కాలిక నిషేధం
- అమెరికన్ కార్మికుల ప్రయోజనాల రక్షణే ధ్యేయం
- లక్ష డాలర్ల ఫీజును శాశ్వతం చేసేలా ప్రతిపాదన
- న్యాయపరమైన వివాదాల నడుమ కఠిన నిర్ణయం




**వాషింగ్టన్, వెలుతురు జులై 25:**

అమెరికాలోని విదేశీ నిపుణులకు, ముఖ్యంగా భారతీయ ఐటీ రంగానికి ఊహించని షాక్ తగిలింది. హెచ్-1బీ వీసాల జారీ విధానంలో భారీ మార్పులు తీసుకువస్తూ అమెరికా సెనేట్‌లో ఒక కీలకమైన నూతన బిల్లు ప్రవేశపెట్టబడింది. మొంటానా రాష్ట్రానికి చెందిన రిపబ్లికన్ సెనేటర్ టిమ్ షీహీ ఈ బిల్లును సభ ముందుకు తీసుకువచ్చారు. దీనికి 'ఎండ్ హెచ్-1బీ అబ్యూజ్ యాక్ట్' అని పేరు పెట్టారు. ప్రస్తుతం అమలులో ఉన్న వీసా విధానం తన అసలు లక్ష్యాల నుంచి పక్కదారి పట్టిందని, అందుకే ఈ వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.ఈ కొత్త బిల్లులోని అత్యంత ప్రధానమైన ప్రతిపాదన ఏంటంటే, నూతన హెచ్-1బీ వీసాల జారీని వరుసగా మూడేళ్ల పాటు పూర్తిగా నిలిపివేయడం. అమెరికా కంపెనీలు తక్కువ వేతనాలకే విదేశీ నిపుణులను నియమించుకుంటూ, స్థానిక అమెరికన్ కార్మికుల ఉద్యోగ అవకాశాలను దెబ్బతీస్తున్నాయనే విమర్శలు పెరిగిన నేపథ్యంలో ఈ నిర్ణయాన్ని ప్రతిపాదించారు. మూడేళ్ల విరామం తర్వాత, అత్యంత కఠినమైన నిబంధనలు, కచ్చితమైన పరిమితులతో మాత్రమే ఈ వీసా కార్యక్రమాన్ని తిరిగి పునరుద్ధరించాలని బిల్లులో పేర్కొన్నారు.గతంలో డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం హెచ్-1బీ దరఖాస్తులపై ప్రతిపాదించిన ఒక లక్ష డాలర్ల భారీ ఫీజును చట్టబద్ధం చేసి, శాశ్వతంగా అమలు చేయాలని ఈ బిల్లు సూచిస్తోంది. అయితే ఈ ఫీజు విధానంపై ఇప్పటికే న్యాయస్థానాల్లో వివాదం నడుస్తోంది. కాంగ్రెస్ అనుమతి లేకుండా ఇటువంటి పన్ను తరహా ఫీజులను విధించే అధికారం ప్రభుత్వానికి లేదని బోస్టన్‌లోని అప్పీల్స్ కోర్టు ఇటీవలే తీర్పు ఇచ్చింది. ట్రంప్ యంత్రాంగం వేసిన స్టే పిటిషన్‌ను కూడా కోర్టు తిరస్కరించినప్పటికీ, ఈ బిల్లు ద్వారా ఆ ఫీజుకు చట్టభద్రత కల్పించాలని రిపబ్లికన్ సెనేటర్ యత్నిస్తున్నారు.ప్రస్తుతం హెచ్-1బీ వీసాల ఎంపిక కోసం నిర్వహిస్తున్న ర్యాండమ్ లాటరీ పద్ధతిని పూర్తిగా రద్దు చేయాలని బిల్లు ప్రతిపాదించింది. దీనికి బదులుగా, ఉద్యోగులకు కంపెనీలు ఇచ్చే వేతనాల ఆధారంగా వీసాలను కేటాయించే నూతన విధానాన్ని తీసుకురావాలని సూచించారు. అత్యధిక జీతాలు చెల్లించే ఉన్నత స్థాయి ఉద్యోగాలకే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని, దీనివల్ల తక్కువ వేతనాలతో విదేశీయులను అమెరికాకు తీసుకురావడం సాధ్యపడదని భావిస్తున్నారు.ఐటీ రంగంలో విస్తృతంగా ఉన్న థర్డ్ పార్టీ స్టాఫింగ్ ఏజెన్సీలు లేదా కన్సల్టెన్సీల ద్వారా హెచ్-1బీ ఉద్యోగులను నియమించుకునే ప్రక్రియను పూర్తిగా నిషేధించాలని బిల్లులో పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి నేరుగా సదరు కంపెనీ రోల్స్‌పైనే పనిచేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా, హెచ్-1బీ వీసాదారులకు ఉన్న ఒకేసారి రెండు ఉద్యోగాలు (మల్టిపుల్ ఎంప్లాయ్‌మెంట్) చేసే వెసులుబాటును కూడా రద్దు చేయాలని ప్రతిపాదించారు.హెచ్-1బీ వీసాదారులకు ఎంతో లబ్ధి చేకూర్చే 'డ్యూయల్ ఇంటెంట్' విధానాన్ని రద్దు చేయాలని ఈ బిల్లు సూచిస్తోంది. అంటే, హెచ్-1బీ వీసాతో అమెరికాలో ఉంటూనే శాశ్వత నివాస హోదా (గ్రీన్ కార్డ్) కోసం దరఖాస్తు చేసుకునే అవకాశాలను పరిమితం చేయాలని చూస్తున్నారు. ఇది అమలులోకి వస్తే, వీసా ఉన్నప్పటికీ అమెరికాలో శాశ్వతంగా స్థిరపడాలనుకునే భారతీయ నిపుణుల ఆశలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. అలాగే కుటుంబ సభ్యులను అమెరికాకు తీసుకువచ్చే నిబంధనలపై కూడా కఠినత్వాలు రానున్నాయి.అమెరికాలో చదువు పూర్తిచేసుకున్న విదేశీ విద్యార్థులకు తాత్కాలికంగా ఉద్యోగాలు చేసుకునేందుకు తోడ్పడే 'ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్' వంటి కార్యక్రమాలను కూడా రద్దు చేయాలని ఈ బిల్లు ప్రతిపాదించింది. దీంతో పాటు, అమెరికా ప్రభుత్వ సంస్థలు ఎలాంటి విదేశీ నాన్-ఇమిగ్రెంట్ వీసాదారులను ఉద్యోగాల్లోకి తీసుకోకుండా నిషేధించాలని పేర్కొంది. ఈ కఠినమైన ప్రతిపాదనలకు ఇమ్మిగ్రేషన్ అకౌంటబిలిటీ ప్రాజెక్ట్, ఫెడరేషన్ ఫర్ అమెరికన్ ఇమ్మిగ్రేషన్ రిఫార్మ్ వంటి సంస్థలు మద్దతు తెలిపాయి.ఈ నూతన బిల్లు ప్రతిపాదనలు వెలువడటంతో అమెరికాలోని ఐటీ వర్గాలు, ముఖ్యంగా భారతీయ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రతి ఏటా హెచ్-1బీ వీసాల్లో సింహభాగం దక్కించుకుంటున్న భారతీయులపై ఈ నిబంధనలు నేరుగా దెబ్బకొట్టనున్నాయి. అమెరికాలో ఉద్యోగావకాశాలు సంపాదించడం, అక్కడే సుదీర్ఘకాలం కొనసాగడం రాబోయే రోజుల్లో మరింత క్లిష్టంగా మారనుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# విద్యావ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిందే!

- పేపర్ లీకేజీలతో విద్యార్థుల భవిష్యత్ అంధకారం
- ఢిల్లీ ఆందోళనకు టీజేఎస్ అధినేత కోదండరామ్ సంఘీభావం
- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్

**న్యూఢిల్లీ వెలుతురు జూలై 25:**

దేశంలో వరుస పేపర్ లీకేజీలు, పరీక్షల నిర్వహణలో జరుగుతున్న అక్రమాలతో విద్యార్థి లోకం తీవ్ర అయోమయంలో పడిపోయిందని, విద్యావ్యవస్థను వెంటనే ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందోని తెలంగాణ జనసమితి (టీజేఎస్) అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ డిమాండ్ చేశారు. ఢిల్లీ వేదికగా దేశ రాజధానిలో విద్యార్థి సంఘాలు చేపట్టిన 'మహాధర్నా'కు ఆయన ప్రత్యక్షంగా హాజరై తన పూర్తి సంఘీభావాన్ని ప్రకటించారు. అనంతరం సీజేపీ (CJP) నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు.

### వ్యవస్థాగత వైఫల్యమే మూలం

సీబీఎస్ఈ, నీట్‌తో పాటు దాదాపు 150 రకాల జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలు తీవ్ర గందరగోళంగా మారాయని కోదండరామ్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాల అలసత్వం, అధికారుల నిర్లక్ష్యం వల్లే లక్షలాది మంది విద్యార్థుల కష్టం బూడిదలో పోసిన పన్నీరవుతోందన్నారు. న్యాయమైన హక్కుల కోసం శాంతియుతంగా, చట్టబద్ధంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీఛార్జ్ చేయడం దారుణమని, దీనికి బాధ్యులైన అధికారులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

### బాధ్యత వహించి రాజీనామా చేయాలి

పరీక్షల నిర్వహణలో వరుసగా విఫలమవుతున్నందున కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని కోదండరామ్ కోరారు. భవిష్యత్తును కాపాడుకునేందుకు పోరాడుతున్న విద్యార్థుల ధర్నాకు దేశంలోని ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, రాజకీయ పక్షాలు అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఉస్మానియా యూనివర్సిటీ సైఫాబాద్ సైన్స్ కాలేజీ ప్రాంగణంలో జలమండలి ఆధ్వర్యంలో వర్షపు నీటి సంరక్షణ పై అవగాహన కార్యక్రమం..







**హైదరాబాద్ వెలుతురు జూలై 25:**

ప్రతి నీటి చుక్క సంరక్షించుకోవాలి – పర్యావరణాన్ని కాపాడాలి నినాదంతో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పాయింట్ తో పాటు మొక్కలు నాటిన మంత్రి పొన్నం ప్రభాకర్

వర్షపు నీటిని సంరక్షించి జలవనరులు కాపాడుకోవాలని ప్రతిజ్ఞా చేయించిన మంత్రి పొన్నం ప్రభాకర్

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్వీ కర్ణన్,జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, వాటర్ వర్క్ ఎండీ అశోక్ రెడ్డి ,ఇతర అధికారులు..మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సైఫాబాద్ సైన్స్ కాలేజీ విద్యాబోధన మాత్రమే కాదు వాటర్ హార్వెస్టింగ్ పాయింట్ కి ముందుకు వచ్చి ఒక మార్పుకు శ్రీకారం చుట్టారు వారికి అభినందనలు..

ఈరోజు ప్రతి వ్యవస్థ నీటితో లింక్ అయి ఉంటుంది...

వర్షం నీటిని డ్రైనేజీ ద్వారా కాలువలోకి వృధా పోనివ్వకుండా భూగర్భ జలాల్లోకి పంపించాలి..

ముఖ్యంగా హైదరాబాద్ రాతి కట్టడాలు ,సిమెంట్ రోడ్ల లో నీటి ఇంకే పరిస్థితి లేదు.. నగరంలో ప్రతి ప్రాంతాల్లో , ఇళ్లలో ఇంకుడు గుంతలు నిర్మాణాలు చేసుకోవాలి

గ్రామంలోనే కాదు, నిజాం కాలం నుండి హైదరాబాద్ లో నీటిని సంరక్షించుకోవడానికి చాలా చెరువులు తవ్వించారు..

2016 నుండి హైదరాబాద్ లో భవనాలు పర్మిషన్ తీసుకున్న వారికి వాటర్ హార్వెస్టింగ్ పాయింట్ చేసుకునే వారికి అనుమతి తప్పనిసరి చేశాం..

గత కొద్ది రోజులుగా నగరంలో 4 వేల నుండి 12 వేలకు వాటర్ ట్యాంకర్ల సంఖ్య వినియోగం పెరిగింది

దీనిని బట్టి వచ్చే కొద్ది నెలల్లో నీటి యద్దడి తీవ్రంగా ఉండబోతుంది.. ప్రతి ఒక్కరు నీటిని పొదుపుగా వాడుకోవాలి..

నీటిని భూమిలోకి పంపించే సామాజిక బాధ్యత ప్రతి ఒక్కరిదీ..

హైదరాబాద్ లో ఇప్పటి వరకు 3-4 వేల బోర్లు ఎండిపోయాయి..

ఎండిపోయిన బోర్ల కు వాటర్ హార్వెస్టింగ్ ఇంజక్షన్ పాయింట్ ఏర్పాటు చేస్తే తిరిగి అభివృద్ధి చెందుతుంది..

ప్రభుత్వం హార్వెస్టింగ్ పాయింట్ ఏర్పాటు చేయడమే కాదు ప్రజల బాధ్యత కావాలి

జిల్లాలో రైతులు వ్యవసాయానికి నీళ్లు వదిలి హైదరాబాద్ నగర ప్రజలకు కృష్ణా ,గోదావరి ,నాగార్జున సాగర్, సింగూరు, మంజీరా, ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ల ద్వారా నీళ్లు తెచ్చిన సరిపోయే లేదు..

2024 అక్టోబర్ 2 న హార్వెస్టింగ్ పాయింట్ ప్రారంభించుకున్నాం..

దేశంలోనే రెండవ స్థానంలో ఉన్నాం ఈసారి మొదటిసారి..

త్వరలోనే ప్రతి మంత్రుల క్వార్టర్స్ కార్యాలయంలో ,శాసన సభ లో , ప్రభుత్వ కార్యాలయాల్లో వాటర్ హార్వెస్టింగ్ ఫీట్స్ ఏర్పాటు తప్పనిసరి చేస్తున్నాం..

మనం బాధ్యతగా మన ఇళ్లలో మాత్రమే కాకుండా మన స్నేహితులు బంధువుల ఇళ్లలో కూడా వాటర్ హార్వెస్టింగ్ పాయింట్ ఏర్పాటు చేసేలా చేయాలి..

వాటర్ హార్వెస్టింగ్ యుద్ధం లాగ, బాధ్యత లాగ ప్రతి చుక్కను ఒడిసిపట్టుకోవాలి

దీని వల్ల రేపటి భవిష్యత్తు తరానికి మంచి తాగునీరు అందిస్తున్న..

సైఫాబాద్ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ గారికి అభినందనలు.

హైదరాబాద్ లో కాలుష్యాన్ని తగ్గించడానికి ఈవి పాలసీ తీసుకొచ్చాం.. వెహికిల్ కొనుగోలు చేస్తే ఒక మొక్కను ఇవ్వడం తప్పనిసరి చేశాం.

# కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై మాజీ మండల అధ్యక్షుడి బహిరంగ లేఖ

**మునుగోడు వెలుతురు జూలై 25:**

రాష్ట్రంలో నిజమైన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు న్యాయం జరగాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మునుగోడు మండల మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు సురిగి నర్సింహా గౌడ్ స్పందించారు. ఈ మేరకు ఆయన ఎమ్మెల్యేకు బహిరంగ లేఖ రాశారు.మునుగోడు నియోజకవర్గంలో దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు, పదవులు దక్కడం లేదని ఆయన ఆరోపించారు. ఎమ్మెల్యే బీజేపీలో ఉన్న సమయంలో ఆయన వెంట వెళ్లిన వారికే ప్రాధాన్యం ఇస్తున్నారనే భావన పార్టీ శ్రేణుల్లో ఉందని పేర్కొన్నారు. ఉప ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌ను వీడకుండా పార్టీని కాపాడిన కార్యకర్తల్లో ఎంతమందికి పదవులు దక్కాయో చెప్పాలని ప్రశ్నించారు.2018లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పార్టీని వీడి బీజేపీలో చేరడం వల్ల కాంగ్రెస్‌కు నష్టం జరిగిందని నర్సింహా గౌడ్ పేర్కొన్నారు. అనంతరం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే పరిస్థితులు కనిపించడంతో తిరిగి పార్టీలో చేరి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని గుర్తు చేశారు.పార్టీలోని సమస్యలను మీడియా సమావేశాల్లో కాకుండా రాష్ట్ర నాయకత్వంతో నాలుగు గోడల మధ్య చర్చించి పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు పదవులు ఇవ్వాలన్న ఆలోచనను ముందుగా మునుగోడు నియోజకవర్గంలో అమలు చేస్తే కోమటిరెడ్డి రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తారని పేర్కొన్నారు.





# దాబా స్టైల్ చికెన్ కరీ ఇంట్లోనూ ఈజీగా..

దాబా స్టైల్ చికెన్ కరీ ఇంట్లోనూ ఎంతో ఈజీగా తయారుచేసుకోవచ్చు. స్పైసీగా ఎక్కువ గ్రేవీ వచ్చేలా ఈ రెసిపీ తయారు చేసుకోవచ్చు. ఈ కరీ ఎలా తయారు చేసుకోవాలో చూద్దాం.



| కావాల్సిన పదార్థాలు |
|---|
| చికెన్ ముక్కలు అర కిలో |
| జీడిపప్పు అయిదు |
| పాలు రెండు స్పూన్లు |
| కరివేపాకులు గుప్పెడు |
| దాల్చిన చెక్క చిన్న ముక్క |
| లవంగాలు నాలుగు |
| నూనె సరిపడినంత |
| టమాట ఒకటి |
| ఉల్లిపాయలు రెండు |
| అల్లం వెల్లుల్లి పేస్టు రెండు స్పూన్లు |
| ధనియాల పొడి ఒక స్పూను |
| మిరియాల పొడి అర స్పూను |
| జీలకర్ర పొడి ఒక స్పూను |
| పెరుగు రెండు స్పూన్లు |
| కారం ఒక స్పూను |
| ఉప్పు రుచికి సరిపడా |
| పసుపు అర స్పూను |
| కొత్తిమీర తరుగు రెండు స్పూన్లు |

### తయారీ విధానం..

ఒక గిన్నె తీసుకొని చికెన్ శుభ్రంగా కడిగి అందులో వేయాలి. చికెన్ లోనే పెరుగు, కారం, పసుపు, ఉప్పు వేసి బాగా కలిపి మ్యారినేట్ చేయాలి. కనీసం రెండు గంటల పాటు మ్యారినేట్ చేయండి. ఇప్పుడు మిక్సీలో నానబెట్టిన జీడిపప్పు, పాలు వేసి పేస్టులా చేసి పక్కన పెట్టుకోండి. స్టవ్ మీద కళాయి పెట్టి నూనె వేయండి. నూనె వేడెక్కాక అందులో సన్నగా తరిగిన ఉల్లిపాయలను రంగు మారేవరకు వేయించండి. అందులోనే అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి మరికొద్ది సేపే వేయించండి. ఈ మిశ్రమంలో ధనియాల పొడి, కారం, జీలకర్ర పొడి వేసి బాగా కలపండి. తర్వాత సన్నగా తరిగిన టమోటాలను వేసి కలిపి పైన మూత పెట్టండి. టమాటాలు మెత్తగా ఇగురులాగా అయ్యేవరకు చిన్న మంట మీద ఉడికించండి. ఇప్పుడు స్టవ్ కట్టేయండి. వేయించిన పదార్థాలన్నీ మిక్సీలో వేసి మెత్తగా పేస్టులా చేసుకుని పక్కన పెట్టుకోండి. ఇప్పుడు స్టవ్ మీద మళ్ళీ కళాయి పెట్టి నూనె వేయండి. అందులో కరివేపాకులు వేసి వేయించండి. ముందుగా మ్యారినేట్ చేసిన చికెన్ ముక్కలను కూడా వేసి వేయించి ఐదు నిమిషాల పాటు ఉడికించండి. ఆ మిశ్రమంలో ముందుగా పేస్ట్ చేసి పెట్టుకున్న జీడిపప్పును అలాగే ఉల్లిపాయ టమాటా వేసి పేస్ట్ చేసి పెట్టుకున్న మిశ్రమాన్ని కూడా వేసి బాగా కలపండి. ఐదు నిమిషాల పాటు ఉడికించండి. పైన మూత పెట్టి అరగంట పాటు వదిలేయండి. ఇది చిన్న మంట మీద ఉంచితే బాగా ఉడుకుతుంది. తర్వాత మూత తీస్తే టేస్టీ చికెన్ గ్రేవీ రెడీ అయినట్టే. పైన కొత్తిమీర తరుగును చల్లుకొని స్టవ్ కట్టేయండి.



# వక్కకారం.. ఎంతో మమకారం.!

## తెలంగాణలో మామిడికాయ .. ఆంధ్రాలో ఆవకాయ

**కోరుట్ల:** మామిడికాయ 'వక్కకారం' అంటే ఇష్టపడని వారు ఉండరంటే అతిశయోక్తి లేదు. ఏటా వేసవికాలంలో మామిడికాయ వక్క, సప్పడి తొక్కు, తీపివక్క పెట్టుకోని తెలుగు మహిళలుండరు. తెలంగాణ ప్రాంతంలో 'మామిడికాయ వక్కకారం' అని పిలుచుకుంటే.. ఆంధ్రాలో 'ఆవకాయ పచ్చడి'గా పిలుస్తారు. వేడివేడి అన్నంలో ఇంత వక్కకారం పెట్టుకుంటే మైమరచి.. ఆహా ఏమి రుచి అనకుండా ఉండలేరు. పండగైనా, పబ్బమైనా, ఫంక్షనైనా, దైవకార్యమైనా.. సందర్భం ఏదైనా ఏడాదంతా భోజనంలోకి కొంచెం ఆవకాయ పచ్చడి ఉండాల్సిందే. ఈ ఆవకాయ కంచంలో ఆగ్నేయ మూలవేసుకొని నవగ్రహ స్తోత్రం చెప్పుకొని తింటే సమస్త గ్రహదోషాలు సమసిపోతాయనే నానుడి సైతం ఉంది.







### ఆవకాయుంటే చాలు..

ఇప్పటిలా సౌకర్యాలు అన్నీ పూర్వం లేవు. కూలి పనులకెళ్లే వారికి ఏడాదంతా ఈ ఆవకాయ ఉంటే చాలు. ఉదయాన్నే లేచి కాస్త అన్నం వండుకొని, అందులోకి ఊరగాయ పచ్చడి వేసుకుని వెళ్లిపోయేవారు. సాయంత్రం దాకా పని చేసి వచ్చి అలసిపోయినా ఆవకాయ ఉందిలే ఈ రాత్రి భోజనానికి ఢోకా లేదు అనేంతగా ఈ మామిడికాయ వక్కకారం భరోసా ఇచ్చేది. నేటికీ దీనికి ఇంత డిమాండ్ ఉందంటే ఆవకాయ రుచేంటో ఇట్టే అర్థం అవుతోంది.

### విదేశాలకు సైతం..

కేవలం తెలుగు రాష్ట్రాల ప్రజలకే కాదు విదేశీయులకీ మామిడికాయ పచ్చడంటే ఎంతో ఇష్టం. ఏటా వేలల్లో ఆర్డర్లు పెట్టుకుని మరీ తెప్పించుకుంటారు. దీని ద్వారా ఎంతో మంది ఉపాధి పొందుతుండగా మన తెలుగింటి రుచులు ప్రపంచమంతటా విస్తరిస్తున్నాయి. ఎంత కాలం నిల్వ ఉంటే అంత రుచిగా ఉంటుంది. మొత్తానికి ఏడాదంతా ఆవకాయతో కాలం గడిపేయొచ్చు. ఉగాది వచ్చినప్పటి నుంచే మామిడి పిందెలతో లేతవక్క పెట్టడం మొదలవుతుంది. ఈ పచ్చళ్లలో రుచులే కాదు. రకాలూ ఎక్కువే. ఆయా ప్రాంతాలను బట్టి సప్పడితొక్కు, బెల్లంతొక్కు, స్వీటు, హాటు, గుజ్జుతో/పైన తొక్కతో ఇలా చాలా రకాలే ఉన్నాయి.

# పూల మొక్కల పెంపకంలో ఈ మెలకువలు పాటించండి

**పూల మొక్కలు పెంచుకోవడం ఇప్పుడు చాలా మందికి హాబీగా మారింది. పెరట్లో, ఖాళీ జాగాలో పూల మొక్కలను పెంచుకుంటున్నారు. అయితే కొన్ని రకాల మెలకువలు పాటించి పూల మొక్కల సాగులో లాభాలు గడించవచ్చు. ఈ నేపథ్యంలో పూల మొక్కల పెంపకంలో మెళకువలను తెలుసుకుందాం.**





### ఎంపిక ప్రాధాన్యం

గార్డెన్‌ను ఆకర్షణీయంగా మార్చాలంటే పూల మొక్కల ఎంపిక చాలా ముఖ్యం. మన అభిరుచికి అనుగుణంగా ఉండే పూల మొక్కలను ఎంచుకోవాలి. పూల మొక్కల్లో కొన్ని ప్రత్యేక సీజన్లలోనే పుష్పించి కనుల విందు చేసేవి ఉంటాయి. మరికొన్ని ఏడాదంతా పూస్తుంటాయి. పూల మొక్కలను పెంచే ముందుకు అవి పుష్పించే సీజన్లను దృష్టిలో పెట్టుకోవాలి. ఇలా చేయడం వల్ల ఏడాది పొడవునా పువ్వులు దొరుకుతుంటాయి. ఎండాకాలంలో పుష్పించే మల్లె, సన్నజాజి, చామంతి, రోజా, సంపెంగ వంటి పూల మొక్కలు ఏడాది పొడవునా పూలనిస్తాయి.

### అనుకూల వాతావరణం

మనం ఉండే ప్రాంతం, వాతావరణం పూల మొక్కల పెంపకానికి అనువుగా ఉండేలా చూసుకోవాలి. వాతావరణం పడకపోతే అవి త్వరగా చనిపోయే అవకాశం ఉంటుంది. నేల స్వభావాన్ని లెక్కలోకి తీసుకోవాలి. సారవంతమైన నేలలో కలుపు లేకుండా చూసుకోవాలి. మొక్కలు నాటే స్థలంలో కంపోస్టు ఎరువులు వాడాలి. క్రమ పద్ధతి ప్రకారం పూల మొక్కలకు నీరు అందించే విధానాన్ని సిద్ధం చేసుకోవాలి. నీరు అధిక మొత్తంలో నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలి. పూల మొక్కల చెంత చెత్త చెదారం, ఎండి రాలిన ఆకులు, పూలను ఎప్పటికప్పుడు తొలగిస్తూ ఉండాలి.

### గులాబీల కోసం..

గులాబీ మొక్కలను నాటిన తర్వాత వాటి పెరుగుదలపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. కాలాలను బట్టి గులాబీ చెట్లు పెరుగుతుంటాయి. వేసవిలో ఎక్కువ ఎండ ఉండకుండా చూడాలి. ఎండలు మండుతుంటే నీరు ఎక్కువగా ఇవ్వాలి. కుండీల్లో పెంచితే వెలుతురు తగిలే ఏర్పాట్లు చేయాలి. వానాకాలంలో నీరు నిల్వ లేకుండా చూడాలి. చలికాలంలో రెండురోజులకు ఒకసారి నీరు ఇవ్వాలి. గులాబీల సీజన్ నవంబర్ నుంచి జనవరి వరకు ఉంటున్నందున ఆగస్టులో నాటితే సీజన్‌కు పూలను అందిస్తాయి. చీడపీడలు ఆశిస్తే మార్కెట్లో దొరికే పురుగుల మందు స్ప్రే చేయాలి.



### చామంతి పూలు..

చామంతి పూల మొక్కలను నేలపై కుండీల్లోనూ పెంచుకోవచ్చు. చామంతి మొక్కలు నాటేందుకు పొడిబారిన లేదా ఎక్కువ తేమ, నీరు ఉన్న ప్రదేశాన్ని ఎంచుకోకూడదు. ఒక్కో మొక్క మధ్య దూరం ఆరు అంగుళాలు ఉండేలా చూసుకోవాలి. పెద్ద కుండీల్లో మూడు మొక్కలు నాటుకోవచ్చు. ఎండ, గాలి ధారలంగా తగిలేలా చూసుకోవాలి. విరివిగా పూలు పూయాలంటే తగినన్ని పోషకాలు అందివ్వాలి. మొక్కలు పెరుగుతున్న దశలో ద్రవరూప ఎన్‌పీకేను స్ప్రే చేయాలి.

### ఎల్లో బెల్స్ పూలు..

ఎల్లో బెల్స్ పూల మొక్కలు అన్ని రకాల నేలల్లో పెరుగుతాయి. వీటికి నిత్యం నాలుగైదు గంటలు సూర్యరశ్మి నేరుగా తగిలే ప్రాంతంలో నాటుకోవాలి. రోజు విడిచి రోజు నీరివ్వాలి. కాండం ముదరకుండానే కొమ్మల్ని కత్తిరిస్తూ ఉండాలి. వీటి ఎదుగుదలకు ఎన్‌పీకే వాడాలి. మొక్కల కాండాన్ని, కొమ్మలను కత్తిరించి కూడా నాటుకోవచ్చు. చీడపీడల నివారణకు బహుళ ప్రయోజన సేంద్రీయ కీటకనాశినిని ఉపయోగించాలి.

### లిల్లి పూలు..

ఈ రకం పూలు శీతాకాలం చివర్లో పుష్పించే దశకు చేరుకుంటాయి. అంటుకట్టడం ద్వారా కొత్త మొక్కల్ని పుట్టించవచ్చు. ఎక్కువ నీరు అవసరం అవుతుంది. ఎండ ఎక్కువగా ఉండే స్థలంలో వీటిని నాటుకోవడం వల్ల ఎక్కువ పూలను పొందవచ్చు. లిల్లిపూల దుంపలు లేదా కాండాలను 12 ఇంచుల లోతు గోతులు తీసి పాతాలి. సాధారణ ఎరువులనే వాడాలి. కొద్దిగా పెరిగాయంటే కొంచెం ఎక్కువ నీరు అందిస్తే చాలు చాలా పూలను అందిస్తాయి.





# త్యాగం కాదు.. విద్యార్థుల రక్షణే ముఖ్యం

- పరీక్షల సంస్కరణలపై పార్లమెంట్‌లో చర్చకూ అంగీకారం
- నీట్ పేపర్ లీక్ నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం పరిశీలన

**న్యూఢిల్లీ, వెలుతురు, జూలై 25,**



కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకుండానే తన 26 రోజుల నిరవధిక నిరాహార దీక్షను విరమించడంపై వస్తున్న విమర్శలకు పర్యావరణ కార్యకర్త సోనం వాంగ్చుక్ స్పందించారు. మంత్రి రాజీనామా కంటే, ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులు, నిరసనకారులపై ఎలాంటి పోలీసు కేసులు నమోదు కాకుండా చూడటమే తన తొలి ప్రాధాన్యమని స్పష్టం చేశారు. అందుకే చర్చల్లో రాజీనామా అంశాన్ని గట్టిగా పట్టుబట్టలేదని వెల్లడించారు.

శుక్రవారం రాత్రి ఆస్పత్రి నుంచి విడుదల చేసిన 24 నిమిషాల వీడియోలో వాంగ్చుక్ ఈ వ్యాఖ్యలు చేశారు. విద్యా వ్యవస్థలో సంస్కరణలు, పోటీ పరీక్షల్లో అక్రమాలపై చర్యలు, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వంటి డిమాండ్లతో కాక్‌రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన ఉద్యమానికి మద్దతుగా జూన్ 28 నుంచి ఆయన నిరాహార దీక్ష చేస్తున్నారు.

చర్చల అనంతరం కేంద్ర ప్రభుత్వం శాంతియుత నిరసనకారులపై ఎలాంటి కేసులు నమోదు చేయబోమని లిఖితపూర్వక హామీ ఇచ్చిందని, పరీక్షల సంస్కరణలు, పేపర్ లీక్‌లపై పార్లమెంట్‌లో విస్తృత చర్చ నిర్వహిస్తామని అంగీకరించిందని తెలిపారు. అలాగే నీట్ పేపర్ లీక్ నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం అంశాన్ని కూడా సానుకూలంగా పరిశీలిస్తామని చెప్పిన తర్వాతే తాను దీక్ష విరమించినట్లు వివరించారు.

మంత్రి రాజీనామా తన డిమాండ్లలో ఒకటేనని, అయితే అది తన వ్యక్తిగత విజయంగా సాధించాల్సిన అంశం కాదన్నారు. "రాజీనామా ఇవ్వకపోవడం వల్ల కేంద్ర ప్రభుత్వానికే ప్రజల్లో తీవ్ర నష్టం జరుగుతోంది. చివరికి వారు ఆ నిర్ణయం తీసుకోవాల్సిందేనన్న నమ్మకం నాకు ఉంది. అందుకే నా దృష్టి విద్యార్థుల భద్రతపైనే నిలిచింది" అని వాంగ్చుక్ పేర్కొన్నారు.

తాను కేంద్రంతో ఎలాంటి 'డీల్' చేసుకోలేదన్న ఆరోపణలను కూడా ఆయన ఖండించారు. "ఒకవేళ ఒప్పందం చేసుకోవాలనుకుంటే ఢిల్లీలో 26 రోజులు ఎండలో ఆకలితో ఎందుకు ఉండేవాడిని? ఎయిర్ కండిషన్ గదిలో కూర్చొని అదే పని చేసుకునేవాడిని" అని వ్యాఖ్యానించారు.

గతంలో లడఖ్‌లో జరిగిన ఘటనలను గుర్తు చేసుకుంటూ, ఢిల్లీలోనూ నిరసనకారులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందన్న ఆందోళనతోనే తక్షణమే దీక్ష విరమించి శాంతికి పిలుపునిచ్చానని చెప్పారు. అయితే తనతో పాటు ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులు, ఎంపీలు, లడఖ్ ప్రతినిధులు లేకుండానే దీక్ష విరమించాల్సి రావడం తనకు అత్యంత బాధ కలిగించిన విషయమని వాంగ్చుక్ ఆవేదన వ్యక్తం చేశారు.

# రియల్ ఎస్టేట్‌లో రికార్డు స్థాయి వృద్ధి

- హైదరాబాద్ అభివృద్ధికే ప్రపంచ పారిశ్రామికవేత్తల మొగ్గు
- దావోస్ పర్యటన అనుభవాలను పంచుకున్న మంత్రి

**హైదరాబాద్, వెలుతురు, జూలై 25,**



తెలంగాణ రాష్ట్రంలో, ముఖ్యంగా రాజధాని హైదరాబాద్ నగరంలో రియల్ ఎస్టేట్ రంగం తీవ్రంగా దెబ్బతిన్నదంటూ కొంతమంది కావాలని గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. శనివారం నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేశారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రిగా తన వద్ద స్పష్టమైన ఆధారాలు, రిజిస్ట్రేషన్ గణాంకాలు ఉన్నాయని, ఇలాంటి దుష్ప్రచారాలను ప్రజలు, బిల్డర్లు నమ్మాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు.గడిచిన రెండున్నరేళ్ల ప్రజా ప్రభుత్వ పాలనలో హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగం 15 నుంచి 20 శాతం వృద్ధి సాధించిందని మంత్రి తెలిపారు. ముఖ్యంగా ఓపెన్ ప్లాట్ల విక్రయాలు ఏకంగా 40 శాతం వరకు పెరిగాయని వివరించారు. గత పదేళ్ల కాలంతో పోలిస్తే ఈ రెండున్నరేళ్లలోనే రెసిడెన్షియల్ మార్కెట్ అద్భుతమైన ప్రగతిని నమోదు చేసిందని చెప్పారు. తమ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో రికార్డు స్థాయిలో పెరిగిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్యనే దీనికి ప్రత్యక్ష నిదర్శనమని పొంగులేటి పేర్కొన్నారు. ప్రభుత్వంపై బురద చల్లేందుకు చేసే ప్రయత్నాలను ఆయన ఖండించారు.2004 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రుల దూరదృష్టి వల్లే హైదరాబాద్ రోల్ మోడల్‌గా మారిందని మంత్రి గుర్తుచేశారు. ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటీ సెక్టార్ వంటివి 360 డిగ్రీల కోణంలో అభివృద్ధి చెందడానికి నాటి దూరదృష్టితో కూడిన నిర్ణయాలే కారణమన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి స్విట్జర్లాండ్‌లోని దావోస్ పర్యటనకు వెళ్లినప్పుడు, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు సైతం హైదరాబాద్ నగరంలో పెట్టుబడులు పెట్టేందుకు ఎంతో ఆసక్తి చూపించారని వెల్లడించారు. ప్రపంచస్థాయి పెట్టుబడులకు హైదరాబాద్ గమ్యస్థానంగా మారిందన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో హైదరాబాద్ నగరాన్ని మరింత ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. సుమారు రూ. 7,000 కోట్ల భారీ అంచనాతో చేపట్టనున్న మూసీ నది పునరుజ్జీవం, సుందరీకరణ ప్రాజెక్టు త్వరలోనే పట్టాలెక్కబోతోందని చెప్పారు. మొదటి విడత కింద 28 కిలోమీటర్ల మేర చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి రాబోయే వారం పది రోజుల్లోనే అధికారికంగా టెండర్లు పిలవబోతున్నామని మంత్రి సభకు వెల్లడించారు.నగరంలో రవాణా వ్యవస్థను మెరుగుపరిచేందుకు రెండో విడత మెట్రో రైలు విస్తరణ పనులను రూ. 24,000 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించనున్నట్లు మంత్రి ప్రకటించారు. పాతబస్తీతో పాటు నగరంలోని ఇతర కీలక ప్రాంతాలను కలుపుతూ మొత్తం 76 కిలోమీటర్ల మేర ఈ విస్తరణ కొనసాగుతుందన్నారు. దీంతో పాటు రీజనల్ రింగ్ రోడ్డు నుంచి ఔటర్ రింగ్ రోడ్డును అనుసంధానించేలా నూతన రేడియల్ రోడ్ల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు కూడా చివరి దశలో ఉన్నాయని తెలిపారు.రాష్ట్రంలోని ప్రజల భూములకు పూర్తి భద్రత, భరోసా కల్పించే లక్ష్యంతో తమ ప్రభుత్వం 'భూభారతి' చట్టాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందని పొంగులేటి తెలిపారు. ఈ చట్టానికి సంబంధించిన సాఫ్ట్‌వేర్‌లో ఉన్న కొన్ని చిన్నచిన్న సాంకేతిక సమస్యలను మరో 15 నుంచి 20 రోజుల్లో పూర్తిగా సరిచేసి ప్రజలకు సులభతరమైన సేవలను అందిస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరి ఆస్తికి కచ్చితమైన హక్కులు కల్పించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు.కేవలం వ్యాపార రంగానికే కాకుండా, పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో తొలి విడత కింద లక్ష ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు అందించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. దీని తర్వాత దఫదఫాలుగా మరిన్ని ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. పేదల గృహ నిర్మాణాల కోసం దాదాపు 2 నుంచి 3 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని సేకరించే ప్రక్రియలో ఉన్నామని మంత్రి వివరించారు.హైదరాబాద్ నగరాన్ని ప్రపంచంలోనే అత్యంత సుందర నగరంగా తీర్చిదిద్దడంలో రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధులు భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రజలకు నమ్మకంగా, నిర్దేశిత సమయంలోనే ప్లాట్లు, ఇళ్లను అందించి వారి విశ్వాసాన్ని గెలుచుకోవాలని సూచించారు. బిల్డర్లు, డెవలపర్ల అభ్యర్థన మేరకు రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించిన అనుమతులు వేగంగా వచ్చేలా 'ఫాస్ట్ ట్రాక్' విధానాన్ని కల్పించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రఘురామ్‌రెడ్డి సహా పలువురు ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# చేనేత కార్మికుల అభ్యున్నతికి సహకార సంఘాలు మరింత బలోపేతం కావాలి : మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



- చర్లపల్లి చేనేత సహకార సంఘం లిమిటెడ్ నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- చేనేత కార్మికుల సంక్షేమానికి మా కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుంది
- చేనేత రంగ అభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర ఎంతో కీలకం

**నల్లగొండ వెలుతురు జూలై 25:**

నల్లగొండలోని చర్లపల్లి చేనేత సహకార సంఘం లిమిటెడ్ నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ... నూతనంగా బాధ్యతలు చేపట్టిన పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. చేనేత కళ తెలంగాణ సాంస్కృతిక వైభవానికి, మన అస్తిత్వానికి ప్రాణవాయువు లాంటిది. కార్మికులు తమ రక్తాన్ని చెమటగా మార్చి నేసే అద్భుతమైన వస్త్రాలు మన రాష్ట్రానికి దేశస్థాయిలోనే కాకుండా అంతర్జాతీయంగా కూడా ఒక ప్రత్యేకమైన గుర్తింపును తీసుకువచ్చిందన్నారు.

చేనేత కార్మికుల సంక్షేమం, వారి జీవనోపాధి బలోపేతానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు సక్రమంగా వారికి అందేలా సహకార సంఘాలు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. చేనేత రంగ అభివృద్ధిలో సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్న మంత్రి, చేనేత ఉత్పత్తులకు మరింత ప్రోత్సాహం కల్పించడం, కార్మికులకు ఉపాధి అవకాశాలను విస్తరించడం, యువతను చేనేత రంగం వైపు ఆకర్షించే కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. నూతన పాలకవర్గం చేనేత కార్మికుల సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకొని పనిచేయాలని ఆకాంక్షించారు.నూతన పాలకవర్గం సమష్టి కృషితో చర్లపల్లి చేనేత సహకార సంఘం మరింత అభివృద్ధి సాధించి చేనేత కార్మికులకు ఆదర్శంగా నిలవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం నూతన పాలకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు, చేనేత కార్మికులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పిఆర్ఎంఆర్ గార్డెన్‌లో బీఎల్ఏల అవగాహన సదస్సు

**టేకుమట్ల, వెలుతురు జూలై 25:**



మండల కేంద్రంలో పిఆర్ఎంఆర్ గార్డెన్‌లో జిల్లా ప్రధానకార్యదర్శి తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బీఎల్ఏల అవగాహన సదస్సుకు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై మాట్లాడుతూ.. బీఎల్ఏలు తమ బాధ్యతలను అత్యంత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి కుటుంబాన్ని స్వయంగా సందర్శించి, ఓటరు నమోదు ప్రక్రియను 100 శాతం పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బట్టు కర్ణాకర్, టిపిసిసి కోఆర్డినేటర్ సిరాజ్ అహ్మద్, మాజీ జెడ్పిటిసి పులి తిరుపతి రెడ్డి, రవీందర్, దొంతుల శ్రీనివాస్, లింగపల్లి కిరణ్ రావు, మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, సర్పంచ్‌లు, బీఎల్ఓలు, బీఎల్ఏలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణ కాంగ్రెస్‌లో తుంగతుర్తి చిచ్చు

- పీసీసీ చీఫ్‌కు జగ్గారెడ్డి నివేదిక
- అధిష్ఠానం చర్యలపై ఉత్కంఠ
- మళ్లీ మొదటికి వచ్చిన పంచాయితీ
- నాయకుల మధ్య భగ్గుమన్న విభేదాలు
- కోమటిరెడ్డి సోదరుల వర్సెస్ ఎమ్మెల్యే సామేల్
- తీవ్ర వ్యాఖ్యలతో రాజుకున్న రాజకీయ దుమారం

**హైదరాబాద్, వెలుతురు జులై 25**



తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గ వివాదం తీవ్ర కలకలం రేపుతోంది. గత కొన్ని రోజులుగా నివురుగప్పిన నిప్పులా ఉన్న వర్గపోరు ఇప్పుడు బహిర్గతమై, పార్టీ శ్రేణుల్లో పెద్ద అలజడికి దారితీసింది. పాత, కొత్త నాయకుల మధ్య ఆధిపత్య పోరు పెరగడంతో తుంగతుర్తి కాంగ్రెస్ వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చింది. స్థానిక నాయకుల మధ్య విభేదాలు కాస్తా పార్టీలోని అగ్రనేతల మధ్య మాటల యుద్ధానికి కారణమయ్యాయి.కోమటిరెడ్డి సోదరులను లక్ష్యంగా చేసుకుని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. "ఎస్సీ నియోజకవర్గమైన తుంగతుర్తిపై మీ ఆధిపత్యం ఏంటి? కాంగ్రెస్ పార్టీ ఏమైనా మీ సొంత జాగీరా?" అని సామేల్ ఘాటుగా ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలపై ఎమ్మెల్యేకు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అంతే తీవ్ర స్థాయిలో కౌంటర్ ఇచ్చారు. సామేల్‌కు పార్టీ టికెట్ ఇప్పించి, అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించింది తానేనని ఆయన గుర్తుచేశారు. ఈ ఇద్దరు నేతల మధ్య నడిచిన సవాళ్లు, ప్రతిసవాళ్లతో తుంగతుర్తి రాజకీయం మరింత వేడెక్కింది.ఇటీవల తుంగతుర్తి నియోజకవర్గంలో నిర్వహించిన కాంగ్రెస్ మండల అధ్యక్షుల నియామకం పార్టీలో తీవ్ర చిచ్చు రేపింది. స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ వర్గం ఒకవైపు, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డితో పాటు పాత కాంగ్రెస్ నేతల వర్గం మరొకవైపు చేరి తీవ్రస్థాయిలో ఘర్షణకు దిగాయి. ఇరువర్గాల మధ్య విభేదాలు ముదిరి పరస్పరం కర్రలు, రాళ్లతో కొట్టుకునే వరకు పరిస్థితి దారితీసింది. దీంతో అధికార పార్టీ ప్రతిష్ట దెబ్బతింటోందని భావించిన అధిష్ఠానం వెంటనే రంగంలోకి దిగింది.వివాదం తీవ్రరూపం దాల్చడంతో గొడవలను సర్దుబాటు చేసే బాధ్యతను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డికి అధిష్ఠానం అప్పగించింది. పార్టీ ఆదేశాల మేరకు పరిశీలకుడిగా రంగంలోకి దిగిన జగ్గారెడ్డి, దాదాపు పది రోజుల పాటు నియోజకవర్గ పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. గొడవలకు కారణమైన ఇరువర్గాల నాయకులతో, స్థానిక కార్యకర్తలతో వేర్వేరుగా సమావేశమై వారి అభిప్రాయాలను, ఫిర్యాదులను సుదీర్ఘంగా విని సమాచారాన్ని సేకరించారు.ఇరు వర్గాల వాదనలు విన్న అనంతరం జగ్గారెడ్డి తుంగతుర్తి ఘటనలపై 7 పేజీలతో ఒక సమగ్ర నివేదికను సిద్ధం చేశారు. హైదరాబాదులోని గాంధీభవన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు (టీపీసీసీ చీఫ్) మహేశ్ కుమార్ గౌడ్‌తో భేటీ అయి ఈ నివేదికను అందజేయనున్నారు. నియోజకవర్గంలో అసలు ఏం జరిగింది, ఘర్షణలకు దారితీసిన పరిస్థితులు ఏంటి, బాధ్యులెవరనే అంశాలను ఆ నివేదికలో స్పష్టంగా పొందుపరిచినట్లు తెలుస్తోంది.ఈ నివేదిక సమర్పణకు ముందు ఓ వార్తా ఛానెల్‌తో మాట్లాడిన జగ్గారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయంలో ఇవన్నీ తాను చూసిన అంశాలేనని, ఏ నాయకుడి బలం ఎంత, ఎవరి కెపాసిటీ ఏంటో తనకు బాగా తెలుసని వ్యాఖ్యానించారు. గొప్పలు చెప్పుకునే నాయకులను చాలా మందిని చూశానని, అలాంటివేవీ తన నివేదిక రూపకల్పనను ప్రభావితం చేయలేవని స్పష్టం చేశారు. ఎవరికో ఒకరికి సానుకూలంగా లేదా మరొకరికి వ్యతిరేకంగా నివేదిక ఇవ్వలేదని, పూర్తి నిష్పాక్షికంగా తయారు చేశానని చెప్పారు.పార్టీ నియమావళి ప్రకారం నియోజకవర్గంలో ప్రాధాన్యతలు ఎలా ఉంటాయో జగ్గారెడ్డి మరోసారి స్పష్టం చేశారు. "మొదటి ప్రాధాన్యత ఎప్పుడైనా స్థానిక ఎమ్మెల్యేకే ఉంటుంది. రెండో ప్రాధాన్యత ఎంపీకి, మూడో ప్రాధాన్యత పార్టీ కార్యకర్తల తరఫున డీసీసీ అధ్యక్షుడికి ఉంటుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. పార్టీ నియమావళికి, అందరి అభిప్రాయాలకు అనుగుణంగానే ఈ నివేదికను రూపొందించానని, దీనిపై అధిష్ఠానమే తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.జగ్గారెడ్డి సమర్పించనున్న 7 పేజీల నివేదికలో ఏముందనే అంశంపై తెలంగాణ కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి రోడ్డున పడ్డ నాయకులపై పీసీసీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందోనని నాయకులు ఎదురుచూస్తున్నారు. క్రమశిక్షణా చర్యలు తీసుకుంటారా లేక ఇరువర్గాలను పిలిచి సర్దిచెబుతారా అనేది త్వరలోనే తేలనుంది. అధిష్ఠానం నిర్ణయంతోనైనా తుంగతుర్తి పంచాయితీకి పూర్తిస్థాయిలో తెరపడుతుందో లేదో వేచి చూడాల్సి ఉంది.

# చదువుకొనుడు ఏమో గాని తల్లిదండ్రుల ప్రేమకు దూరమైతున్న పిల్లలు...

- **చదువు పేరుతో బాల్యాన్ని తాకట్టు పెడుతున్నామా?**
- **ఆదివారం కోసం 6 రోజులు లెక్కపెట్టుకుంటున్న పసి మొగ్గలు...**

**యాదాద్రి భువనగిరి జిల్లా జూలై 25 (వెలుతురు న్యూస్)**

రాత్రి 9 గంటలు. హాస్టల్ గదిలో లైట్లు ఆరిపోయాయి. అందరూ నిద్ర పోతున్నారు. కానీ మూలన ఉన్న బెడ్ మీద 8 ఏళ్ల విద్యార్థి కళ్ల నుంచి నీళ్లు ఆగడం లేదు. దిండులో ముఖం పెట్టుకుని "అమ్మా... నాకు జ్వరం వచ్చింది... ఒక్కసారి నువ్వు నా నుదుటికి చెయ్యి పెట్టు" అని గుసగుస లాడుతున్నా మాటలు. పక్కన ఓదార్చడానికి ఎవరూ లేరు.ఇది సినిమా సీన్ కాదు అన్నా. ఇది మన తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా హాస్టల్ లలో జరుగుతున్న పసి మొగ్గల బాల్యం...రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ హాస్టళ్లలో ప్రతిరోజు జరుగుతున్న నిజం. హాస్టల్ అంటే చదువుకోవ డానికి ఒక చోటు. కానీ ఇప్పుడు అదే పిల్లలకు "బంధీ జైలు" లా మారింది.ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకు రూల్, రూల్, రూల్. అమ్మతో గొడవ, నాన్నతో సరదా, తాత కథలు, అమ్మమ్మ ముద్ద... ఇవేవీ లేకుండా పెరుగుతున్నారు. తల్లిదండ్రుల ప్రేమ అంటే ఏంటో తెలియకుండానే 10వ తరగతికి వచ్చేస్తున్నారు. "ప్రేమ" అనే పదానికి అర్థం పుస్తకంలోనే చదువుతున్నారు కానీ, ఇంట్లో అనుభ వించడం లేదు.

### "చదువు కోసం బాల్యాన్ని అమ్మేస్తున్నామా?"

పేదరికం, మంచి చదువు కావాలనే ఆశతో తల్లిదండ్రులు 3వ, 4వ తరగతి పిల్లలనే హాస్టళ్లలో చేర్పిస్తున్నారు. "మా బిడ్డ ఐఏఎస్ అవ్వాలి, డాక్టర్ అవ్వాలి" అనే కలతో ఇంటి నుంచి పంపిస్తున్నారు. కానీ ఆ కల మధ్య పిల్లలు కోల్పోతున్నది ఎంతో ఉంది. ఇంట్లో అమ్మ చేతి ముద్ద, నాన్న చెప్పే కథలు, అన్నతో ఆటలు... ఇవన్నీ ఇప్పుడు జ్ఞాపకాలు మాత్రమే. ఇక్కడ ఉదయం 5 గంటలకు లేవడం, తన బట్టలు తానే ఉతుక్కోవడం, లైన్ లో నిలబడి అన్నం తినడం, రాత్రి ఒంటరిగా భయపడుతూ పడుకోవడం. చేతికి మట్టి అంటకుండా పెరగాల్సిన పిల్లలు, ఇక్కడ తమ పని తామే చేసుకుంటూ "పెద్దవాళ్లు" అయిపో తున్నారు.

### "ఆదివారం అంటే పండగ"

హాస్టల్ విద్యార్థులకు వారంలో 7 రోజులు ఉంటాయి. కానీ వాళ్లకు కనిపించేది ఒక్కటే రోజు ఆదివారం... శనివారం రాత్రి నుంచే "రేపు అమ్మ వస్తుందా?" "నాన్న వస్తాడా?" అని ఒకరితో ఒకరు మాట్లాడు కుంటారు. తల్లిదండ్రులు వచ్చిన రోజు హాస్టల్ గేటు దగ్గర పిల్లల సందడి చూడాల్సిందే. గంటసేపు కలిసి, మళ్లీ "వచ్చే వారం వస్తా నాన్న" అని చెప్పి వెళ్లిపోతుంటే ఆ పసి కళ్లలోని బాధ చూస్తే గుండె తరుక్కు పోతుంది. కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులు రాలేని పరిస్థితి లో ఆ హాస్టల్ గెట్ పట్టుకొని ఎదురు చూస్తూ కంటతడి పెడుతుంటే ఎవరైనా కన్నీళ్లు పెట్టాల్సిందే...

పుట్టినరోజు వచ్చినా ఇంట్లో లేదు. కేక్ కోసి స్నేహితులు "హ్యాపీ బర్త్ డే" అంటారు. కానీ అమ్మ కౌగిలి, నాన్న ఇచ్చే గిఫ్ట్ ఉండదు కదా.



### అన్నిటికంటే బాధాకరం ఏంటంటే...

ఆదివారం తల్లిదండ్రులు వచ్చినా 1 గంటలో "సార్ సెలవు అయిపోయింది" అంటూ మళ్లీ హాస్టల్ లోపలికి పంపేస్తున్నారు. ఆ ఒక్క గంటలో బంధం ఎలా పెరుగుతుంది? పుట్టినరోజు, పండగలు అన్నీ హాస్టల్లోనే. కేక్ కట్ చేస్తారు కానీ అమ్మ కౌగిలి ఉండదు. కొత్త బట్టలు ఇస్తారు కానీ నాన్న ఆశీర్వాదం ఉండదు అంటూ ఆదివారం నాడు వచ్చిన అమ్మ లతో వారి బాధను పంచుకుంటున్నారు.ఇక్కడ అన్నం బాగుంటుంది. కానీ నువ్వు పెట్టిన ముద్దలా ఉండదు.రాత్రి నాకు భయం వేస్తుంది. నువ్వు దగ్గరికి వచ్చి కథ చెప్పితే బాగుంటుంది అంటూ చెప్పి, మళ్ళీ ఆదివారం త్వరగా రా అమ్మ... అంటూ కన్నీళ్ల తో పలుకుతున్న మాటలు వింటుంటే గుండె తరుక్కు పోతుంది.

### "ఇక్కడ మాకు ఎవరూ లేరు సార్"

"సార్ రాత్రి కలలో అమ్మ కనిపించింది. ఉదయం లేచేసరికి లేదు" అంటూ విద్యార్థులు కన్నీరు పెట్టుకోవడం, "జ్వరం వచ్చినా ఇక్కడ మమ్మల్ని ఎవరూ దగ్గరికి తీసుకోరు. ఇంట్లో అయితే అమ్మ తలకు తడి గుడ్డ పెట్టేది" అని విద్యార్థులు బాధతో చెప్తున్న సందర్భాలు చాలా ఉన్నాయి. హాస్టల్ అంటే కేవలం భోజనం, వసతి కాదు. అది పిల్లల రెండో ఇల్లు కావాలి. కానీ చాలా చోట్ల సిబ్బంది కొరత, నిర్లక్ష్యం వల్ల పిల్లలు మానసికంగా ఒంటరిగా ఫీల్ అవుతున్నారు.

### తల్లిదండ్రుల ఆవేదన: "తప్పనిసరి పరిస్థితి"

"మాకు ఇష్టమై పంపడం లేదు సార్. పొలం పనులు, ఆర్థిక ఇబ్బందులు. ఇంట్లో ఉంచితే సరిగ్గా చదివించలేం. అందుకే కడుపు కోతతో పంపిస్తున్నాం" అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు కన్నీళ్లు పెట్టుకుంటూ చెప్తుంటే ప్రతీ ఒక్కరూ చలించి పోవాల్సిందే..

"చదువుకొనుడు ఏమో గానీ... మా బిడ్డ ప్రేమకు దూరం కాకూడదు" అని చెప్పే వారి మాటలు ఎవరి గుండెనైనా కదిలిస్తాయి.

### నిపుణులు ఏం చెబుతున్నారు?

బాల మనస్తత్వ నిపుణులు హెచ్చరిస్తున్నారు. "10 నుండి 15 ఏళ్ల లోపు పిల్లలకు తల్లిదండ్రుల సాన్నిహిత్యం చాలా అవసరం. ఈ వయసులో దూరం చేస్తే వాళ్లలో భయం, డిప్రెషన్, చదువుపై ఆసక్తి తగ్గడం లాంటి సమస్యలు వస్తాయి. చదువు ముఖ్యమే కానీ, బాల్యాన్ని చంపి కాదు" అని అంటున్నారు.

### వాళ్లకు కావాల్సింది చదువు కాదు... ప్రేమ

హాస్టల్ లో ఉన్న పిల్లలకు కావాల్సింది ఫ్యాన్సీ ఫుడ్ కాదు, కొత్త బట్టలు కాదు. వాళ్ల చిన్న గుండెలకు కావాల్సింది 4 విషయాలే...

### ప్రేమ: "అమ్మ ఫోన్ చేసింది" అనే ఒక్క మాట చాలు

వారానికి కనీసం 2 సార్లు తల్లిదండ్రులు ఫోన్ చేసి మాట్లాడాలి. "అన్నం తిన్నావా నాన్న? హోం వర్క్ చేస్తున్నావా?" అనే ఒక్క ప్రశ్న చాలు. హాస్టల్ మొత్తంలో "నా అమ్మ ఫోన్ చేసింది" అని గర్వంగా చెప్పుకుంటారు. ఆ 5 నిమిషాల మాటలు వాళ్లకు ఒక వారం ధైర్యం ఇస్తాయి.

### భరోసా:

"నువ్వు ఒంటరిగా లేవురా" రాత్రి జ్వరం వచ్చినా, స్కూల్లో టీచర్ తిట్టినా, స్నేహితులతో గొడవైనా... "ఏమైంది నాన్న?" అని అడిగే ఒక గొంతు కావాలి. "భయపడకు, మేమున్నాం" అనే ఒక్క మాట చాలు. లేకపోతే ఆ పసి మనసులో "నన్ను ఎవరూ ప్రేమించడం లేదు" అనే భావన వచ్చేస్తుంది.

### సమయం:

నెలకు ఒకసారైనా కౌగిలి ఇవ్వాలి. డబ్బులు, గిఫ్టులు వద్దు. నెలకు ఒకసారైనా హాస్టల్ కి వచ్చి, పిల్లాడి కళ్లలోకి చూసి, తల నిమిరి, వాడు చెప్పేది అంతా ఓపికగా వినాలి. ఆదివారం గేటు దగ్గర "నాన్న వచ్చాడు" అని పరిగెత్తే ఆ ఆనందం కోసమే వాళ్లు 30 రోజులు ఎదురు చూస్తారు.

### హాస్టల్ బాధ్యత:

వార్డెన్ కాదు... రెండో అమ్మ, నాన్న హాస్టల్ వార్డెన్లు, కేర్ టేకర్లు ఉపా ధ్యాయులుగా కాకుండా తల్లిదండ్రులుగా బాధ్యత తీసుకోవాలి. పిల్లాడికి జ్వరం వస్తే డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లడం, రాత్రి దుప్పటి కప్పడం, పుట్టిన రోజున కేక్ కట్ చేయించడం. హాస్టల్ అంటే జైలు కాదు, అది కూడా ఒక ఇల్లు అనే ఫీలింగ్ రావాలి.

### చివరి మాట

చదువు కోసం హాస్టల్ తప్పు కాదు. కానీ చిన్నప్పటి నుంచే ఇంటికి దూరం చేయడం వల్ల మనం ఒక తరం పిల్లల బాల్యాన్ని దోచేస్తు న్నామేమో? "అమ్మ చేతితో అన్నం తినాల్సిన వయసులో, హాస్టల్ గదిలో ఒంటరిగా కూర్చుని ఏడవాల్సిన పరిస్థితి రాకూడదు."చదువుతో పాటు ప్రేమను కూడా ఇద్దాం. అప్పుడే ఆ పసి మొగ్గలు నిజంగా వికసిస్తాయి.చదువు కోసం ఇంటికి దూరం చేశాం. కానీ ప్రేమకు దూరం చేయొద్దు. ఎందుకంటే మార్కులు మర్చిపోతారు... కానీ మమతలు మర్చిపోరు.చదువు కోసం హాస్టల్ పంపడం తప్పు కాదు. కానీ,బం ధాలను చంపి చదువు ఇవ్వొద్దు. ఎందుకంటే 10వ తరగతిలో 10/10 మార్కులు తెచ్చినా, జీవితంలో "మానవత్వం" లో ఫెయిల్ అయితే ఏం లాభం?

### ఫలితం:

పెద్దయ్యాక ఈ పిల్లలకు బంధాల విలువ తెలియదు. "నాది నా చదువు, నా కెరీర్" అనే స్వార్థం పెరుగుతుంది.

అందుకే ఈరోజు చాలా మంది వృద్ధులు ఒంటరిగా ఉండాల్సి వస్తుంది.

రంగ కవిత గౌడ్... యాదాద్రి భువనగిరి జిల్లా వెలుతురు స్టాఫర్...



**రంగ కవిత గౌడ్...**
**యాదాద్రి భువనగిరి జిల్లా వెలుతురు స్టాఫర్...**

# విద్యార్థులకు క్షమాపణ చెప్పండి



- **సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్న రాహుల్**

**న్యూఢిల్లీ, వెలుతురు జులై 25:**

దేశవ్యాప్తంగా విద్యార్థులు చేపడుతున్న ఆందోళనలపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్రంగా స్పందించారు. విద్యార్థులు కోరుతున్న ప్రధానమైన మూడు డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల నిరస నలకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపిన ఆయన, వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం అలక్ష్యం చేయడం సరికాదని పేర్కొన్నారు.కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. విద్యాశాఖ నిర్వహణలో విఫలమైన అసమర్థ మంత్రి రాజీనామా చేసేంత వరకు విద్యార్థుల ఉద్యమం ఆగేది లేదని స్పష్టం చేశారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహ రిస్తున్న పాలకులకు గుణపాఠం చెప్పేందుకే యువత రోడ్లపైకి వచ్చి పోరా డుతోందని వ్యాఖ్యానించారు.శనివారం రోజున ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో ఆందోళన నిర్వహిస్తున్న విద్యార్థుల ప్రతినిధులతో రాహుల్ గాంధీ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి డిమాండ్లు మరియు నిరసనల వివరాలను నేరుగా అడిగి తెలుసు కున్నారు. ఈ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ తీరుపై ఘాటు వ్యాఖ్యలు చేశారు.న్యాయం కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పోలీసులు దారుణంగా దాడులకు పాల్పడుతున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. తమ హక్కుల కోసం పోరాడుతున్న యువతపై బలప్రయోగం చేయడం దారుణమన్నారు. విద్యార్థులకు రక్షణగా నిలవాల్సిన ప్రభుత్వమే వారిపై దాడులు చేయించడం అణచివేత ధోరణికి నిదర్శనమని మండిపడ్డారు.దేశంలో లక్షలాది మంది విద్యార్థులు వీధుల్లోకి వచ్చి ఆందోళన చేస్తుంటే, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వీడియోల ద్వారా నాటకాలు ఆడుతు న్నారని రాహుల్ గాంధీ విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవడాన్ని ఆపి, వారిని ఇబ్బందులకు గురిచేసినందుకు ప్రధాని మోదీ దేశ యువతకు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.వ్యవస్థలోని లోపాలను, అక్రమాలను ధైర్యంగా ప్రశ్నిస్తున్న విద్యార్థులను చూసి తాను ఎంతో గర్వపడుతున్నానని రాహుల్ గాంధీ అన్నారు. పోరాట బాట పట్టిన ఈ యువతరం భయపడే తరం కాదని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తని కొనియాడారు. ఎంతటి ప్రతికూల పరిస్థితులు ఎదురైనా హక్కుల కోసం నిలబడటం అభినందనీయమని చెప్పారు.ప్రస్తుత విద్యా వ్యవస్థలో పేరుకుపోయిన లోపాలను సరిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అధికారంలో ఉన్న ప్రభుత్వమంతా ఏకమై వచ్చినా, పోరాడుతున్న విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని కదిలించలేరని స్పష్టం చేశారు. విద్యార్థుల ఐక్యత ముందు ఏ ప్రభుత్వ అణచివేత చర్యలూ నిలబ డవని రాహుల్ గాంధీ ధీమా వ్యక్తం చేశారు.విద్యార్థుల పోరాటానికి కాంగ్రెస్ పార్టీ మరియు ప్రతిపక్షాలు పూర్తిస్థాయిలో అండగా ఉంటాయని రాహుల్ గాంధీ పునరుద్ఘాటించారు. వారికి పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు ఈ ఉద్యమాన్ని పార్లమెంటు లోపల, వెలుపల కొనసాగిస్తామని చెప్పారు. ప్రభుత్వం దిగివచ్చి విద్యార్థుల డిమాండ్లను తీర్చే వరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు.

# రాజీనామా తప్ప ఇంకో చర్చే లేదు

- **రెండు డిమాండ్లకు కేంద్రం సూత్రప్రాయ అంగీకారం**
- **రాజీనామాపై మాత్రం వెనక్కి తగ్గని ప్రభుత్వం**
- **శనివారం మధ్యాహ్నం మూడో విడత చర్చలు**
- **ఎన్‌టీఏ అధికారుల తొలగింపుతో బాధ్యత తీరదన్న సీజేపీ**

**న్యూఢిల్లీ వెలుతురు జులై 25:**

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విషయంలో కాక్‌రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తన వైఖరిని మరింత కఠినతరం చేసింది. కేంద్రంతో శనివారం జరగనున్న మూడో విడత చర్చలకు ముందు మంత్రి రాజీనామా విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేసింది. ప్రభుత్వం రాజీనామాకు అంగీకరించకపోతే తదుపరి చర్చలకు కూడా అర్థం లేదని సీజేపీ అధికార ప్రతినిధి ఆశుతోష్ రాంకా పేర్కొన్నారు."ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా మా దృష్టిలో చర్చలకు అతీతమైన అంశం. ప్రభుత్వం దీనికి అంగీకరించకపోతే ఇకపై చర్చలు కొనసాగించడంలో ప్రయోజనం లేదు" అని రాంకా సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు.శుక్రవారం రాజ్యాంగ క్లబ్‌లో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లతో సీజేపీ ప్రతినిధులు రెండో విడత చర్చలు జరిపారు. దాదాపు రెండు గంటలపాటు సాగిన ఈ సమావేశంలో సీజేపీ మూడు ప్రధాన డిమాండ్లు, పరీక్షల సంస్కర ణలకు సంబంధించిన ఐదు ప్రతిపా దనలను కేంద్రం ముందుంచింది. వాటిపై ప్రభుత్వ స్థాయిలో చర్చించి శనివారం మధ్యాహ్నం తుది సమాధానం ఇస్తామని కేంద్ర మంత్రులు వెల్లడించారు.సీజేపీ ప్రధానంగా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులపై ఎలాంటి కేసులు నమోదు చేయబోమన్న హామీ, నీట్ పేపర్ లీక్ అనంతరం ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తోంది. ఇందులో నిరసనకారులపై చట్టపరమైన చర్యలు తీసుకోబోమన్న హామీ, పరిహారం అంశాలను కేంద్రం సూత్రప్రాయంగా అంగీకరించిన ప్పటికీ, మంత్రి రాజీనామాపై మాత్రం ఎలాంటి హామీ ఇవ్వలేదు.ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రస్తుతం పరిశీ లనలో లేదని స్పష్టమైంది. "రాజీనామా ఇవ్వడం అత్యంత సులభమైన నిర్ణయం. ప్రభుత్వం మంత్రికి అండగా నిలుస్తోంది. ప్రజలు మాకు పాలనకు అధికారం ఇచ్చారు. ఆ బాధ్యతను మేము నిర్వర్తిస్తాం" అని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.ఇదిలా ఉండగా ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టేందుకు కేంద్రం వరుస చర్యలు చేపట్టింది. పేపర్ లీక్ కేసుల విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. అలాగే కఠిన శిక్షలు, భారీ జరిమానాలకు వీలు కల్పించేలా చట్ట సవరణలు తీసుకురావాలని నిర్ణయించింది. విద్యాశాఖ కార్యదర్శిని మార్చడంతో పాటు జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ)లో 47 మంది అధి కారులను తొలగించింది.అయితే ఈ చర్యలు మాత్రమే సరిపోవని సీజేపీ పేర్కొంది. "ఎన్‌టీఏ అధికారులను తొలగించడం ఒక్కటే బాధ్యత నిర్ధారణ కాదు. పేపర్ లీక్‌లు, వాటి వల్ల విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలకు రాజకీయ బాధ్యత విద్యాశాఖ మంత్రిదే. అందువల్ల ధర్మేంద్ర ప్రధాన్ తప్పనిసరిగా రాజీనామా చేయాలి" అని ఆశుతోష్ రాంకా పునరు ద్ఘాటించారు.



Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com